ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

సంపుటము 41 సంచిక 48

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

ఆగస్టు 17 1949

స్వతంత్రభారత, ★ ద్వితీయ వర్షం ★

భారతదేశంలో ప్రజారాజ్యం (రిపబ్లిక్) స్థాపించినా కూడా అదే ప్రతిపత్తిలో కామన్వెల్త్ రాజ్యకూటమిలో సభ్యత్వాన్ని సాధించి ప్రపంచం మన్నన లందుకున్నారు పండిట్ నెహ్రూ.




జయపూర్ కాంగ్రెస్ సమావేశాధ్యక్షులు డా॥ పట్టాభిగారు "కాంగ్రెస్ వాదులు ఆత్మశోధన చేసుకోవలసిన సమయం వచ్చింది" అన్నారు.






సర్దార్ పటేల్ సాధించిన సంస్థానాల రాజ్యాంగ సంస్కరణల్లో విశాల రాజపుత్రస్థానం చరిత్రాత్మకమైన ఘట్టం.



స్వతంత్ర భారతదేశం విదేశ రాజ్యాంగనీతిలో ప్రాచ్యదేశాల స్వాతంత్ర్యసాధన ప్రధానాంశం. ఇండొనీషియాపై డచ్చి దురాక్రమణను ఖండిస్తూ ఢిల్లీలో అఖిలఆసియారాజ్యాలసభచేసిన తీర్మానం, ఈ రాజ్యాలకు పండిట్ నెహ్రూ నాయకత్వం వహించడం ఇందుకు నిదర్శనలు.



స్వతంత్ర భారతదేశ సర్వసైన్యాధిపతిగా నియమించబడిన ప్రథమ భారతీయుడు లెఫ్టినెంట్ జనరల్ కె. యం. కరియప్ప సాహస పరాక్రమాలకూ మహానానికీ ఏ దేశపు సైనికులకూ భారతదేశ సైనికులు తీసిపోరని ద్వితీయ ప్రపంచ సంగ్రామం నిరూపించింది.



ఆసియాలో భారతదేశ నాయకత్వంపట్ల గౌరవ విశ్వాసాలుగల బర్మా తన దుస్థితిలో భారతప్రభుత్వం స్నేహసహాయాలను కోరింది. పొరుగుననున్న సోదరుల క్షేమమే తమ క్షేమమని తలచే పండిట్ నెహ్రూ ఈ సహాయం కోరి వచ్చిన బర్మా ప్రధాని థాకిన్ నూను ఆదరించాడు.

ఆంధ్రపత్రిక


ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.

Founder : K. NAGESWARA RAO


విరోధి సంవత్సర శ్రావణ బహుళ అష్టమి బుధవారము



భారతజాతి జనకుఁడు గాంధిమహాత్ముఁడు

మహాస్వాతంత్ర్యవీరుఁడా, మానవలోక భవ్యసిద్ధివ్యదర్శకుఁడా, ప్రపంచస్నేహ, విమోచకాత్మత్యాగి, సర్వలోకశుభాకాంక్షాప్రవక్తా,- మహాద్భుతమైన మీ కనుచూపులో ఏ భవిష్యత్స్వప్నము లంతర్లీనమై యున్నవో! జ్ఞానసంభరిత, శక్తిసంకలిత, మనోహర మహోపదేశవాక్యముల ప్రవచించిన ఆ బిగించి నొక్కిన పెదవులచే ఎట్టి ఆత్మానుభవ ఆత్మసాక్షాత్కార గంభీరరహస్యము లతి భద్రముద్రితములై యున్నవో! ప్రపంచ సంక్షోభములమధ్య ప్రశాంతుఁడవై, పలుమారు పరాజితుఁడవయ్యును అజేయ నిరంతరాత్మవిశ్వాసపూరితుఁడవై వృద్ధవయస్కుఁడవయ్యును, ఈఁడులేని ఉత్సాహివై, నిరంతరాందోళనాసంచలిత మానవకోటిపరంపరకు మృత్యుంజయములైన మహోత్కృష్టదయాసత్యముల చిన్మయమూర్తివై వెలసితివి.

—సరోజిని.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ నెల ఆగస్టు 17-వ తేది బుధవారము

స్వాతంత్ర్యదినము

భారతదేశము స్వతంత్రజీవితయాత్రలో మూడవ సంవత్సరము ప్రారంభించుకొనినది.

భారతదేశాంతర్గత పౌరజీవనములో స్వకుటుంబజీవితములలో ప్రమగ్గిపోవలసివచ్చినవారికి ఈ రెండు సంవత్సరములు కష్టభూయిష్టములుగనే కనబడినవి. దేశ ఆంతరంగిక జీవితములో, అనేక క్లిష్టసమస్యలు, పరపాలనకాలమున పాతాళగర్భమున అణగద్రొక్కబడినట్లుండినవై, ఈ కదలింపులో ఒక్కసారిగ ముమ్మరముగ వెలువడి, వాతావరణమునంతను ధూళిసంక్షుభిత మొనర్చి, సరితేరుకొన్న స్థావరము చిక్కించుకొనలేక, స్వేచ్ఛావాయువుల స్వచ్ఛతను ప్రజలకు అవగాహన మొనర్చలేకపోయినవి.

స్వాతంత్ర్యము చేజిక్కించుకొని, సంఘజీవనవ్యవస్థప్రమేయములో కల్పించుకొనకుండ కేవలము, పౌరరక్షణప్రమేయములతో స్వపరిపాలనము సాగించగల్గుటయే, "స్వపరిపాలనము" నూతనముగ జాతికి, బహుక్లిష్టతమమైన పరీక్ష. అట్టితరి, నిత్యపౌరజీవనమున కగు ప్రతి సామాన్యవిషయమునుగూడ, ప్రపంచపరిస్థితుల కారణముననైననేమి బానిసత్వములో ప్రమగ్గిపోయి - ఉత్సాహ ప్రభు మంత్రశక్తియుతముగ స్వయంకృషిప్రోత్సాహములతో, స్వతంత్ర ప్రజాస్వామ్యజీవన మొనర్చు నేర్పు - ప్రతిపౌరునికి క్రొత్తయై, రావలసివచ్చుటవలననేమి, పౌరజీవనములో ప్రతి స్వల్పవిషయమును నూతనదృక్పథములో ఆలోచించి సరిదిద్దవలసిన బాధ్యత ప్రభుత్వముపై పడినది.

స్వాతంత్ర్యము దేశవిభజనమయిననే తప్ప సమకూరని కారణమున, దేశవిభజనతోపాటు చెలరేగిన, మతకలహ, కాందిశీకపునరావాస సమస్యల భీకరస్వరూపమును స్వాతంత్ర్యమందిన మరుక్షణమే, ఇతర సమస్యలు వేటిపైనను దృష్టిపరపుటకు చిన్నమెత్తు అవకాశమునూ లేకుండ, స్వతంత్ర భారతప్రభుత్వము, పురుటిగండములతోపాటి సమస్యలుగ, ఎదుర్కొనవలసి వచ్చినది.

ఈ విధమున, ఒక్కొక్కటి పరిష్కరించుకొనుటకు ఏ దేశమునకైన, శాంతికాలపరిస్థితులలోనే, అనేక సంవత్సరములు పట్టు గాఢమైన సమస్యలను, ప్రతియొక్కటిగూడ తక్షణ పరిష్కారమునకు కృషి చేయనిచో, దేశమును ఛిన్నాభిన్న మొనర్పగల సమస్యలను ఏకకాలమున, పెక్కింటిని ఎదిర్చి సత్వరపరిష్కారమునకై కృషి చేయవలసిన గురుతరభారము, అతిశైశవస్థితిలోనే, స్వతంత్ర భారత ప్రభుత్వముపై బడినది. దేశభద్రత విషయమగు సమస్యల నన్నింటిని భారతప్రభుత్వము, బహుజాగరూకతతో, అతిశీఘ్రకాలములో పరిష్కరించగలిగినదన్న విషయములో, సందేహ ముండుట కాస్కారము లేదు.

కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వములు తప్పులు చేయలేదనుటకు వీలు లేదు. కొన్ని రాష్ట్రప్రభుత్వములు తామనుసరించదలచిన ప్రమాణములకు తగినట్లుగ వ్యవహరించలేకపోయినవి. అయినప్పటికి మొత్తముమీద వారు ఘనకార్యములు కొన్నిటిని సాధించిరనవచ్చును. ఎన్ని అవాంతరములు వచ్చినను దేశమును అరాచకపద్ధతిలో పడకుండ నిలుపగలుగుట అన్నిటికన్న ఘనకార్యము. దీని ప్రయోజనము ఇపుడు తెలియకపోవచ్చును గాని కాలక్రమేణ తెలియగలదు. అంతేకాక కాశ్మీరుపోరాటమును సాగించుచునే హైదరాబాద్ సమస్యను పరిష్కరించిరి. భారతదేశమునంతను అంతర్యుద్ధములోకి దించగలదని భయపడిన హైదరాబాద్ సమస్య నాలుగురోజులలో పరిష్కరింపబడినది. స్వతంత్రములై దేశమునంతను ఆక్రమించగల వనుకొనిన సంస్థానములన్నియు భారతసమాఖ్యలో అంతర్లీనమైపోయినవి. అంతర్జాతీయ రాజకీయముల ప్రభావము లేకపోయిన కాశ్మీర్ సమస్యకూడ శీఘ్రకాలములోనే సవ్యముగ పరిష్కారమగునని ఆశించవచ్చును.

అంతర్జాతీయరంగములో భారతదేశ ప్రతిష్ఠ హెచ్చినది. కామనువెల్తులో ఉండ నిశ్చయించి ప్రజాప్రభుత్వముల కూడలి పక్షమున చేరినది. ఆసియా శాంతికి, మూలస్తంభమైనది. ఆసియాకు నాయకత్వము వహించుచున్నది. స్వతంత్రతనందిన ఇంత కొద్దికాలములో భారతదేశమున్నదే యుండదేమోనన్న భీభత్సపరిస్థితులమధ్య, భారతదేశ అస్తిత్వమును కాపాడి, ప్రపంచ రాజ్యశ్రేణిలో గౌరవస్థానమున నిలబడగల స్థాయికి దేశనామమును తెచ్చుటలో, నేటి భారతప్రభుత్వము జయప్రదముగ వ్యవహరింపగల్గినది. రాజ్యాంగనీతిదృష్ట్యా భారతప్రభుత్వమున కింతకన్న వేరు జయ ముండదు. దేశభద్రతా క్షేమములను, ఆంతరంగికముగను బాహ్యకముగనూ కూడ ప్రభుత్వము సాధించగల్గినది.

కాని, పౌరనిత్యజీవనములో, ఈ కృషియొక్క విలువ, ప్రత్యక్షరూపమున, శాంతికాలములలో కనబడుట కష్టము. అవాంతరము లాఘాతములు పౌరజీవనమునకు తగులకుండ కాపాడురక్ష, అరాచక మేర్పడకుండచేయు రక్ష, పౌరజీవనాంతర్భాగమై అదృశ్యముగ నుండునదే తప్ప, గొప్పగా ప్రకటిత మగునది కాదు. ఇక పౌరజీవనములో నిత్యము ప్రకటితమగునది, నిత్యజీవితావసరములలో, ప్రతిపౌరునికి లభించని జీవితశాంతి— తిండి, గుడ్డ, ఇల్లు వీటి లేమి. ఈ వివాదముల ఆస్కారము చేసికొనియే నేడు అధికారము వాంఛించుచున్న పక్షములన్నియు ప్రభుత్వమును నుయ్యబట్టుచున్నవి. అశాంతికి మూలకారణమైన నిరసనము, ప్రభుత్వములో నున్న పక్షములో నిదా, పాలకయంత్రాంగములోనిదా, కలిసి రాని ప్రజాపక్షములలోనిదాయని కొంత విచారించుకొనుట అవసరము.

గతములో ప్రభుత్వమును ఎడతెగక విమర్శించుట పరిపాటి అయినది. ఆ అలవాటు ఇంకనూ సాగుచున్నది. కార్యదీక్షలేని విమర్శవల్ల ఫలితము మృగ్యము. అందువల్లనే భారతప్రధాని తనస్వాతంత్ర్య దినసందేశములో విమర్శలు క్రియాశూన్యముగ గాక, నిర్మాణాత్మకముగ నుండవలెనని ఉద్బోధించెను.

ఒక పక్షలాభము గాని, ఒక వర్గలాభము గాని, రాష్ట్రలాభము గాని ప్రధానాంశముగా పరిగణింపక యావద్భారత క్షేమమునే లక్ష్యమునందుంచుకొని సమష్టి శ్రేయమునకై కృషి చేయవలెనని విజ్ఞప్తి చేసెను. నేటి దేశస్థితి ననుసరించి, అన్ని పక్షములు తమకు గల విభేదములను గురించి నొక్కి చెప్పుటకంటె తమందరు కలిసి కృషిచేయ వీలైన సమన్వయసూత్రము నొకదానిని అన్వేషింపయత్నింపవలెను. ఏ పక్షమునకు చెందినప్పటికీ ఉత్తములైనవారిని ప్రభుత్వములో చేర్చుకొందుమని భారతప్రధాని తెలిపెను. ఆయన విజ్ఞప్తిని దేశములోని పక్షములన్నియు సహృదయముతో గమనించునుగాక.

ఈ లేములనే గుర్తింపలేకపోయి, తన్నివారణకై, సూత్రప్రాయముగ కృషిని నిర్వచించుకోలేకపోయిన ప్రభుత్వములో నున్న రాజకీయపక్షముదే ఈబాధ్యత యని నిస్సందేహముగ చెప్పియుండవచ్చును. కాని భారత కేంద్రప్రభుత్వము, ప్రభుత్వేతర కాంగ్రెస్ అగ్రనాయకులు కూడ, ఈ సమస్యాపరిష్కారమునకు నిత్యమును ఉపదేశముల నొసగుచునే యున్నారు. ఏడుకోట్ల ప్రజానీకమునకు తిండి లేకుండ శతాబ్దములు గడిచిన దేశములో, దేశప్రజసంఖ్య ఆనాటికన్న వృద్ధి పొంది, కాందిశీకజనసంఖ్య పెరిగి, దేశఆహారసంపద పూర్వమునకన్న తగ్గిపోయిన కాలములో, దేశమున ప్రతిపౌరునికీ ఆహారమును సమకూర్చు బాధ్యతను, పూర్వప్రభుత్వము ఏనాడూ తనపై పెట్టుకొనని బాధ్యతను, నేటి భారతప్రభుత్వము తాను వహించి, కంట్రోళ్లు రేషనింగులద్వారా ప్రతి పౌరునికీ తిండి సమకూర్చ యత్నించినది. తిన్నవాడు తిని, లేనివాడు లేక, అజపజ కనబడనివాడు, ఈ సమస్య బాధ్యతయే నేటి ప్రభుత్వపక్ష విరోధపక్షములకు, వివాదమాత్రముగా మించి కలుగలేదు. నేడు స్వయంప్రభుత్వము లభించిన తర్వాత ప్రభుత్వము సాగించిన రేషనింగ్ విధానమునకు ఆదర్శమునకు విరోధముగ ప్రజాక్షేమవిరుద్ధముగ స్వలాభముల కలవడిన ప్రతీపశక్తులకు దోహద మిచ్చుటకే ఈ వ్యతిరేకపక్షములు వివాదము లుపయోగించుచున్నవి.

పరప్రభుత్వకాలమున బెంగాల్ క్షామమున అసంఖ్యాకజనానీకము మృత్యువువాత బడిననాటికంటె నేడు దేశమున ఆహారపరిస్థితి ఎక్కువ బాగుపడినది లేదు. కాందిశీకుల ఎద్దడి కూడ పైపెచ్చయినది. కాని, దేశమున కరువుప్రాంతములకూడ, అట్టి దౌర్భాగ్యము మరల తల చూపకుండ ప్రభుత్వము నెగ్గుకొనుచు వచ్చినది. 1951 నాటికి దేశమును స్వయం సమృద్ధము చేసికొనవలయునని దీక్ష వహించినది. కాని ఆహారసమస్యా పరిష్కారవిషయమున కాంగ్రెస్ అనుచరణలోపెట్ట నాదేశించుకొన్న సూత్రములలో లోటు లేదు. ఇతర పక్షము లింతకు మించి సూత్రములలో నొలకపోయినదికూడ ఎక్కువ ఏదియు లేదు. ఆహారసమస్య సమస్యగానే మిగిలిపోవుచున్నదన్న, యుద్ధకాలమునుండి బ్లాక్ మార్కెటు కలవాటుపడియున్న పరిపాలనాయంత్రాంగములోని, ఉద్యోగవర్గములోని కొందరిలోనూ, ప్రజాశ్రేణిలోని కొందరిలోనూ ఈ అవినీతి ఘనీభవించి యుండుటయే కారణము. వీరి అలజడి ప్రజకు తగ్గవలెనన్న, జాగ్రత్త వహించుటకు

నవల

సాక్షిగాలి

వి.టి. ప్రసాదరావు

౯

మర్నాడు పదిగంటలకే పెండ్లికూతురువారు పంపించిన పెండ్లిబండీ వచ్చింది. పెండ్లికూతురుచూపులకు రాఘవరావుతో సహా ఆ దంపతు లిద్దరూ బయలుదేరారు

కాలవవడ్డునే పచ్చనిచెట్లమధ్య, నిండుగా కన్పించే వాల్గొంభవంతికి బండీ చేరి ఆగంది ఆ ఊరిలోకల్లా ఆ యింటినిమించిన యిల్లు కన్పించటం లేదు ఇల్లు సిరిసంపదలతో తూగుతున్నట్లు బైటికే పచ్చపచ్చగా ఆకర్షణీయంగా కనబడుతూంది.

గృహయజమాని బండికి ఎదురు వచ్చాడు. దబ్బపండులాంటి శరీరచ్ఛాయ నడివయస్సు దాటినా, సడలియని కాయపుష్టి పల్లెటిదిక్కునే గౌరవప్రదంగా, సుఖంగా, శాంతంగా జీవితం గడుపుతూ, నలుసరికే తలలో నాలికైన వ్యక్తి ముఖంలో ఉండే, హుందాతనమూ, ప్రశాంత మందహాసమూ, సౌభాగ్యసంపత్తులతో వెలుగుతున్న పెద్ద కుటుంబానికి దక్షుడైన గృహమేధిత్వచ్ఛమూ, ఆయనముఖంలో ప్రకాశిస్తున్నాయి. ఆయన్ని చూడగానే రాఘవరావుకు సహజంగా గౌరవభావం కలిగింది.

ఆ మేనమామతో సరస సల్లాపా లాడుతూ, మొగవాళ్ళ నిద్దరనూ వెంటబెట్టుకొని ఆయన పంచపాళీలోకి తీసుకొని వెళ్ళాడు. ఇంటి ముంగిలిదోవలో ఇరుపైపులా అరటిచెట్లూ, వెనుక వెనుకగా నున్న మామిడిచెట్లూ ఉన్నవి. ఇంటిముంగిలికిదారీ ముందు పందిరి, సింహద్వారసౌభాగ్యమూ, రాజప్రాసాదంలో ప్రవేశిస్తున్నట్లున్నాయి. ఇంటి కిరుప్రక్కలా గోడలబారువ ఉన్న చలవరాతి అరుగులమీద, పందిరిలో చాపలమీదా, భోజనా లయిన తీరుబడితో నడివయస్కులూ, బాలురూ, బాలికలూ, పెద్దలూకూడా చాలామంది కూర్చుని ఉన్నారు. ఒక వైపు అరుగుచివర చతురంగం ఆడుతూ కూర్చున్న ఇద్దరు యువకులలో ఒకర్ని పిలిచి "అబ్బాయీ! బాబుగార్కి కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు యిచ్చెయ్యరా! పెద్దమ్మాయి, ఆడవారిని లోపలికి తీసు కెళ్ళమ్మా" అని ఇంటిఆయన అతిథిసత్కారాలకు పురమాయించాడు.

అందరూ ఆగంతుకులవంక చూస్తున్నారు కాళ్ళుకడుక్కునేందుకు నీళ్ళుదండిగా చెంబులూ పందిరిగుంజవద్దనే ముందరే ఉన్నాయి.

ఆ అబ్బాయి లేచి వచ్చాడు

"ఎందుకోయ్! మేం కడుక్కుంటాంగా" అంటూనే, ఆ మేనమామ కుఱ్ఱవాడిచేతిలో చెంబు అందుకొని కాళ్ళు కడుక్కున్నాడు. కడుక్కుంటూనే "ఏం, చదువుతున్నావోయ్!" అని అడిగాడు.

"మొన్ననే బి. ఏ పరీక్షకు వెళ్ళాను."

రాఘవరావు కొంచెం చకితుడై అటు చూశాడు. ఆ కుఱ్ఱవాడేమీ తోచకలేదు. అతని మొగంలో పాలబుగ్గల నేవళమైనా ఇంకా తగ్గినట్లు లేదు. తనకంటే చిన్నలాగే చూపులకు కనబడుతున్నాడు

అచ్చు అతని మొగమే, ఆడురూపంలో పోతపోసినట్లున్న ఒక సౌభాగ్యయువతి, బండిలో వచ్చినామెను, అటుప్రక్క నుమ్మం నుంచి ఇంట్లోకి తీసికొని వెళ్ళింది.

యజమాని వీరి యిద్దరినీ ఇంటిముందుహాలు లోకి తీసికొని వెళ్ళాడు. హాలుగోడల పైవరుసని, రవివర్మ గీసిన రామాయణ భారత చిత్రాలూ అని వరుసగా వేలాడ గొట్టి ఉన్నాయి. హాలులో పెద్ద పెద్ద వాలుడు, పేము కుర్చీలు అమర్చిఉన్నాయి. హాలు ఒక ప్రక్కన బల్ల ఉయ్యాలమీద రత్నకంబళిం పరిచిఉంది హాలులో గోడలప్రక్క ఎత్తు అరుగులమీద తివాచీలు బాలీసులూ పరిచిఉన్నాయి.

గృహయజమాని ఆ బాలీసులపై వా ళ్ళిద్దరకూ ఆసనాలు చూపించి, తాను ఉయ్యాలబల్లమీద కూర్చున్నాడు. ఏడేళ్ళపిల్ల, ఒకతె పరుగెత్తుకొంటూ ఉయ్యాలలో కూర్చున్న తండ్రివద్దకు వచ్చి ఆయనఒళ్ళో కూర్చుని రాఘవరావు మొగంవంక పరకాయిస్తూచూస్తూ కూర్చుంది.

పందిట్లో కూర్చునిఉన్న ఒకరిద్దరు పెద్దలూ, మధ్యవయస్కులూ, హాలులోకి వచ్చి, హాలులో రెండవవైపు అరుగులమీద కూర్చున్నారు.

గృహయజమాని వాళ్ళనందరనూ ఎరుకపరుస్తూ తమ విషయమంతా పరిచయ వాక్యాలలో మళ్ళీ చెపుతున్నాడు. ఒకాయన ఆయన తమ్ముడు. వ్యవసాయాదికాలన్నీ ఆయనే చూస్తుంటాడు. వారు అన్నదమ్ములు ముగ్గురు. యజమాని పెద్ద. నడిపివ ఆయన తాసిల్దారు ఉద్యోగంలో ఉన్నాడు. బైట చతురంగం ఆడుతూ కూర్చున్న వారిద్దరూ యజమాని మూడవ నాల్గవ కుమారులు. పెద్దవాళ్ళిద్దరూ పట్టణాలలో ఉద్యోగాలలో ఉన్నారు. ఆయన దగ్గర కూర్చున్నపిల్ల కడసారిది. పెళ్ళికూతురికీ, ఈ అమ్మాయికీ మధ్య ఇంకో కుఱ్ఱవాడున్నాడు. బైట ఎక్కడో ఆడుకోటానికి వెళ్ళాడు. కూతుళ్ళు మొత్తం నలుగురు. పెద్దకూతు ళ్ళిద్దరూ కాపురాలు చేస్తున్నారు. పెద్ద అల్లుడిది ఆ ఊరే. రెండవ అతను, పట్టణములో రెండువందల రూపాయల ఉద్యోగంలో ఉన్నాడు.

ఇందొకటి అబ్బాయే రెండు వెండి పళ్ళాలలో పూరీలూ, మామిడి పళ్లూ, మరే వేవో భక్ష్యాలూ అన్నీ తెచ్చి, వాళ్ళిద్దరిముందూ పెట్టాడు. ఆ మేనమామ, "ఓహోహో చాలా తదంగంపెట్టారే" అంటూ సల్లాపా లాడుతూనే, "పుచ్చుకో, అబ్బాయి" అని రాఘవరావుకు పురమాయించి, పళ్లెం కాళీచేస్తూ సల్లాపాలు సాగిస్తున్నాడు. అక్కడున్న వాళ్ళందరకూ కూడా ఫలహారాలు వచ్చాయి. రాఘవరావు కొద్దిగా ఫలహారం సంగ్రహించి ఆలోచిస్తూ కూర్చున్నాడు; గృహయజమాని ఆ మేనమామ సల్లాపాలకు మందహాసంతో జవాబులు చెప్తూ చాలా ప్రీతికరంగా సంభాషిస్తున్నాడు.

రాఘవరావు లోపలి గుమ్మంవంక చూస్తున్నాడు. హాలులోపలి కున్న కిటికీల రెక్కల వెనుకనుంచి ఇంటి స్త్రీలు ఒక్కొక్కరే కాబోయే పెండ్లికొడుకుని తొంగిచూసి గిరుక్కున మరలుతున్నారు.

ఇందాక మేనత్తగారిని లోపలికి తీసికొని పోయిన యువతి, ఒక పన్నెండేళ్ల కన్యను, హాలులోపలి గుమ్మందాకా తీసికొనివచ్చి, అక్కడున్న కుర్చీ చూపించి, తాను లోపలికి వెళ్ళిపోయింది. ఆ కన్య తలవంచుకొని ఆ కుర్చీలో కూర్చున్నది

అందరిలో, కాబోయే భర్తగా ఆ అమ్మాయి వంక పరకాయించి చూడటానికి రాఘవరావుకు సిగ్గు వేసింది. గంగన్నదగ్గర ప్రభావతిని ప్రథమంగా చూసినప్పుడు ఈ జాగ్రత్త కలగలేదు. అటు ఇటూ చూస్తున్న చూపుల సందులోనే ఒక్కొక్క క్షణంతో, ఆ అమ్మాయిని చూశాడు. బండిలోనుంచి తండ్రిని చూసినప్పుడే, ఆ అమ్మాయి రూపంవిషయంలో అనూహ్యంగానే భావనలో ఒక స్వరూపం చిత్రితమయింది. ఆ కన్య తను అనుకొన్నంతకన్నా చాలా అందంగానే ఉంది. రూపంలో అందంకన్నా, కన్యాత్వ ముగ్ధత్వంలోని సహజసౌందర్యమేదో, ఆ నత వదనంలోనుంచే, అతనికి కనిపిస్తూంది.

మేనమామ పిల్లను పలకరిస్తున్నాడు. పెళ్ళికూతురు చూపులపేరిటి తదంగం కొంత సంభాషణ సాగిస్తున్నాడు. పెళ్లికూతురు, పల్లెటి చిన్న చదువు లేవో తప్ప పెద్ద చదువులేమీ చదువుకోలేదు. సాంప్రదాయకంగా ఇళ్లల్లో తెలిసిన చదువులు మించి చదువులు రావు. సంగీతం చెప్పించలేదు. సంగీతవిషయం ఎత్తేటప్పటికి గృహయజమాని స్వల్పనిరసనం తెల్పే అలతినవ్వుతోనే మృదువుగానే, "అవేమీ మాకు అలవాట్లు లేవండి" అని చెప్పాడు.

"పోనీ భారత భాగవతాలలో పద్యాలేవైనా చదువగలదా" అన్నాడు మేనమామ.

రాఘవరావుకు, ఆ కన్యను పల్లాంటి పరీక్షలలోకి దింపటానికి అసహ్యమే వేస్తూంది. కాని ఆ అమ్మాయి పలుకు వినటానికి కుతూహలంగానే ఉంది.

రుక్మిణీ కల్యాణంలో పద్యాలు చదువుతోంది. కంఠంలో అధిక మాధుర్యమేమీ లేదు. ధారణశక్తి ఏమంత గొప్పది కాదు. కాని, బెరుకుతనంతో ఆ కన్య పద్యం చదువుతూంటే, రాఘవరావుకు, మధురంగానే అనిపించింది.

"మ్మవింక లోపలికి వెళ్ళవచ్చమ్మా!" అని తండ్రి కూతురుకు చెప్పాడు. ఆ అమ్మాయి, లోపలి గుమ్మంలోకి తిరగటంలోనే రాఘవరావును అవగాహన చేసుకో ప్రయత్నిస్తున్నట్లు, నిర్వికారంగా, ఒకచూపు చూసి, ఆ వెనుక్కు తిరగటంలోనే, విడిచూపులాగా కాకుండా, ఆ వీక్షణాన్ని లీనంచేసేసి, లోపలికి వెళ్ళిపోయింది. తండ్రివద్ద కూర్చున్న చిన్న పిల్ల గంతులు వేస్తూ లోపలికి అక్కయ్యవద్దకు పరుగెత్తి పోయింది.

ఇంకో పదినిముషాలు మరే వేవో, అప్రస్తుత లోకాభిరామాయణంతో మేనమామ, గృహయజమానితోనూ అక్కడున్న వాళ్లతోనూ ప్రసంగం సాగించాడు.

"సరే మేం వెళ్లివస్తాం" అన్నాడు మేనమామ. రాఘవరావు వెంటనే నిలబడ్డాడు.

గృహయజమాని మందహాసంతో "అప్పుడే వెళ్తారా! ఇంకా వచ్చినట్లే లేదు. ఇవాళ ఇక్కడే ఆగండి" అన్నాడు.

మేనమామ నవ్వుతూ, "ఇవాళ ఆగితే, మరి మాతో బాంధవ్యం పెట్టుకోరన్నమాట. కతికితే అతకటం ఎల్లా కుదురుతుందండీ" అంటూ తన హాస్యధోరణికి తానే పెద్దగా నవ్వాడు. అందరూ మందహాసాలు చేశారు.

"ఆ! అవి ఇప్పుడు అంత పాటింపు లేవులెండి" అన్నాడు గృహయజమాని.

"ఎందుకండీ! ఇకముందంతా ఇక్కడుండేవాళ్లమే కాదండీ. మీరు పొమ్మన్నా పోకుండా తిష్ట వేయమూ!"

"అంతకన్నా మాకు కావాల్సిందే లేదు. నలుగురు మాతో కలిసి ఉండటమే మాకూ సంతోషం" అని గృహయజమాని మందహాసం చేశాడు. నవ్వులకు అన్నా ఆయింటి విషయంలో, ఆ భావన యథార్థమే అనిపించింది రాఘవరావుకు.

చివరికి బయలుదేరారు. యజమాని చిన్నపిల్లనెత్తుకొని సాగనంపటానికి మరి ఇద్దరితో వెంట వచ్చాడు. బండిలో ఆమె ముందు కూర్చుని ఉంది రాఘవరావూ మేనమామా, గృహయజమానితో కలిసి రెండడుగులు నడుస్తున్నారు బండి కదిలింది.

"అబ్బాయి నువ్వు బండి ఎక్కు"

రాఘవరావు బండి ఎక్కాడు. మేనమామ, గృహయజమాని బండికి ప్రక్కగా నడుస్తున్నారు. తక్కినవాళ్లు వెనక్కు సర్దుకొన్నారు.

బండి నూరు గజాలు కదిలి వచ్చింది.

"మీ రాగండి అన్నగారూ! నేను మళ్లీ ఎల్లుండి మిమ్మల్ని సావకాశంగా కలుసుకొంటాను."

అని ఆయనకు నిష్కర్షలు చెప్పి, మేనమామ కూడా బండి ఎక్కి చివరికి కూర్చున్నాడు.

"మరి అంత చివర కూర్చున్నారేమిటి ఎండ పడుతుంది. పైకి రండి. ఇంకొంచెం పైకి జరగవోయి."

"ఆ ఫరవాలేదులే," అంటూనే ఆయన కొంచెం లోపలికి జరిగాడు.

రాఘవరావు ఇంకొంచెం సర్దుకోవలసివచ్చినది. ఆమె దేహం తగుల్తూంది. ఆమె గమనించినట్లులేదు. ముడుచుకొని సర్దుకొని కూర్చున్నాడు

మామ బండివెనకనుంచే, ఆ యింటివారిని గురించిన ప్రశ్నలు బండిమనిషిని అడుగుతున్నాడు. సిరిసంపత్తులతో నిండుగా ఉన్న కుటుంబం అన్న విషయాలే బండిమనిషిసంభాషణలోనూ తేల్తున్నాయి. మామ మాత్రం చప్పరింపుగానే ఎదురు ప్రశ్నలు వేస్తూ సంభాషణ సాగిస్తూన్నాడు.

"ఏమయ్యా పెళ్లికొడుకా పెళ్లికూతురు నచ్చిందా," విలాసపునవ్వుతో ఆమె అడుగుతూంది.

రాఘవరావు మౌనంగానే కూర్చున్నాడు.

"అందమైన పెళ్ళాం దొరికింది. ఇక బంధువులెవరితోనూ మాట్లాడేవా ఏమిటి?" అని కిసుకిస్తూ ఆమె నవ్వింది.

రాఘవరావు ప్రతిభాషణగా మందహాసం మాత్రం మొగంలోకి తెచ్చుకున్నాడు.

ఆమె కాలు సర్దుకొంటున్నట్లుగా విస్తరించుకొంటూ కూర్చుంది.

"ఆ అమ్మాయికన్నా, పెద్దఅప్పగారి మొగం మంచికళగా ఉంది" అంటున్నాడు మేనమామ. "నా మొహం అందాలు! అందాలు లేక పోయినా అందమైనవాళ్లమన్న గర్వానికెక్కువ" అని ఈసడించింది...ఆ ఆడవాళ్లందరినీ ఈసడిస్తూ సంభాషణ సాగించింది. తనలో వారిపట్ల వ్యగ్రతపురికొల్పేందుకు ఎందుకు ప్రయత్నిస్తూందో రాఘవరావుకు తెలియలేదు. ఆమె నసలు అర్థం చేసికోలేకుండా ఉన్నాడు. కాని అర్థం చేసుకోవాలన్న ఆపేక్ష పోయింది.

...ప్రభుత్వము కన్న ప్రజలకే బాధ్యత ఎక్కువ ఉన్నది. కాని ప్రభుత్వముకూడ క్రియాపూర్వకముగ ప్రోత్సాహము గల్గించిన గాని, ప్రజలీ జాగృతిని సరిగా ప్రదర్శించుకొనగలుగుట కష్టము. ప్రభుత్వ మీ విషయమున యావద్భారతప్రజానీకమునకు ప్రాతినిధ్యపక్షము తప్ప, కాంగ్రెస్, కాంగ్రెసేతరముగ భావించుకొన వీలు లేదు. వస్త్ర, గృహ సమస్యలు కూడ ఆహార సమస్యాప్రథమునకు ప్రతిబింబప్రథములలోనే వృద్ధి పొందినవి. వీటి పరిష్కారమునకు, ప్రతి పౌరుడును ఈ ప్రభుత్వములో భాగస్వామి ననుకొనగలిగి, ఈ దేశక్షేమస్థాపనలో తన భారమును గురుతర మని భావించుకొనగలిగి ఆత్మవిశ్వాసముతో కృషి చేయ దీక్ష వహించిననాడే, సర్వసమస్యలకు పరిష్కారము సాధ్యము.

స్వాతంత్ర్య ద్వితీయవర్షం

ప్రజల్లో నైతిక దృక్పథం ఏర్పడాలి

[కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ శంకరరావ్‌దేవ్]

వర్షాంతంలో గతాన్నొకసారి తిలకించడం మామూలు. ప్రతి వర్తకుడూ సంవత్సరాంతాన చిఠా తిరగవేసి ఆ సంవత్సరంలో ఆయవ్యయాలు, లాభనష్టాలు పరిశీలించి దానిపైన ముందు కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటాడు. భారతదేశం స్వతంత్ర జీవనంలో రెండుసంవత్సరాలు గడిపింది. స్థిరవిశ్వాసంతో, ధీరంగా మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. అందువల్ల జాతిఅంతా సారభారాల్ని ఒకసారి పరికించడంవల్ల ప్రయోజనం ఉంటుంది ఇక్కడ 'జాతి' అనే మాటను తెలిసే వాడుతున్నాను. ఎందువల్లనంటే కొందరు పార్టీనాయకులు, కొన్నివర్గాలవారు స్వార్థపరత్వంతో ప్రజల దోషాల్ని, క్షమించి మరచి కేవలం కాంగ్రెస్ సంస్థకే గత రెండుసంవత్సరాలుగా దేశంలో సంభవించిన కల్లోలానికంతకీ దోషంకట్టి నిందిస్తున్నారు ఈ స్వార్థపరత్వం ఆత్మహత్యాసదృశం ప్రజాసామాన్యం అనుభవిస్తున్న దుఃఖదారిద్ర్యాలకూ యాతనలకూ కాంగ్రెస్ నే దూషిస్తున్నారు. కాంగ్రెస్ సంస్థను ఫాసిస్టు సంస్థ అనీ, నిరంకుశపాలక యంత్రమనీ పేర్లు పెడుతున్నారు. కాని కాంగ్రెస్ ఏ పరిస్థితుల్లో వ్యవహరించవలసి వచ్చిందో మరచిపోవడం, తెలిసి కూడా దాచివెయ్యడం వారికి అనుకూలంగా ఉంది.

మనజాతి చరిత్రలో ఈ పరిణామ దశను గురించీ, ఈ క్లిష్టకాలంలో కాంగ్రెస్ సంస్థ నెరవేర్చిన కార్యాలనుగురించీ ముమ్ముందు చరిత్రకారులే నిర్ణయించగలరు వారే కాంగ్రెస్ పొందదగిన ఉచితస్థాన మివ్వగలరని నావిశ్వాసం దేశసేవలో కాంగ్రెస్ సంస్థ ఉచితపాత్రను నిర్వహించింది. దేశంలో చెలరేగుతున్న సాంఘిక విరోధశక్తుల్ని ఎదిరించి, జాతీయ విరోధశక్తుల్ని ఎదిరించి పోరాడ్డానికి జాతీయశక్తు లన్నిటినీ సంఘటించ గలిగింది. కష్టార్జితమైన దేశస్వాతంత్ర్యాన్ని నలుదిక్కులనుంచీ ముట్టడించిన ప్రమాదాలనుండి కాపాడి, స్థాయిని చేకూర్చింది. అందువల్ల విజయం కానీ పరాజయం కానీ కాంగ్రెస్ సంస్థ కొక్కదానికే చెందదు జాతి అంతకీ చెందుతుంది ప్రస్తుత క్లిష్టపరిస్థితిని గడవాలంటే జాతి జాతి అంతా చేతులు కలపాలని మనలో ప్రతి ఒక్కరూ జ్ఞప్తిలో ఉంచుకోవాలి

గడిచిన రెండుసంవత్సరాల్లో మనం సాధించిన దేమిటి? స్వాతంత్ర్య సాధనానంతర సమస్యల విషయంలో కాంగ్రెస్ పరిష్కారం చెయ్యగలిగిందని నిస్సంకోచంగా చెప్పవచ్చును. దేశవిభజన జరిగినవెంటనే మతోన్మాదీ, ఖలితంగా దేశంలో, ముఖ్యంగా వాయువ్యప్రాంతంలో భ్రాతృహత్యలు చెలరేగినవి

అంతర్యుద్ధ ప్రమాదంలో పడిపోయింది. ఈచిచ్చుని వెంటనే ఆర్పి వెయ్యలేక పోయినట్లయితే దేశం అంతటా మట్టుకునేదే ఇప్పుడు మతద్వేషం సమసిపోయింది ప్రజల జీవనానికీ, జాతి ఐక్యతకీ పెద్ద ప్రమాదం తొలగిపోయింది లెక్కలేనన్ని సంస్థానాల్ని కూటాలుగా చేర్చి, ఇతరత్రా యూనియన్లోకి కలిపి వానికి పరిపాలన, రాజ్యాంగ, ఆర్థికవ్యవహారాలలో రాష్ట్రాల స్థానం నిచ్చారు సంస్థానాల నిరంకుశ పరిపాలన పోయి ప్రజాపరిపాలన నెలకొల్పబడింది. భారతదేశ రూపపటం పూర్తిగా మారిపోయింది దేశానికీనాడున్న ఐక్యత ఏనాడూ చరిత్రలో లేదు

ఈనాటికీ గృహచ్యుతులు, ఆశ్రయహీనులు 50 లక్షలమంది పునరావాస సమస్య మన కార్యదక్షతకీ, సహాయోగ్యతకీ లొంగలేదు. లక్షలాది మనదేశస్థు లనుభవిస్తున్న యాతనలు హృదయ విదారకంగా ఉన్నాయి. పాకిస్తాన్ మోసపు వైఖరి వినాశకరంగా ఉంది నిరాశ్రయుల పునరావాస సమస్యకు సూత్రప్రాయపరిష్కారమార్గం కనపడదు. వ్యవధిపట్టక తీరదు ఇంతవరకూ చేస్తున్నట్టే శరణార్థులు స్వయంకృషిపైనా స్వయంసహాయసూత్రంపైనా ఆధారపడి, ప్రభుత్వంపై ఆధారపడ్డం తగ్గించినట్లయితే ఈసమస్య త్వరలో పరిష్కార మవుతుంది. అయితే ప్రభుత్వం ఇంకా మరుగ్గా పనిచేసి ఈ సమస్యకి ప్రధానస్థాన మివ్వవలసిన అవసరం ఉంది ప్రజల సహకారంతో, ముఖ్యంగా శరణార్థుల సహకారంతో ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్యకు పరిష్కార మార్గం కనిపెట్టగలదు

అంతర్జాతీయవ్యవహారాల్లో మన దేశం ప్రశంస లందుకున్నది ప్రపంచంలో ప్రజ్ఞాస్థాన మాక్రమించింది స్వాతంత్ర్యసిద్ధి అనంతరం కనీసవేతన నిర్ణయశాసనం, ప్రభుత్వభీమాశాసనం మొదలైన సాంఘిక ఆర్థిక సంస్కరణ శాసనాలు తెచ్చి ప్రభుత్వం ప్రధానమైన పరివర్తనలు తెచ్చింది పెద్దపెద్ద పారిశ్రామిక, వ్యావసాయిక, విద్యుచ్ఛక్తివృద్ధి కార్యక్రమాలు తయారైనాయి. వీనిపైన కోట్లాదిగా ధనం వెచ్చిస్తున్నారు నైతిక, సాంఘిక, విద్యావ్యాపక కార్యక్రమాలు మొదలైన వానివల్ల సామాన్య ప్రజల జీవనం సుఖవంతం కాగలదు?

ఇది ఆర్జన అయితే నష్టంకూడా అధికంగా వుంది మన స్వాతంత్ర్యానికి ప్రమాదం సంభవిస్తే దీనివల్లనే సంభవించాలి. వస్తూత్పత్తిలో తరుగుదల, అవినీతి, లంచగొండితనం, లాభాల దురాశ, బ్లాక్ మార్కెటింగ్ మొదలైనవాని ఫలితంగా నిరుద్యోగం, చలామణీ పెరుగుదల, అవసరవస్తువుల కొరతి మొదలైన సమస్యలు పరిష్కారం కాలేదు. వీనిని గురించి అధికశ్రద్ధ వహించడం అవసరం వస్తూత్పత్తి సమస్య పరిష్కారం కాగలిగితే, ఈనాడు దేశాన్ని పీడిస్తున్న రాజకీయసమస్యలు కూడా వాటంతటవే క్రమంగా అంతర్ధానం కాగలవు

ద్వితీయప్రపంచ సంగ్రామం అనంతరం ఈ దుర్యోగాలవల్ల ప్రపంచం యావత్తూ బాధపడుతోంది భారతదేశం తప్పించుకోలేదుగదా యుద్ధకాలంలో నైతికసంపద నాశనం కావడం నీతి ప్రమాణాలు తగ్గడంవల్ల మానవసహజమైన మూల్యాలపట్ల నిర్లక్ష్యం ఏర్పడింది సకాలంలో ఉచితమైన చికిత్స జరిగితేగాని ఆధునిక సాంఘిక, ఆర్థికవ్యవస్థకే ముప్పు వస్తోంది యుద్ధంవల్ల ధ్వంసమైన ప్రపంచవ్యవస్థను పునర్నిర్మించడానికి ప్రపంచమంతా మార్గాలు వెతుకుతోంది. కాని సాంఘిక, ఆర్థిక పునర్నిర్మాణం జరిగేముందు, నైతిక సంస్కరణ వచ్చి తీరాలి మానవునిలో నీతిచైతన్యం తెస్తేగాని ఈ బాధల నుండి ముక్తి పొందడం అసంభవం మానవుడు తనకుగాని, తోటివారికిగాని శాంతి హితాలు పునాదిగా గల శాశ్వతమైన ఆర్థిక సాంఘిక వ్యవస్థను నిర్మించలేడు.

అవినీతి, లంచగొండితనం, చాటువ్యాపారం మొదలైనవానిని ప్రభుత్వం కఠినంగా అణచివెయ్యాలన్నమాట అంగీకరించదగినదే. చీనాలో కొమింటాంగ్‌కి ఏ గతిపట్టిందో కాంగ్రెస్‌కూ అదే గతి పట్టుతుందని కొందరంటున్నారు. ఈ పోలిక ద్వేషం అసంగతమనీ, అసహ్యమనీ అనవచ్చును కానయితే హెచ్చరికనుమాత్రం గమనించవలసిన అవసరం ఉంది తీవ్రరోగాలకి చికిత్స తీవ్రంగానే ఉండాలి ఈ దుర్నీతి అణచడానికి ప్రభుత్వం ఎంత కఠినంగా వర్తించ దలచినప్పటికీ, ప్రజల సహాయసానుభూతులూ, సహకారమూ లేనిదే అణచడం అసాధ్యం పోలీసు చెయ్యగలిగేదల్లా దొంగని పట్టుకోడమే. న్యాయస్థానం దొంగకి శిక్ష విధిస్తుంది కాని దొంగ దొంగ కాకుండా పోలీసు న్యాయాధికారీ వాదీ కలిసినా నివారించలేరు.

ఈనాడు మనసంఘం బాధపడుతున్న యాతన లన్నిటికీ మూలం అవినీతి. ఈ మూల రోగాన్ని చికిత్సచేస్తేగాని జాతికి కల్లోలం అరాచకం సంభవించక తప్పదు. దేశంలో సర్వవ్యాప్తమైన నైతిక వాతావరణం తేవాలి అప్పుడే ప్రజల ఆలోచన, ప్రవర్తన సక్రమంగా ఉండగలవు నీతి కనుగుణమైన చర్య వ్యక్తిగతమైనది అందువల్ల ఈ విషయాలలో తానుతప్ప మిగతా అందరూ దోషులని నిందించడంవల్ల ప్రయోజనం ఏమీ ఉండదు ఇతరు లెలా ప్రవర్తించినా నిమిత్తం లేకుండా ఎవరంతి వారు తమ ప్రమాణాల్ని బట్టి వర్తించాలి ఇతరులు మనల్ని అనుసరించాలంటే అదొక్కటే మార్గం పునర్నైతిక ధారణకై అనగా వివేచన, జ్ఞానంతో సక్రమవర్తనను ఆదర్శంచూపే ఉద్యమం ఒకటి ప్రారంభం కావడం వెంటనే అవసరం ఈ పవిత్రదినం జాతిఅంతా ప్రజల నైతిక సముద్ధరణ కోసం కంకణం కట్టుకోవాలి కాంగ్రెస్ వాదులు ఎప్పటమాదిరిగా ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాలి ప్రజానీకం తప్పక అనుసరిస్తుంది

మనకు స్వాతంత్ర్యంతోపాటు వ్యాపారంపై నిర్బంధాలు, లభ్యానలు, చాటువ్యాపారం, అవినీతి, లంచగొండితనం కూడా లభించడం చారిత్రక గుర్తటనే అనుకోవాలి కాని ఈ కాలదోషం గడిచిపోక తప్పదు అవే శాశ్వతంగా ఉంటే మన స్వాతంత్ర్యం అంధకారంలో పడిపోతుంది అరాచకం కల్లోలం సంభవిస్తాయి. ఏది ఏమయినాసరే దీనిని అంతరింపచెయ్యాలి నైతిక పునర్వికాసమే మనల్ని వినాశంనుంచి కాపాడగలిగేది నైతికవాతావరణం తెచ్చినట్లయితే ప్రజలుకూడా కృషికి కష్టానికీ అలవాటుపడగలరు. వస్తుసంపద వృద్ధిఅయితే ఈ కీడు పోవడమే కాదు, మన స్వాతంత్ర్యం సార్థకం కాగలదు. స్వాతంత్రం అంటే సామాన్యజనులకు స్వేచ్ఛావకాశా లిచ్చి వస్తూత్పత్తివృద్ధికృషికీ, సామాన్యజనుల సుఖజీవనానికీ తోడ్పడాలి కాని దురదృష్టవశాత్తూ ఈనాడు సామాన్యజనులు స్వాతంత్ర్యాన్ని ఈ రీతిగా అర్థంచేసుకోడం లేదు "ఉత్పత్తి చెయ్యండి లేదా నాశనం తప్ప" దని మనం చేసే నినాదాలు వారి హృదయాలలో ప్రతిధ్వనించడం లేదు బహుశా శతాబ్దాల తరబడి బానిసత్వం అనుభవించిన జనసామాన్యానికి బ్రతుకులో రక్తి ఉత్సాహం చచ్చిపోయినవో కాబోలు

నా ఉద్దేశంలో ఈ రోగానికి మూలహేతువు నింకా లోతుకి వెదకాలి. అది మన మతంలోనూ, మన సంస్కృతిలోనూ గోచరిస్తుంది మన చిరకాల మతసభ్యతా సాంప్రదాయాలు మనలో ఇహలోకజీవనంపట్ల అశ్రద్ధ నిర్లక్ష్యం నేర్పెట్టాయి ప్రపంచంలోని మిగతా మతాలవలెనే హిందూమతంకూడా ఇహలోకంలో సుఖసంపదలకోసం చింతపడడం మాయారహితమైనదీ, చిరసౌఖ్య మొనగూర్చేది, ఉత్కృష్టమైనదీ పరలోక సౌఖ్యంకోసం పాటుపడ్డం మేలని బోధిస్తుంది ఇహలోకజీవనం క్షణభంగురమనీ, దుఃఖభూయిష్ఠమైనదనీ, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా దీనినుంచి ముక్తి పొందాలనీ నిత్యం మన చెవుల్లో నూరిపోశారు దేహం అస్థిరమైనదనీ, పునర్జన్మ లేకుండా పుణ్యమార్జించడం వివేకమనీ బోధించారు

దీనికి ఫలితం ఏమిటంటే అగోచరమైన స్వర్గంకోసం ప్రత్యక్షజీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నాం అందువల్ల భూతలంలో స్వర్గం నిర్మించాలంటే జనసామాన్యం దృష్టిని ఇహలోకానికి మరల్చాలి వారిలో స్థిరవిశ్వాసాల్ని కలిగించి దృక్పథాన్ని ఋజుమార్గంలో పెట్టగలిగితే ఈ జీవితాన్ని సుఖమయంగానూ, ఉత్కృష్టమైనదిగానూ చేసి వాస్తవవిషయాలపైకి వారు శ్రద్ధ వహించేలాగ చేయవచ్చు ఈ కార్యాన్ని సాధించాలంటే మతి, సభ్యత సాంప్రదాయాల్లో విప్లవమొకటి రావాలి. ఇహలోకజీవనం వికసించి సుగంధపరిమళంతో నిండాలంటే మతసభ్యతల్లో ప్రేమ లోతుగా పాదుకోవాలి.

కాని ప్రజలదృష్టి స్వర్గంనుంచి భూమికి మరలాలంటే ఇక్కడేదో ఆకర్షణ ఉండాలి. వారి కష్టాలకు ఫలితం వారికి లభించాలి కేవలం లాభార్జనపైనా, తద్వారా పరజనపీడనపైనా ఆధారపడిన ప్రస్తుత సాంఘికవ్యవస్థలో ఇది అసంభవం. విపరీతవ్యత్యాసాలకీ, పరజనపీడనకీ వీలు లేని సాంఘికవ్యవస్థ నిర్మాణం అయితే కాని ప్రజాసామాన్యానికి 'స్వరాజ్యం' ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని మనమే చెప్పాం. అంటే సర్వసమత్వ సిద్ధాంతాన్ని బలపరిచాం ఇది సాధించాలంటే మన స్వాతంత్ర్యాన్ని సంఘ ఆర్థికసిద్ధాంతానికి కూడా వర్తింపచెయ్యవలసి ఉంటుంది స్వాతంత్ర్యం లభించిన మూడో సంవత్సరంలో ప్రజలకు మనం చేసిన ప్రమాణాల్ని నిలబెట్టుకోడానికీ ఆచరించడానికీ యత్నిస్తేగాని, వాస్తవరూపంలో వ్యావసాయిక పారిశ్రామిక రంగాలలో మన వాగ్దానాలను ఆచరణలో పెడితేగాని ప్రజల నాకర్షించలేము నూతనార్జితస్వాతంత్ర్యాన్ని సుస్థిరపర్చుకోవాలంటే ప్రజలబలాన్ని సమన్వయపరచి సక్రమమార్గంలో పెట్టడాని కదొక్కటే మార్గం

ఆఖరువిషయం స్వాతంత్ర్యం అంటే స్వయంసముద్ధరణకు కృషి చెయ్యడానికి స్వేచ్ఛ అనేమాటను మరిచిపోకూడదు అదేమీ ఉన్నపట్టున అంధకారం తొలగించి ఆకాశాన్ని ప్రకాశవంతం చెయ్యడానికీ, కరువులు పోగొట్టి సంపదలు తెచ్చి పొయ్యడానికీ ఇంద్రజాలం కాదు మనం దాస్యంలో యాతనలు పడిపడి దాస్యంపోతే చాలు స్వాతంత్ర్యంతో సర్వసంపదలూ లభిస్తాయని అజ్ఞానంవల్ల అనుకున్నాము సంపదలు స్వాతంత్ర్యంతోపాటు లభించక పోయేసరికి మనల్ని నిరాశాక్రోధాలు ముప్పిరిగొన్నాయి స్వయం సహాయానికి మనలో శక్తి ఉడిగిపోయిందేమో ననిపిస్తోంది. ప్రతి విషయానికీ ప్రభుత్వంపైనే ఆశ పెట్టుకుంటున్నాం ఎన్నడూ శ్రద్ధకష్టమంటే ఏమిటో కార్యసాధన అంటే ఏమిటో అనుభవం లేక సుఖసున్నితాలు అలవర్చుకొని, వాస్తవస్థితి తెలియగానే కరిగిపోతున్నాము.

జాతులంటే ఇంత సున్నితమైనవి కావు. మానవజీవితంలో స్థిరవిశ్వాసం, కృషిపట్ల శ్రద్ధాలక్ష్యాలతో మనం విశిష్టత నేర్పరచుకోవాలి సామ్యవాదం (సోషలిజం, కమ్యూనిజం)గురించి సిద్ధాంతాలు బోధించడం సులువే కాని సామ్యధర్మం, విధ్యుక్తధర్మనిర్వహణలో ప్రతి ఒక్కరి బాధ్యతనుగురించీ మాత్రం మరచిపోకూడదు గాంధీజీ ఏనాడో వ్రాశాడు. "మొట్టమొదట పరివర్తన పొందినవారితోనే సోషలిజం ప్రారంభమాతుంది" అని. మన దైనందినజీవనంలో, అంటే ప్రస్తుతక్లిష్టపరిస్థితిలో నిరాడంబరంగా, కష్టార్జనలతో జీవించేపద్ధతిలో, సర్వసమత్వ సిద్ధాంతాన్ని ఆచరణలో పాటించాలి. మనం వస్తూత్పత్తిని వృద్ధిపరిచి వాడుకను తగ్గించాలి మన సాంఘికమూల్యప్రమాణాల్ని మార్చుకోవాలి సంపదసౌభాగ్యాల అధిదేవతగా కృషిని మనం ఆరాధించాలి కొంతకాలంవరకూ క్లుప్తజీవనం నడపాలి ఇందులో తరతమభేదా లుండకూడదు ఈ భారాన్ని అందరూ సమానంగా పంచుకోవాలి అటువంటి యత్నాలవల్ల మాత్రమే భారతదేశం సహజోన్నతి నందగలదు"


స్వతంత్రభారతదేశమే ప్రపంచశాంతికి రక్ష

డాక్టర్ పట్టాభి సీతారామయ్య

భారతదేశంలో, స్వాతంత్ర్యానంతర వత్సర ద్వయమూ అకలంకశుభాలనే పండించినవని చెప్పలేము. అనేకక్లిష్టతర సంఘటనలతో, ఎన్నడూ అనుకోని సూత్నగతులతో, ఈ రెండేళ్లూ గడిచాయి.

స్వాతంత్ర్యోద్భవము, సుఖప్రసవోద్భవంగా గాక, కర్కటిగర్భంగా పరిణమించింది. మంత్రసాని, గడ్డుకాన్పు చేయించవలసినప్పుడు శస్త్రం వాడో, మాతృగర్భాన్ని ప్రేవులను చీల్చియో బిడ్డను బైటికి తీస్తుంది.

ఇక్కడ జరిగిన శస్త్రచికిత్సకూడా దాదాపు అంతే. అయితే కొద్దిమార్పు ఉంది. భారతమాత దేహాన్ని రెండుగా నరికితే ఈ స్వాతంత్ర్యశిశువు జన్మించింది. అల్పప్రాణికోటిలో, అమీబాను రెండుగా చీల్చి, జీవధానుపారంపర్యంగా నిలిపినటువంటి విధానమే ఇక్కడా జరిగింది.



భారతదేశాన్ని రెండుగా చీల్చటమే ప్రథమ ఆఘాతము. స్వాతంత్ర్యశిశువు పుష్టిగా, పరిపూర్ణారోగ్యంతో బ్రతకగలిగేందుకు, భారతమాతను, నరికి చంపేయవలసివచ్చింది.

ఆ విధంగా స్వాతంత్ర్యోద్భవమే, ఒక మహావిపత్తుతో ప్రారంభమయింది. తదనుయాయంగా బాలారిష్టాలుకూడా, ఎడతెగకుండా శిశువును బాధించసాగాయి. ఈ అరిష్టాలన్నిటినీ ఎదుర్కొంటూ, చికిత్స చేసుకొంటూ బ్రతికించుకు రావలసివచ్చింది.

ఇటునుంచి అటో లేక అటునుంచి ఇటో కోటిమందికిపైగా జనం కాందిశీకప్రవాహంగా తరలి బయలుదేరటం, ఈ ప్రయాణం అవసరమయ్యేందుకు ముందూ, ప్రయాణంలోనూ, పదిలక్షలమంది జనం, హంతకుల కత్తులకు బలిగా ప్రాణాలు వీడటం ఇవి ప్రప్రథమంలో దేశాన్ని అలయించిన ఘోర విపత్తులు.

ఈ శతసహస్రకాందిశీక ప్రజానీకానికి, తిండి, బట్ట, ఇల్లు, చూపించి, వీరికి విద్యాసౌకర్యాలు చూపటం, సుఖసుఖాల తేలేపని కాదు. ఈ కాందిశీకు లనబడేవాళ్ళ సహాయానికై, కొత్త పట్టణాలు వెలిగాయి. నాలుగు కట్టు న్నారు. [illegible] కొంపలన్నీ బాగుచేసి నివాసయోగ్యం చేస్తున్నారు. ఒక [illegible] చేస్తున్నారు. కాని ఈ కాందిశీకులనేవాళ్ల దౌర్భాగ్యం ఇంతింతని చెప్పలేము. పగవాడికైనా రాకూడని కష్టాలు పడ్డారు వాళ్లు. నాది అని చెప్పుకోదగ్గది చిల్లిగవ్వ లేదు వాళ్లకు. రేపటి బ్రతుకేమిటో స్థిరం లేదు. ఎందుకు బ్రతకాలో వాళ్ళకు అర్థం కావటం లేదు. ఈ విభజన వాళ్లు కోరుకున్నది కాదు. వాళ్ళ సలహా అడగటం కాని, వాళ్లతో సంప్రదించటం గాని జరగకుండా, ఈ విభజన ఫలితాలన్నీ వాళ్ల నెత్తిన చుట్టుకున్నాయి.

భారతదేశం స్వాతంత్ర్యం ప్రకటించుకొన్ననాడే, 562 సంస్థానాల చప్పన్న రాజకుమారులూ కూడా స్వతంత్రులయ్యారు. ఇష్టమైన యూనియన్‌లో ఏదొకదానిలోనైనా చేరవచ్చు. కాదంటే స్వతంత్రంగా ఉండవచ్చు. అంతా వాళ్ల ఇష్టమే!

ఆవిధంగా ఒక్కసారిగా ఈ సింహాలనన్నిటినీ బోనులు తెరిచి దేశంమీద విచ్చలవిడిగా వదలి నట్లయింది. వాళ్ళను మాదలించుకొని, శిక్షణ ఇచ్చి ఒక దోవలోకి తెచ్చేటప్పటికి రెండేళ్లు పట్టింది. సంస్థానకూటములు తయారయాయి. విడిసంస్థానాలంటూ, ఒక మైసూరు, హైదరాబాదులు తప్ప రద్దయిపోయాయి. దుండగీళ్ల దండుపేరిట పాకిస్థాన్ ప్రేరేపించి ప్రారంభించిన యుద్ధాన్ని కాశ్మీర్ ఎదుర్కోవలసి వచ్చింది. నైజాం తిరుగుబాటును, రక్షకభటచర్యతో అణచవలసి వచ్చింది.

ఈ విధంగా సంస్థానజన్యమైన మూడవ విపత్తును ఎదుర్కోవటమయింది. విపత్తు తప్పింది; కాని సంస్థానకూటముల విషయంలో, కేంద్ర ప్రభుత్వం చిన్నచిన్న విషయాలవద్దనుంచి విస్తృతంగా దృష్టిపరపుతూ రావలసిన అవసరం ఇంకా చాలా ఉంది.

ఇక నాల్గవ విపత్తు; ఇన్‌ఫ్లేషన్ - ధరలు పెరిగిపోయాయి. యుద్ధాత్పూర్వము 170 కోట్ల రూపాయల కిమ్మతుచేసే కరెన్సీనోట్లు, యుద్ధానంతరం, 1270 కోట్ల రూపాయలవరకూ పెరిగి, అంతటితోనన్నా ఆగక, మరింతింతగా పెరుగుతూ వచ్చింది. వస్తువుల ధరలు ఏనాడూ ఎవరూ అనకోనంత ఎక్కువగా పెరిగిపోయి తిండిపదార్థాల ధరలతో ప్రజలు అసంతృప్తులైపోయారు. దీనికితోడు పదార్థాలకొరత ఈ అసంతృప్తిని మరింత ఎక్కువ చేసింది.

ఈవిధంగా, 150 ఏండ్ల, బ్రిటిష్‌పరిపాలన అనంతరం, భారతదేశం చిప్ప చేతోపుచ్చుకొని కబళంకోసమని ప్రపంచదేశాల గడపగడపా తొక్కవలసి వచ్చింది. తిండి కొనుక్కునేందుకు డబ్బన్నా చేత లేదు. ప్రపంచ డాలర్ నిధిలో ఇండియాకు రాబడి తగినంత లేదాయెను. ఇది ఇల్లా ఉండగా, భారతజాతి, రేషనింగ్ బ్రతుకుకు తయారయి ఉండలేదు. "స్వయంసేవా" విధానంలో ఎవరి ఆధారానికీ ఎదురుచూడకుండా బ్రతికేందుకు జాతికి ఏనాడూ శిక్షణ ఇవ్వటమే జరగలేదు. ఎప్పుడూ సహాయానికి ప్రభుత్వంకేసి చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోటమే జాతికి అలవాటైపోయింది.

నిజానికి జాతిలో కృషికి ఉత్సాహమే నాశనమైపోయింది. తత్కారణంగా, పరుల సహాయానికి ఎదురుచూడటమే ప్రజకు అలవాటైపోయింది.

దేశవిస్తృతంగా 'రేషనింగ్' ప్రవేశపెట్టటంతో, అవినీతికి స్థానం ఏర్పడి బ్లాక్‌మార్కెట్టులు బయలుదేరాయి. బ్లాక్‌మార్కెటింగూ లంచగొండితనమూ ప్రబలిపోయాయి.

ఈ రెండూకూడా, బ్రిటిష్ పరిపాలననుంచి మనకు సంక్రమించిన గుణవిశేషాలే. ముఖ్యంగా యుద్ధంరోజుల్లో, యుద్ధసహాయ సేకరణార్థం, ఇవి బయలుదేరాయి. యుద్ధానికి సహాయం భారతజాతి స్వబుద్ధిగలవ చేసేందుకు సిద్ధంగా లేదు. అందులోనూ కాంగ్రెస్ యుద్ధానికి వ్యతిరేకంగా నిలచింది. అందుచేత ప్రభుత్వము ప్రజలనూ, ఉద్యోగులనూ, వర్తకులనూ, పత్రికలనూ, తమతో సహకరించటానికి కాస్త సుముఖంగా ఉన్న ప్రతివాళ్లనూ లాలించవలసి వచ్చింది.

ఒకనాడు జాతిలో ప్రబలంగా ఉన్న నైతిక వర్తనంఅంతా రానురాను క్షీణించి, నైతిక ప్రమాణాలు పడిపోయి, బ్రిటిష్‌వారు దేశం వదిలేటప్పటికి, నూతన భారతప్రభుత్వానికి శైశవస్థితిలో, బ్లాక్‌మార్కెట్టు, లంచగొండితనమూ, పూర్వపాలకులు వదలివెళ్లిన వారసత్వపు టాస్తిగా మిగిలాయి.

ఇంతలో ఇన్‌ఫ్లేషన్ రాక్షసి పొడచూపింది. నదుల ప్రాజక్టులు కట్టాలంటే, ఇన్‌ఫ్లేషన్ అడ్డువచ్చి నిర్మాణాలు ఆపించింది. ఇన్‌ఫ్లేషన్ భయంతో జమీందారీ రద్దుప్రణాలికలను పునః ఆలోచించుకోవలసివచ్చింది. మద్యపాననిషేధము తీవ్రంగా ప్రవేశపెట్టటానికి వీలులేకపోయిందంటే, మళ్లీ ఇన్‌ఫ్లేషన్ కారణము. గ్రామపరిశ్రమలనుంచి విదేశపరుకులను దిగుమతి చేసుకోక తప్పలేదంటే ఇన్‌ఫ్లేషన్ ప్రభావమే. అలా విషయాలన్నీ అస్తవ్యస్తంగా తయారయి, కాంగ్రెస్ "పునర్నిర్మాణ పథాలికలనే" వేటినీ ప్రవేశపెట్టటానికి వీలులేకుండా అయింది.

భారీపరిశ్రమలను జాతీయం చేయకుండా అల్లాగే ఉంచివేయటం అవుతూంది. వాట్లను జాతీయం చేసేందుకు అర్థబలమూ అంగబలమూ కూడా మన ప్రభుత్వానికి లేకుండా ఉన్నాయి.

ఇన్నిచిక్కులూ ఇల్లా ఉంటూండగానే, ఉన్న సైన్యాన్నంతనూ, భారతీయసైన్యంగా చేసుకోగలిగాము. 30 కోట్ల రూపాయల పెట్టుబడితో ఇండస్ట్రియల్ ఫైనాన్సు కార్పొరేషన్ ప్రారంభించగలిగాము. 10 కోట్ల పెట్టుబడితో, దామోదర్ వాలీ అడ్మినిస్ట్రేషన్ ప్రారంభించాము. మరో పదికోట్లతో కాందిశీకపునరావాస, సహాయనిధిని సమకూర్చి ఉంచటమయింది.

కాంగ్రెసు ప్రభుత్వము, మొదటినుంచి, ఏటికి ఎదురీతగానే శ్రమపడవలసివచ్చింది. ప్రజల సహకారం అంతంత మాత్రంగానే సణుగుతూ గొణుగుతూ అర్ధమనస్కతతో సహకరించటంగానే తయారయింది. స్వయంపాలిత దేశాలలో ప్రతీవ్యక్తి కూడా తనజాతి, తనదేశంతో తానులీనమయి, తన ప్రభుత్వపరంగా మాత్రమే విషయాలను అవగాహన చేసుకో ప్రయత్నిస్తాడు. భారతదేశంలోనో, ఇందుకు విపరీతంగా స్వతంత్రం వచ్చినందువల్ల తన స్వలాభం ఎంత చేకూరుతోంది అన్న దృష్టిలోనే వ్యవహరిస్తున్నాడు.

రాజకీయబాధితులు

స్వరాజ్యమంటే ఏమిటి? స్వరాజ్యం నాకేమి సహాయం చేస్తుంది? స్వరాజ్యములో, ఎక్కడ ఏవిధంగా నా విషయం నేను బాగుపరుచుకోవచ్చును? ఇవీ ప్రశ్నలు. రాజకీయబాధితులు అనబడ్డవారు, ప్రజలలో చాలామందీ, స్వరాజ్యం వచ్చిందనగానే తమకు తాము వేసుకొన్న ప్రశ్నలు అంటే ప్రతివారూ ఇంత అవకతవకగా వ్యవహరించారని కాదు. కాని ప్రప్రథమంగా అధికారం కొద్దిమందికి కొత్తగా చేజిక్కేటప్పటికి, తక్కినవాళ్లల్లో, అంతకు ముందు ప్రజాసేవలో నీతి నియమాలకు అంతంతమాత్రం ప్రఖ్యాతిగలవా రెందరకూ, 'ఆబ' బయలుదేరింది.

కాబట్టి మనం ఎదుర్కోవలసి వచ్చింది ఒక పాకిస్థాన్ కాదు; విధి వైపరీత్యంగా ఆగంతుకంగా వచ్చిపడ్డ ఒక విపత్తును కాదు; ఏదో ఒక ఆర్థిక విచ్ఛిత్తివల్ల ఏర్పడ్డ ఆపదను కాదు. మన బంధుమిత్రులనే, మన సోదరులనే, కష్టాలలో మనపక్కన నిలిచి పోరాడి కూడా, స్వతంత్రం రాగానే ఒక్కసారిగా, సుఖజీవనం అపేక్షిస్తూ తమ కొడుకులను చదివించుకొని, తమ కూతుళ్లకు పెళ్లిళ్లుచేసి, తమకు సుఖమైన గృహవాసాలు ఏర్పరచుకొని, సుష్టుగా తింటూ, విలాసంగా, సంపదతో వెలుగుతూ బ్రతకాలని కోరుకొనే మనవాళ్లనే ఎదుర్కోవలసి వచ్చింది.

ఈ సమస్య ఇల్లా ఉండగా, పైపెచ్చు విదేశ బాంధవ్యాల సమస్యలు వచ్చిపడ్డాయి. ఇరవైనాలుగు దేశాలవారు, తమ ప్రతినిధి వర్గాలను ఢిల్లీలో నెలకొల్పారు. ఢిల్లీనుంచీ మన ప్రతినిధులను ఈ ఇరవైనాల్గు దేశాలలోనూ నెలకొల్పవలసి వచ్చింది. ఈ పనికి తగిన పెద్దలను, వాళ్ల కార్యదర్శులను, కార్యస్థలాలను, మందీమార్బలాల నన్నిటినీ చేకూర్చి, విదేశాలలో భారతదేశ గౌరవం పడిపోకుండా, ప్రతిష్ఠకు తగినట్లుగా చూడవలసివచ్చింది. ఇంతకుముందు ఈ అనుభవం లేనివారంతా, ఆ రీతిగా వ్యవహరించగలుగుతూ, అంతంత బాధ్య

(18-వ పేజీ చూడుడు)



వెల్లింగ్టన్ విమానాశ్రయంనుంచి బొంబాయి బయలుదేరుతున్న సర్దార్ పటేల్. పటములో పటేల్, సత్యనారాయణ సిన్హా, గాడ్గిల్, దివాకర్ గారలు వున్నారు.

కాంగ్రెస్ పాలన - సింహావలోకనం

శ్రీ కృష్ణ

ఆర్థికంగా ప్రతిష్టంభన; ఆహార విషయకంగా ప్రతిష్టంభన; పారిశ్రామికంగా ప్రతిష్టంభన; కాశ్మీరులో ప్రతిష్టంభన; కాంగ్రెసులో ప్రతిష్టంభన-–ఈ సంవత్సరం ప్రతిష్టంభనల సంవత్సరం.

వేసిన అడుగు తప్పటడుగు; చేసినపని పాడుపని, విరోధులను దువ్వపోతే స్నేహితులు జారిపోవడం, జాతీయ పతాకాష్ట ఈ విధంగా గగ్గోలు పడిపోయింది.

ఓడు, ఓడు అంటే అంతా ఓడుకాదు. కాంగ్రెసు పాలకులు ఈ సంవత్సరం సాధించిందికూడా కొంత వుంది.

హైదరాబాదులో పోలీసు చర్య, రజ్వీ లాయకాలీ వర్గం పతనం, సంస్థానాల సంఘటన, ఆర్. ఎస్. ఎస్.ను గద్దె కరిపించడం, అకాలీలను - అణగద్రొక్కడం ఇవి అన్నీ కాంగ్రెసు ప్రథిత యశస్సుకు మూలస్తంభాలుగ వున్నాయి.

ఇందులో సంస్థానాల సంఘటన ప్రత్యేకంగా చెప్పుకోతగ్గది. బిస్మార్ లా క్రింద జర్మనీ సంఘటితమైనట్లు పటేల్ అధ్వర్యంలో సంస్థానాలు సంఘటితమైనాయి. అది ఎంత గరీయః కార్యమో ఇది అంత మహీయః కార్యం.

ఇది విలయంలోంచి సృష్టి జరగడం వంటిది. తొడిమ పూడి ఫలం ఆవిర్భవించడం వంటిది.

ఇకముందు ఈ సంస్థానాల విషయంలో చాలా వుంది. రాష్ట్రాలలో లీనమైన సమాఖ్యలుగా సంఘటితమైన సంస్థానాల ఆంతరంగిక పరిస్థితులను చక్కని మార్గాలలో చక్కబరచడం భారత సంస్థాన శాఖవారి భవిష్యత్కార్యక్రమాంగం అయినప్పుడే ఈ సర్వ ప్రయత్నం శుభోద్భాసితం అవుతుంది.

ఇది రాజకీయవిషయం. ఇక రక్షణ కలాప నిర్వహణం వుంది. దేశ సైన్య పునర్నిర్మాణంలో గూడా భారత ప్రభుత్వం కొంత పురోగామి తత్వాన్ని ప్రదర్శించింది. ఇండియా విభజనతో వైమానిక, నౌకా శిక్షణ వ్యవస్థలన్నీ పాకిస్థాన్ లో పడిపోయాయి. దానితో భారత నౌకా బలాలకు నివేశనస్థలం చూపడం అధికారులకు పెద్ద సమస్య అయిపోయింది.

ఈ ఏడాదిలో ప్రథమంగా భారతీయుడు సర్వసేనాని కాగల్గాడు. ఈ ఏడాదిలోనే ప్రాంతీయ సైన్యనివహ సృష్టికి నాంది గీతం పలికారు. ఈఏడాదిలోనే రాయల్ ఇండియన్ వైమానికుల బలం పెరిగింది. ఈ ఏడాదిలోనే భారత నౌకా బలంలో ఢిల్లీ అనే క్రూయిజర్, రాజపుట్, రాణా, రంజిత్ అనే క్రూయిజర్లను కొత్తగా చేర్చారు. ఈ ఏడాదిలోనే భారతత్రయ్యంగ సైన్య శిక్షణస్థానాలుగా మూడు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పడ్డాయి.

శ్రీ సంతానంగారి కృషివల్ల రైలు రవాణా సౌకర్యాలు ఈ ఏడు అభివృద్ధి చెందాయి. సరుకులు చురుకుగా కదిలిపోయాయి. రైల్వే పనివాండ్ర సమ్మెను విరమింపచేయడం గూడా ఈ ఏడాదిలో జరిగిన ఘనకార్యమే. కృతనిశ్చయ బుద్ధితో సమాలోచనలకు, సమావేశాలకు దిగితే ఎటువంటి కార్యాన్నైనా సాధించవచ్చునని ఇందువల్ల ఋజువైంది.

విమానటపాపద్ధతితో దిగజారిన తంతి తపాలా శాఖ ప్రతిష్ట టెలిఫోను సౌకర్యాల అభివృద్ధితో కొంతవరకు నిలబడింది. ఈ శాఖ ఒక్క పెద్ద అంగలో ముందుకు పోవచ్చుననుకున్నారుగాని, అనాభవంవల్ల ఇది అనభిజ్ఞుని ప్రయత్నంగా తేలింది. దాంతో ఆ ప్రయత్నంలో గూడా కొంత మార్పు వచ్చింది. ప్రతిమనిషికి పట్టిన ప్రశ్న అల్లా ఒక్కటే; నేను ఎందుకు అర్థణా ఎక్కువ చెల్లిస్తున్నాను అని. విమానాల్లో వుత్తరాలు పంపేవాళ్లకు ఇచ్చిన ఈ కోరరాని బహుమానంతో తలకు అర్థణా పైను పడ్డట్లయింది.


దేశంలో గడ్డు చిక్కులు ఏర్పడ్డాయి. వీటికి కారణం ఏమిటంటారు? మంత్రులు బాధ్యతను గుర్తించకుండా మాట్లాడటం; కాంగ్రెస్ వారిలో క్రమశిక్షణ లుప్తమైపోవడం; స్వార్థపరులు భారతీయేతరమైన దృష్టిని వహించడం; దుబారి పిచ్చి ఎక్కువ కావడం: ఆలోచన లేకుండా అర్థంలేని క్రమవిరహితమైన పథకాలు వన్నడం:—ఇవన్నీ దేశాన్ని సంక్షోభిత చేస్తున్నాయి.

కొంతమంది మంత్రులు వున్నారు. వారికి సంబంధం వున్నా లేకపోయినా పత్రికలను జాతిపరంచేసి వేస్తామని ఎక్కడ పడితే అక్కడ ఉపన్యాసాలు దంచివేసారు. అక్కడితో పెట్టుబడి దారెత్తి మార్కెట్ లోంచి మాయమైపోయింది. ముందుకు రమ్మంటే, మొరాయించి కూర్చుంటున్నది. ఇది ఇట్లా వుండి సరిగదా కార్మికులతో నన్నా మనవాళ్లు సరిగ్గా వున్నారా అంటే, అదీ లేదు. ప్రతిదానికి వాళ్లను పీడరిస్తూ వున్నందువల్ల వాళ్లు కూడా చిన్న బుద్ధులు చూపుతున్నారు.

అక్కడితో దేశం ఉత్పత్తి సర్వస్వమూ దెబ్బతిందీ. మంత్రులు కొంచెం నాలుక అనే గుర్రాన్ని కట్టివేసినట్లయితే ఈ తిప్పలూ వుండేవి కావు; కష్టాలూ వచ్చేవి కావు.

ఈ సంవత్సరం ఆరంభం కావడమే ద్రవ్యోల్బణంతో ప్రారంభమైంది. దీనికి కారణం కంట్రోళ్ళను తొలగించడం; గాంధీ అన్నాడని ప్రభుత్వం కంట్రోళ్లు తొలగించింది. ప్రభుత్వోద్యోగులంతా అది మంచిదికాదని నెత్తిన నోరుపెట్టుకొని మొరిగినా లాభం లేకపోయింది. గాంధీ అంటే హృదయంలోవున్న పచ్చి అట్లా చేయించింది. ఆఖరికి ఏమయింది? గాంధీ చెప్పింది తప్పు; ఉద్యోగులు చెప్పింది ఒప్పు. సరిగ్గా తొమ్మిదినెలలు తిరక్కముందే కంట్రోళ్ళను తిరగతోడి, ఉద్యోగులు చెప్పినదారుల్లో నడవవలసి వచ్చింది.

భారతదేశ ఆర్థిక సౌష్ఠవాన్ని గట్టిగా దెబ్బకొట్టగల్గిన అంశం ఒక్కటంటే ఒక్కటి ఏదయ్యా అంటే అది ఆహార సమస్య అని చెప్పవలసివుంటుంది. ఎగు



"న్యాయబుద్ధితో ఆలోచిస్తే ఇదివరలో మీరు నమ్మినవారిని ఇకముందు కూడా నమ్మవచ్చునని మీకే తెలుస్తుంది."

మతులన్నీ చెయ్యాలి. లేకపోతే నాశనమన్నా కావాలి—ఇది వాణిజ్యశాఖవారి నినాదం అయిపోయింది. సరే, ఎగుమతులు చేద్దామంటే, విదేశం మార్కెట్లలోకి మన సరుకులు ఎక్కనే ఎక్కవాయెను; కారణం ఏమంటారు? మన సరకులు చాలా గిరాకి; సరుకు ఎందుకు గిరాకి? ఉత్పత్తికయ్యే ఖర్చు బరువు కావడం; ఈ ఖర్చు ఎందుకు బరువు? కార్మికుల వేతనాలు ఎక్కువగా వుండటం; వేతనాలు తగ్గిస్తే మంచిదిగాదా? అది వీలుకాదు. అది వీలుకాకపోతే, ఆహారపదార్థాల ధరలు తగ్గవు. ఇక ఎప్పుడు ఈ ధరలు మండిపోవడం తగ్గడం? ఎన్నికలు జరిగిన తరువాత— ఇట్లా ఇన్ని ఆకులతో కూడిన ఒక చక్రంలాగా పరిస్థితి పరిభ్రమిస్తున్నది. నిజం ఆలోచిస్తే తేలేది ఏమిటంటే, ప్రస్తుతం దేశంలో ఏర్పడిన ఈ పరిస్థితికి అంతా కారణం ఆహార విషయమైన సమస్యగాక, రాజకీయమైన గందరగోళం అని తేలుతుంది.

విదేశాలలో చేసిన వర్తకవాణిజ్య విషయాలలో ఇండియా ఇతర దేశాలకు దాదాపు 215 కోట్లదాకా ఇవ్వతేలింది. ఇందు 131 కోట్లు ఆహారపదార్థాలకు సంబంధించిన దిగుమతులకే అయింది. దేశంనుంచి ఇతర దేశాలకు ఎంతసరకు ఎగుమతిచేసినా, ఆహారపదార్థాల దిగుమతులను తగ్గించేదాకా ఇండియా ఏవిధమైన అభివృద్ధిపథకాలను నిరపాయంగా అమలుజరపలేదు. ఈ ఎగుమతులవల్ల ఏమిటి సాధించగలమయ్యా అంటే, దేశంలో ఆకలితో మాడే అశేషజనానికి అన్నాన్ని చూపెట్టగలమేమో. అందువల్ల ఇండియా తన్ను ఎదుర్కొంటున్న ఆహార సమస్యను పరిష్కరించేదాకా ఒక అడుగుగూడా ముందుకు వెయ్యలేదు.

సర్వమైన ఈ పరిస్థితిని భారత ప్రధాని బాగా అవగాహన చేసుకున్నారు. అందువల్లనే ఆయన జరిగిన మార్చినెలలో మాట్లాడుతూ, 1951 మార్చి 31 అనంతరం ఇక ఆహారపదార్థాల దిగుమతులంటూ వుండవని ప్రకటించి వున్నారు. ఇందుకు తోడు సి. పి. ఆహారమంత్రి శ్రీ ఆర్. కె. పాటిల్‌ను ఆహారోత్పత్తి కమిషనర్‌గా గూడా నియమించారు. ఇందుకు సహకారంగా ఉపాహార సలహాసంఘాన్ని గూడా ఏర్పాటుచేశారు.

అసలు ఈ ఆహారసమస్య ఇంత బ్రహ్మాండంగా తయారైపోవడానికి కారణం ఆహారశాఖామంత్రి చేతకానితనమనే చెప్పవలసి వుంటుంది. 1944 అధికాహారోత్పత్తి ఉద్యమం ప్రారంభమైంది. ఇందు నిమిత్తం దాదాపు 40 కోట్లదాకా ఖర్చయింది. ఒకప్పుడు ఋతు పవనం వర్షాలతో వచ్చి ఈ ఉద్యమాన్ని దెబ్బతీసిందని, ఒకప్పుడు రైతులు పూర్వంకన్నా అమితంగా మెక్కుతూ ఈ ఉద్యమాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆహారశాఖవారు అంటూ వచ్చారు. ఇంకొకప్పుడు తప్పుడు లెక్కలతో ఇది దెబ్బతింటున్నదన్నారు. ఇంకో అప్పుడు భారతదేశ విభజనవచ్చి అడ్డుపడి తమపని సాగకుండా చేసిందన్నారు.

దీన్ని కొంచెం సోపపత్తికంగా వివరిస్తేనే బాగుంటుంది. 1947-48 సంవత్సరంలో దేశంలో మొత్తం ఆహార ధాన్యాలను 9.090 లక్షల టన్నులదాకా పండించాలని ఆశించారుగాని అందుకు మింజుమతె 6.168 లక్షల టన్నులు మాత్రమే పండాయి. 1948-49 లో 8.860 లక్షలటన్నులు ధాన్యాన్ని పండించాలనుకుంటే 7.110 లక్షల టన్నులు మాత్రమే చేతికి వచ్చాయి. 1947-49 లకు కలిపి మొత్తంమీద దామాషాను 17.950 లక్షల టన్నుల పంట రావాలనుకున్న దానికి మింజుమతే చేతికి వచ్చింది 13.278 లక్షల టన్నులు మాత్రమే.

అధికారుల అంచనాలు ఈ విధంగా వుంటే దేశంలో ఆధారధాన్యాల పంట క్రిందవున్న భూమి, 1948-49 సంవత్సరం, 3,635,000 ఎకరాలు క్రిందటిసాలుకన్నా తగ్గింది. ప్రత్యేకం వరి. జొన్న, రాగి, బజ్రాపంటల సాగుబడిలో 1795 000 ఎకరాల తరుగు వచ్చింది. అంటే 17 లక్షల 12 వేల టన్నుల ధాన్యం తరుగు వచ్చిందన్నమాట.

పోతే చెరకు, వేరు సెనగ, ఆముదం మొదలైన వ్యాపారపు పంటలక్రిందవున్న భూమిలో 18 లక్షల 38 వేల ఎకరాలు తరుగు చూపించని ఆ ప్రభుత్వమే అంచనాలు వేసింది. కాని బార్లీ, కాయధాన్యాలు, ప్రత్తిమొదలైన పంటలలో కొంచెం అభివృద్ధి కనపడింది. ఈసాగుబడిలో మొత్తం 16 లక్షల 22 వేల ఎకరాల పెరుగుదలవున్నట్లు అంచనాలు వున్నాయి. పెరుగుదల అట్లావుంచితే, గోధుమపంట క్రిందవున్న భూమి 4 లక్ష 39 వేల ఎకరాల మేర తరిగింది. ఈతరుగు పెరుగులు లెక్కకడితే, మొత్తం మీద ఈ 1947-48 సంవత్సరంలో సాగుబడలో వున్న భూమిలో 1948-49 వచ్చేటప్పటికి 24 లక్షల 50 వేల ఎకరాలమేర తరిగినట్లు వ్యక్తమౌతుంది. ఇది కాకుండా కరీఫు పంటలోగూడా 30 లక్షల టన్నులు వరకు నిరుటికన్న ఈ యేడు తరుగు కనపడిందని ఆహారశాఖవారు అంగీకరించిన విషయమే. ఇంతవరకుదాకా పోకుండానే మనం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నామన్న సంగతిని గుర్తువుంచుకుంటే, ఈశాఖ ఇన్ని సంవత్సరాలలోను సాధించినది ఏమిటో తెలిసిపోతుంది.

దేశవిభజనను ఈ శాఖవారు తమ వాదనకు ఉపాదానంగా ఉపయోగించుకోవడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. పశ్చిమ పంజాబులోను, సింధులోను, గోధుమలు పండే భూములు మనకు లేకుండాపోతే, పశ్చిమ పాకీస్తాన్‌లో నివశిస్తూ ప్రత్యేకంగా గోధుమనే వినియోగించుకొనే ప్రజానీకం గూడా మనకు లేకుండా పోయింది. ఇదికాకుండా దాదాపు బియ్యం వాడకానికి అలవాటుపడ్డ 4 కోట్లమంది తూర్పుబెంగాలు ప్రజలు గూడా ఇప్పుడు పాకీస్తాన్‌లో పడిపోయినారన్న సంగతిని ఈ శాఖవారు ఎత్తుకోనుగూడా ఎత్తుకోవడంలేదు.

1947 ఆగస్టు 15 కు పూర్వం రేషనింగును అమలు జరపడంలో ప్రతి 100 మందిలోనూ 80 మంది వయోజనులు వుంటారు అన్నది ప్రాతిపదికగా తీసుకున్నారు. ఇప్పుడు 86 దాకా పెంచారు. అందువల్ల గూడా దేశంలో ఆహార ధాన్యాల కొరతఏర్పడి, విదేశాలనుంచి దిగుమతులు అధికమైనాయి.

ఇంకో విషయమేమిటంటే ప్రభుత్వం ఈ దిగుమతులను ప్రత్యేకంగా రేషనింగు ఉన్న ప్రాంతాలలోనే వినియోగిస్తున్నది. రేషనింగు లేనిప్రాంతాల సంగతి తనకు ఎంతమాత్రం పట్టనట్లు వూరుకొన్న కారణంగా, ఆ ప్రాంతాలలో ఆకలిమీదగా ఆహారధాన్యాలతో వర్తకానికి దిగి తమ బొక్కసాలను నింపుకుంటున్నవారిని ప్రభుత్వం ఏమీ చేయలేకపోతున్నది. అందువల్ల దేశం నిర్వీర్యమై, ప్రజలు దరిద్రులై, మన ఆర్థిక సౌష్టవంచిద్రుపలై పోతున్నది.

ఈ మధ్య పార్లమెంటులో అధికాహారోత్పత్తి ఉద్యమం ఎందుకు జయప్రదం కాలేదు అన్న విషయాన్నిగూర్చి, విచారించాలని ఒక అనధికార తీర్మానం వచ్చింది. దాన్ని పార్లమెంటు ఆమోదించింది కాని, అది ఏబల్లమీదో ఇంకా నిద్రపోతున్నది.

ఈ అధికాహారోద్యమంతో ఒక విధమైన పెట్టుబడిదారీవర్గం పెరిగింది. దాన్ని రూపుమాపాలి. కాని ప్రస్తుత ఆహారశాఖవారు దాన్ని రూపుమాపగలరా? ఈశాఖ ఇప్పుడు వున్నట్లే వుంటే, ఫలితం ఏమీ వుండదు.

ఈ సందర్భంలో మనం ఇంకో రెండు విషయాలను మనస్సులో ఉంచుకోవాలి. ఒకటి, ప్రస్తుతం రాష్ట్రాలలో అధికారంలో వున్న కాంగ్రెస్ మంత్రులలో సహాయ నిరాకరణోద్యమ వాసనలు ఒత్తిగిల్లని కారణంచేత ఈ ఆహారసమస్య మరీ అధ్వాన్నమైపోయింది. రెండు, కోతా తనిఖీ పద్ధతి పూర్వంలాగా సుష్ఠుగా లేకపోవడంగూడా ప్రభుత్వం ఈ అధికాహారోత్పత్తి ఉద్యమ విషయంలో తప్పటడుగు వేసింది. ఈ కోతా తనిఖీలు సరిగ్గా నిపుణులు, సిద్ధహస్తులు అయిన

(16-వ పేజీ చూడుడు)



"మహాత్ముని అనుచరులమనే యోగ్యత గడించడానికి కృతనిశ్చయుల మవుదాం."

పరిపాలనాయంత్రాంగం: మన ప్రభుత్వోద్యోగులు

ప్రభుత్వోద్యోగుల ఆధిపత్యం అంటే లోకం అంతటా దుస్సహనమే. భారతదేశంలో అది మరింత అధికం. ప్రజలకీ ఉద్యోగులకీ అంతరం అధికమై పరస్పర అసహ్యానుమానాలకు దారి తీసింది. అందువల్ల స్వాతంత్ర్యసిద్ధికి పూర్వం ఎంత విమర్శ ఉందో ఇప్పుడూ అంత విమర్శ వినిపించడం సహజమే. ఇప్పటికీ ప్రభుత్వోద్యోగులకోసం పెట్టే ఖర్చు తలకు మించినదనీ, పూర్తిగా నష్టమేననీ, ప్రభుత్వోద్యోగుల వర్గం విశ్వసించ రానిదనీ, వారంతా మోసకారులనీ అంటూనే ఉంటారు.

ఒక్క విషయంలో ప్రభుత్వం విమర్శకులతో ఏకీభవిస్తుంది. ప్రజాసేవాతత్పరులు సమర్థులు, కార్యదక్షులు నీతివర్తనులు అయినవారిని పరిపాలనాయంత్రాంగంలో వెంటనే నియమించవలసిన అవసరం ఉంది. సుశిక్షితమైనదీ, సహకారసమన్వయాల కనుకూలమైనదీ అయిన పరిపాలకవర్గాన్ని, విశుద్ధవర్తనులైనవారితో నిర్మిస్తేగాని దేశంలో ఏ సంస్కరణగాని, ఏ అభివృద్ధి కార్యక్రమం ప్రజాసముద్ధరణ కాని సాధ్యపడవు.

రెండుసంవత్సరాల క్రిందట భారతదేశం పరదేశపాలకులనుండి విముక్తి పొందింది, బ్రిటిష్ ఐ. సి. యస్. ఉద్యోగుల అధీనంనుంచి విడివడింది. అప్పుడు దేశంలో పరిపాలనాక్రమం భగ్నమైపోతుం దన్నారు కొందరు. సామ్రాజ్య ప్రాపకులైన ముఖ్యప్రభుత్వోద్యోగులు తొలగిపోతే వారి స్థానాల నాక్రమించగలవారెవరూ మనదేశంలో లేరని చెప్పారు.

కాని ఇప్పటికి 24 మాసాలుగా భారతదేశ పరిపాలన సక్రమంగా కొనసాగిపోవడమే కాకుండా వృద్ధి పొందింది. జాతి ఎన్నడూ ఎరగని భారవహమైన బాధ్యతలను నిర్వహించింది. మతకలహాలు, సంఘహత్యలు, లక్షలాది శరణార్థుల నాదుకోవడం, దుర్భిక్షం వస్తువులధరల పెరుగుదల, ఆర్థికదుస్థితి స్వతంత్ర భారతదేశాన్ని పెనగొన్నాయి. అన్నీ పరిష్కారమైనాయని చెప్పుకోడం అత్యుక్తి. కాని భారత ప్రభుత్వం కృషిలో కొంత సఫల మయిందని తృప్తిపడవచ్చును. అతి క్లిష్టసమయంలో భారత ప్రభుత్వోద్యోగవర్గం ఆదుకోగలిగింది.

ఈ కాలంలోనే దేశనాయకులు కూడా దేశపరిపాలకవర్గాన్ని సుస్థిరపరచి బలపరిచారని కూడా చెప్పుకోవాలి. కొంతవరకైనా ప్రభుత్వోద్యోగుల కార్యవిధానాన్ని సంస్కరించారు. పరిపాలనారీతి సక్రమమార్గాన పడింది.

బ్రిటిష్ పాలకులు విడిచిపోయిన ఉద్యోగవర్గమే భారతప్రభుత్వాన్ని ఈనాడు నిలుపుతున్నారుగాని, వారే లేకపోతే మొదటనే ప్రభుత్వం కూలిపోయేదని చెప్పేవారుకూడా ఉన్నారు. తెల్లబడాసాహేబులికి బదులు నల్లబడా సాహేబులుమాత్రం వచ్చారంటారు. ప్రజాసేవను మాటమర్యాదకోసమైనా తలచని అధికారోన్మత్తులనీ, అసమర్థులనీ, సోమరులనీ నిందిస్తారు.

విమర్శ లేరీతిగా ఉన్నప్పటికీ సంస్కరణ అవసరమని ప్రభుత్వం కూడా గుర్తించిన విషయమే. అయితే స్వతంత్ర భారతప్రభుత్వం సంస్కరణకోసం ఏమి చేసింది? దుర్వర్తన, లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, అశ్రద్ధలను నివారించ గలిగిందా? ప్రభుత్వోద్యోగుల్లో పరివర్తన తీసుకు రాగలిగిందా? ఖర్చు తగ్గించుకుందా? అనే ప్రశ్నలు రావడం సహజం.

అయితే ఏదికాని ఒక్కరోజులో రూపాంతరం పొందాలంటే అది సంభవించదు. పై ప్రశ్నలకి సమాధానా లిచ్చేటప్పుడు సర్వవిషయాల్నీ, స్థితిగతుల్నీ కూడా గ్రహించి వాని దృష్ట్యా పరిశీలించాలి. అప్పుడు ప్రభుత్వం చేసినదీ చెయ్యనిదీ కనిపెట్టాలి.

1946 లో దేశీయవ్యవహారశాఖమంత్రిత్వాన్ని సర్దార్ పటేల్ స్వీకరించగానే, లండన్ భారత కార్యాలయంచే నియమించబడిన ఉద్యోగుల్ని తొలగించి నూటికి నూరుపాళ్లు భారతీయుల్ని నియమించడానికి సంకల్పించారు. ఐ. సి. యస్. కి బదులు కొత్త అఖిలభారత ప్రభుత్వ కార్యాలయోద్యోగవర్గాన్ని నిర్మించడానికి రాష్ట్రప్రభుత్వాలతో సంప్రదించి ఒక సమాధానానికి వచ్చారు. ఈ కొత్తవర్గం స్వతంత్రభారతపరిపాలనకు పునాదివంటిదని చెప్పబడింది.

ఈ సమాధానంప్రకారం ఒక కార్యక్రమం, వివరాలు నిర్ణయించబడినాయి. ఏతరహా ఉద్యోగులు ఎంతెంతమంది అవసరం, ఏ రాష్ట్రంనుంచి ఎంతమంది ఉద్యోగుల్ని కేంద్రానికి పంపాలి, ఉద్యోగ నియామకవిధానం, వేతన ప్రమాణాలు, నియామకపరతులు మొదలైన వివరాలన్నీ నిర్ణయమైనాయి. ఇదికాక తాత్కాలికపు ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. పాలకాధికారం మార్పువల్లనూ, దేశవిభజనవల్లనూ ప్రభుత్వ కార్యాలయనిర్మాణంలో మార్పులు చెయ్యవలసి వచ్చింది.

గడిచిన సంవత్సరం మధ్యలో ఒక స్పెషల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నెలకొల్పబడింది. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్నవారు కాక మిగతావారిలో 27 ఏళ్లు పైబడి 45 ఏళ్లకు లోబడిన వారిలో ఉన్నతోద్యోగాలకు అర్హులైనవారిని ఎంచి నియమించడం, రాష్ట్రప్రభుత్వోద్యోగాలలో ఉన్నవార్లలో అర్హులైనవాని ఉన్నతోద్యోగాలకు తీసుకోవడం, బోర్డు కర్తవ్యం. ఇంతవరకూ ఈ బోర్డు ఒక్క సంయుక్త పరగణాలలో తప్ప తదితర రాష్ట్రాలలో అభ్యర్థులందరినీ పరీక్షించింది. సెప్టెంబరుతో బోర్డుపని పూర్తి కాగలదు. రెండుమూడేళ్లలో అవసరం కాగల ఉద్యోగుల్ని నియమించడంకోసం ఈ పద్ధతి అవలంబించవలసి వచ్చింది.

ఇది గాక ఫెడరల్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ పరీక్షలోపెట్టి 162 మందిని ఇండియన్ ఎడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు ఎంచారు. ఇకనుంచి ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిసంవత్సరం పోటీపరీక్షలు జరుపుతుంది. ఒకేరీతిగా ఇండియన్ పోలీస్ సర్వీస్‌కుకూడా అభ్యర్థుల నెంచారు. కార్యాలయోద్యోగులకు శిక్షణ నిమిత్తం ఢిల్లీలో ఒక కేంద్రం, పోలీస్ సర్వీస్ ఉద్యోగుల శిక్షణనిమిత్తం మౌంట్ అబూలో ఒక కేంద్రం నడుపుతున్నారు. ఈ కేంద్రాలలో శిక్షణ అనంతరం అభ్యర్థుల్ని రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలకు పంపుతారు.

ఈ ఉద్యోగ నియామకవిధానంలో రాష్ట్రాలవలెనే సంస్థానాలు, సంస్థానకూటాలు పాల్గొనడానికి అంగీకరించాయి. భారతదేశ చరిత్రలో పరిపాలకోద్యోగవర్గం దేశాని కంతకీ చెందినది నిర్మాణం కావడాని కిదే మొదటి పర్యాయం. దీనివల్ల దేశంలో విచ్ఛిన్నప్రవృత్తులను అరికట్టొచ్చును.

ప్రభుత్వ శాఖలు:

స్వాతంత్ర్యసిద్ధికి పూర్వం కేంద్రప్రభుత్వంలో తొమ్మిదే శాఖ లుండేవి. అవి ఆంతరంగిక వ్యవహారాలు, దేశరక్షణ, ఆర్థిక, రైల్వే, తంతితపాలా, వాణిజ్య కార్మిక, శాసన, విద్యాశాఖలు, భూమి, ఆరోగ్యశాఖలు విద్యాశాఖకు ఉపశాఖలు. ఈ శాఖలకు రాష్ట్రాలనుంచి ఆఫీసర్లు పంపబడేవారు. శాశ్వతోద్యోగులుగా ఇంపీరియల్ సెక్రటేరియట్ సర్వీస్ అధికారులు, గుమాస్తాలు ఉండేవారు.

స్వాతంత్ర్యం లభించిన అనంతరం కేంద్రప్రభుత్వ కార్యాలయం రూపమే మారిపోయింది. కార్యకలాపాలు పెరిగిపోయాయి. ఆర్థికరంగంలో కేంద్రప్రభుత్వ కర్తవ్యాలు ఇనుమడించాయి. భారతదేశంలోనే కాక ప్రపంచమంతటా ఆర్థిక వ్యవహారాలు క్లిష్టతరమౌతున్నందువల్ల, ప్రభుత్వాల కార్యకలాపాల్లో కేంద్రాలకు అధికాధికారాలివ్వడం అవసరమనే వాదన బలపడుతోంది. జాతీయార్థికాభివృద్ధికార్యక్రమాలు పెరిగిపోతున్నాయి.

ఇదిగాక విదేశాలలో రాయబారకార్యాలయాలకు ఉద్యోగులు చాలామంది అవసరమైనారు. కేంద్రప్రభుత్వంలోని తొమ్మిది శాఖలూ పెరిగి 19 శాఖలైనాయి. అవి, ఆంతరంగిక వ్యవహారాలు, సంస్థానవ్యవహారాలు, విదేశవ్యవహారాలు, దేశరక్షణ, ఆర్థిక, రైల్వే, రవాణా, తంతితపాలా, వాణిజ్య, న్యాయ, సమాచార, పారిశ్రామిక, కార్మిక, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, ఆహార, వ్యవసాయ, ఆరోగ్య, విద్యా, పునరావాసశాఖలు. అంటే ఇదివరకంటె ఉద్యోగులు చాలా ఎక్కువమంది అవసరమైనారు. కొన్నిశాఖల్లో నిపుణులు అవసరమైనారు.

ఈ మార్పుల ఫలితంగా మన దేశంలో ప్రభుత్వోద్యోగం ఏ రీతిగా ఉండాలి అనే విషయాన్ని గోపాలస్వామిఅయ్యంగార్ కమిటీ పరిశీలిస్తోంది. ఇప్పుడు ఉన్నతోద్యోగాల్ని రెండురకాలుగా(ఒకటి సామాన్య పరిపాలకవర్గం, రెండు ప్రత్యేక సామర్థ్యంగల నిపుణులవర్గం) విభజించాలని ఒక ప్రతిపాదన ప్రభుత్వ యోచనలో ఉంది. దీని ప్రకారం ఆర్థిక, వాణిజ్యశాఖోద్యోగాల్ని రెండోరకంలో చేరుస్తారు.

ఈ కార్యక్రమాలన్నీ అమలు జరగగానే భారతదేశానికి బలమైన ప్రభుత్వోద్యోగవర్గం నిర్మాణమౌతుంది. రాజకీయ, ప్రాంతీయ, మతాది భేదాలకు తావులేనివర్గం ఏర్పడుతుంది.



డా॥ హట్టా, పండితనెహ్రూ, భారతదేశంలో డచ్చిరాయబారి లాంబింగుగారు

కార్యదక్షత:

ఈ విధంగా ఉద్యోగుల సంఖ్య పెరిగిపోగానే ఉద్యోగుల కార్యదక్షత క్షీణించింది. దీనివలన ప్రభుత్వం ఒకసారి ఏ యే పదవుల్లో ఎవరెవరు నియమించబడ్డారో, ఈ నియామకాలు న్యాయంగా జరిగాయో లేదో పరిశీలించవలసి వచ్చింది. ఉన్నతోద్యోగాలలో నియామకవిధానాన్ని కొద్దిగా సంస్కరించవలసి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో శిక్షణ నిచ్చే ఏర్పాట్లు చెయ్యబడినాయి.

ఉద్యోగుల నియామకంలోనూ ఉద్యోగులను ఉన్నతి పదవుల్లోకి ప్రమోషన్ చెయ్యడంలోనూ ఫెడరల్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్‌కు పూర్తి అధికారా లివ్వబడినాయి.

ఉద్యోగుల్లో శిక్షితవర్తన బొత్తిగా లోపించిందని విమర్శనలు వచ్చాయి. హేతువు లేవైనా కాని ముఖ్యంగా యుద్ధం, దేశవిభజన, మొదలయిన హేతువు లేవైనా కాని దీనిని నివారించవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం ఈ విషయం కఠినంగా అజమాయిషీ చేస్తోంది. ప్రభుత్వోద్యోగు లెవ్వరూ రాజకీయాల్లో చేరగూడదని హెచ్చరించారు. జాతీయరక్షణకోసం ప్రత్యేక చర్యలు తీసుకొన్నారు.

అవినీతి:

ప్రభుత్వోద్యోగుల్లో అవినీతి లేకుండా చెయ్యడానికి ప్రభుత్వం సర్వశక్తులూ వినియోగిస్తోంది. లంచగొండితనాన్ని, అవినీతివర్తనమూ నిర్మూలించడం కోసం ప్రత్యేక పోలీసుశాఖను స్థాపించారు. ఈ శాఖ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యం క్రింద వ్యవహరిస్తోంది. 1948 జనవరి మొదలు 1949 జూన్ వరకూ 104 కేసుల్లో శిక్షలు పడ్డాయి.

ప్రభుత్వోద్యోగుల వ్యవహారవిధులు సవరణ చెయ్యబడినాయి. ప్రభుత్వోద్యోగులు గాని, వారి కుటుంబంలో వారుగాని పదవివల్ల పరపతిని వినియోగిస్తే లబ్ధి కలిగే వ్యాపారాల్లో పాల్గొనరాదనీ, పెట్టుబడి పెట్టరాదని నిషేధించారు. ప్రభుత్వోద్యోగులు, వారిపై ఆధారపడే వారి స్థిరచరాస్తుల వివరాలను సేకరించి పత్రాలు తయారు చెయ్యాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనివల్ల ఎవరైనా అవినీతి వర్తనద్వారా అక్రమార్జనలు చేస్తే శిక్షించడానికి వీలవుతుంది.

రెడ్ టేప్ - అంటే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిపనికీ అనవసరమైన జాప్యం ఆటంకాలు కలుగుతున్నందుకు హేతువుల్ని పరిశీలించారు. ప్రతి పత్రంపైనా అసిస్టెంట్లు వివరాలు తెలుపుతారు. వివిధశాఖలమధ్య సంప్రదింపులు జరుగుతాయి. వీనివల్ల ఫైల్స్ ఒక చోటనుంచి మరొకచోటికి ఒక శాఖనుంచి మరొకశాఖకు, ఒక ఉద్యోగినుంచి మరొక ఉద్యోగివద్దకు ప్రదక్షిణాలు చేస్తూ కూచుంటాయి, కాని ప్రతి విషయాన్నీ సమగ్రంగా పరిశీలించాలంటే ఈ కొంత అంతా అవసరం. ఈ పద్ధతిని ఆట్టే మార్చడం మంచిది కాదని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఫైల్స్‌ని ప్రదక్షిణం చేయించేబదులు ఉద్యోగులే సమావేశాలు జరిపి సంప్రదింపులు జరిపితే కొంత శీఘ్రంగా తెమల్చవచ్చునని ఆ పద్ధతి నిశ్చయించారు.

అయితే ఇదంతా ఉద్యోగుల విశుద్ధవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో విశుద్ధవర్తనులే లేరని ఎవరూ చెప్పలేరుకదా. కొత్తగా చేరే ఉద్యోగుల్లో దేశభక్తిగల యువకులు ప్రజాసేవాకాంక్షతో పని చెయ్యగలరని ఆశించవచ్చును. విద్యావంతులైన యువకుల్లో అందరికీ సమానావకాశా లిస్తే పోటీద్వారా ఉత్తముల్ని ఎంచడానికి వీలవుతుంది. ఈ ఎంచడంలో సమర్థత ఒక్కటే పరిగణింపబడుతుంది.

స్వాతంత్ర్యసిద్ధి అనంతరం ప్రజలకీ ఉద్యోగులకీ మధ్య అంతరం హ్రస్వమై సాన్నిహిత్యం ఏర్పడుతోంది. అప్పుడే ప్రభుత్వోద్యోగుల దృక్పథం మారుతోందని పార్లమెంటుసభ్యులు హర్షం ప్రకటించారు. ఈ ఉద్యోగులవల్ల దేశంలో ప్రజాస్వామ్యం సుస్థిరం కాగలదు. అయితే చేసినది చాలదు. సాధించవలసింది ఇంకా అపారంగా ఉంది. సర్దార్ పటేల్ చెప్పినట్లు సహనం, సానుభూతి, సహకారాల వల్ల అది సాధ్యం కాగలదు

[ప్రభుత్వ సమాచారశాఖపత్రం ఆధారం

కథానిక:

"అదృష్టహీనులు"

'శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ'

ఎటువంటి మహత్తర విషయాన్నైనా, చూసీ చూడ్డంతోనే యిట్టే అవలీలగా గ్రహించేశక్తి కొందరికుంటుంది. అదేవిషయాన్ని గ్రహించటానికొకప్పుడు కొందరికి కొంతకాలంకూడా పట్టొచ్చు. మరికొందరి విషయంలో - యిదే సత్యాన్ని గుర్తించేటందుకుగాను 'అనుభవం' పేరిట అనేక సంవత్సరాల జీవితకాలాన్ని వ్యర్థంగా వ్యయపర్చాలసి వస్తుంది.

మానవజీవిత పరమ రహస్యాల్లో యిదొకటి.

సుబ్రహ్మణ్యానికి నలభై రెండేళ్ల ఆఫీసుజీవితంలో ఒక్కనాడూ యీవిషయం గుర్తుకువచ్చిన పాపాన పోలేదు. ఇంత కాలం తను చలనం లేని శుష్క సంస్కారవిహీనమైన జీవితంలోనే వుంటూ వచ్చాడా? నిజానికిప్పుడతని దగ్గర మనస్సుని కుదుట పర్చుకోవటం కోసం కర్చుపెడదామంటే 'కన్నీటిబొట్లు' కూడా కరువేనా? ఈ యిరువై నాలుగేళ్ల ఆఫీసుజీవితం పూర్తికాగా యిక తనకుగాను మిగిలేది అస్థిమాత్రావశిష్టమైన ఒక శుష్క కాంకాళమేనా? ఎట్లాగైనా యీ జీవితంలోంచి తప్పించుకుని వురికి బయటపడితే బాగుండున్ననిపించింది సుబ్రహ్మణ్యానికి.

పద్దెనిమిదేళ్ల చిన్న తనపు వయసుపొంగుల్లో, వెధవ ముప్పైమూడు రూపాయల ఆదాయాన్నపేక్షించి తలను అమ్ముకోవలసి వచ్చింది. ఆనాటి నుంచి క్రమక్రమంగా శరీరాంగాల్లో మానవికత పుటుక్కుమని తెగి కాలంతో శరీరానికి చాకిరీకి నిమిత్తం లేకుండా - జీవితమంతా జీతపురాళ్ల కోసం కర్చుపెట్టవలసి వచ్చిందంటే - తల్చుకున్నప్పుడు సుబ్రహ్మణ్యానికి దుఃఖంగా వుండమంటే వుండదూ?

డబ్బుపోతే - పోయిందని తెలియగానే విచారిస్తాడు, కాని వ్యర్థమయిన వయస్సుని వ్యర్థమయినట్లు తెలుసుకున్నప్పుడు— మానవుడు ఎటువంటి వేదనకు గురిఅవుతాడో వూహించటం కష్టం.

ఐతే అటువంటి వయస్సులో ఏ బాధ్యతలైతే, నెత్తిన వేసుకుని యీడ్చుకుంటూ ప్రపంచంలో తనూ 'ఒక చిన్న వుద్యోగస్థుడిగా, ఒకసంసారిగా - పెద్దమనిషిగా' చెలామణీ అవుతూ వచ్చాడో అటువంటిబాధ్యతలు బంధకాల్నుంచి విడిపించుకుని ఎక్కడికన్నా పరిగెత్తుకుపోతే బావుండున్ననిపించేది ఒకప్పుడు. ఎటువంటప్పుడు? తెగని కూడికల్తో-బోలెడన్ని జమాకర్చుల్లో-రూపాయి అణా పైసల్ని గిట్టించవలసివచ్చినప్పుడు.

మండు వేసంగిలోనైనా నిలువెత్తు కెరటాలు ఎగిరెగిరి మిడిపెపడ్తూండగా-ఉత్సాహంతో జంట జంటలుగా విహంగమల్లా జనం తిరుగాడుతూంటే అటువంటి కమ్మటి వాతావరణంలో సూర్యాస్తమయ శోభల్ని - లోకం వేసుకునే చీకటి ముసుగులోని ఆంతర్యాల్ని మననం చేసుకుంటూ స్నేహితుల్తో కులాసాగా కాలక్షేపం చెయ్యటానికూడా వీలయ్యేదికాదు. తెగించి ఒకవేళ ఏ పార్కుకిగాని సినిమాకుగాని వుపన్యాసానికిగాని కులాసాగా నలుగురితో వెళ్ళదల్చుకున్నాడో - సరిగ్గా ఆవాళ, చిట్టాకూడికలు నగదు మొత్తానికి సరిపోకపోవటమో, అసలుచిట్టాలోకి ఎక్కించవలసిన మొత్తాలు—చూస్తూండగా బలిసిపోవటమో ఏదో ఒకటి విధిగా జరిగితీరేది. అదీ యిదీ గాకపోతే సెక్రటరీగారితో ఎవరో వస్తున్నారని ఆహ్వానించటం కోసం స్టేషనువరకు వెళ్లవలసి రావటమో, సంభవించేది సుబ్రహ్మణ్యానికి.

ఈవిధంగా ఎటువంటి ప్రముఖ సంఘటనల్తో నకు సంబంధం ఏర్పడినా, ఎంతలేసి మహాత్ములు - పండితులు - కవులు సభలుచేసి విజ్ఞానం వెదజల్లినా, మాంచి రసవత్తరమైన నాటకాలు ప్రదర్శింపబడినా, చక్కని హృదయరంజకమైన పాట కచ్చేరీలు జరిగినా, ఆఖరికి - ఒక్కసారైనాకూడా పాల్గొని సామాజిక జీవిత సుఖాల్నీ, అనుభవాల్ని పొందలేక పోయినాడంటే, వాటిమీద తనకుగల అభిరుచిని ప్రేమను క్రమక్రమంగా తగ్గించుకుంటూ - 'దేనితోనూ నాకిక జీవితంతో నిమిత్తం లేదు-దరిద్రుడిగా పుట్టి దరిద్రుల్ని వుత్పత్తించి దేశాన్ని దారిద్ర్యంలోనే ముంచి నిష్క్రమిస్తాను' అన్న మాధ్యమిక దారిద్ర్య జీవితాంతర్గతఫలమైన వైరాగ్యాన్ని అలవర్చుకుని దుస్సహదుర్నిరీక్ష్యదుర్భర దారిద్ర్యాన్ని యావజ్జీవితము విధిలేక భరిస్తూ ఆఖరికి ఏ చివర గడియల్లోనో 'పెన్షను డబ్బుల'న్నా కళ్ల జూడకుండా యీ యిహలోక యాత్ర చాలించే వేలాదివేల 'సుబ్రహ్మణ్యాలు', జైళ్లలో దెబ్బలు తిని, యుద్ధాలలో కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకుని, అకారణంగా రాజకీయపు కత్తుల్లో వురితీయబడి, దేశంనుంచి బహిష్కరింపబడినటువంటి 'యోధాగ్రయోధుల' 'దేశభక్తుల' జాబితాల్లోకి గాకపోయినా ఎందులోనూ వారికిమాత్రం తీసిపోరు.

ఎందువల్లనంటే 'సుబ్రహ్మణ్యం' వంటి గుమాస్తాజీవులు గాంధిజీ, మాలవ్యా, తిలకు, గోఖ్లే, వంటి మహాపురుషుల ఛాయలకైనా రారు. 'కాళిదాసు - భవభూతి - బాణుడు - శ్రీహర్షుడు' వంటి పూర్వపురుషులకున్న ప్రాముఖ్యతన్నా లేదు. కాని వీళ్ల మాత్రం అడివిలో ఎండిపోయిన మ్రానుచివర గాలివిసురికి పుటుక్కుమని విరిగి రాలిపోయే ఎండుపుల్ల ముక్కలు

సుబ్రహ్మణ్యం వంటి బుర్రనమ్ముకున్న వ్యక్తులవల్ల సమాజాలు పొదగబడవు - ఎదగనూ లేవు. కాకపోతే సమాజంలో కొల్లమాత్రం గొప్ప సేవల్ని-కొద్ది ప్రతిఫలానికి చేస్తూ వచ్చారు

బానిస బ్రతుకుకన్నా అధ్వాన్నమైన రీతిలో కష్టాలు పడుతున్నప్పటికి సహిస్తూ, కడుపు చేత్తో పట్టుకుని, జీతపురాళ్లమీద ఆధారపడి పెద్ద పెద్ద గంపంతసంసారాల్ని యీడుస్తూ, పిల్లల్ని కంటూ చదువులు పెళ్లిళ్లు కార్యం కరామత్తులు చేయిస్తూ వున్నట్లుండి ఏదో ఒక సుముహూర్తాన గూటాములై సర్దుకుని పరలోకాలకు ప్రయాణమై పోతారు

సుబ్రహ్మణ్యం కూడా అటువంటి కష్టజీవుల్లో ఒకడు.

ఆవేళ సరిగ్గా జీతాలిచ్చేరోజు. ఇంపీరియలు బ్యాంకునుంచి చిల్లర - క్రొత్తనోట్లుకూడా తెప్పించుకుని సిద్ధంగా వున్నాడు కూడా. అప్పటికీ ఉదయం పదిన్నరకి, గుప్పెడు మెతుకులు నోట్లో కుక్కుకుని, ఆదరాబాదరా దుస్తులు వేసుకుని, యిచ్చిన తమలపాకులను వీధిలోనే నడుస్తూ సున్నం రాసుకుంటూ, దారిలో కనపడ్డ ఎలక్ట్రిక్కు స్తంభాలకు చెయ్యి తుడుచుకుని కుర్చీలో కూలబడే సరికి తల ప్రాణం తోకకొచ్చింది

రిక్షామీదగాని, సిటీబస్సుమీదగాని వచ్చినట్లయితే యింతకష్టమనిపించదు. కాని జీతపు డబ్బుల్నందుకుంటేనే గాని రిక్షాయెక్కటానికి గాని, బస్సు నందుకోవటానిగ్గాని తనకు సామర్థ్యమెక్కడిది?

అక్కడికీ పెద్దపిల్ల - తొట్లో పిల్లవాడికి పాలు నోట్లో పెడుతూ 'నాన్నా! ప్రక్కవాళ్లింటి కెళ్లి పావలా చేబదులు తేనా? నడిచేం వెళ్తావులెమ్మ'ని సర్దుకుని లేవబోయింది

'ఎందుకమ్మా నడక అలవాటేగా-' అని వారిస్తూ, 'వద్దమ్మా! లేవకు. అట్లా చీటికి మాటికి పావలాలకు బేడలకు అందరిళ్లకూ అప్పుకి పోతే పరువు మర్యాద లుండవు. ఒకవేళ ఎదుటివాళ్లు లేదన్నా-విసుక్కున్నా ప్రాణం చచ్చిపోయినట్లనిపిస్తుంది.' అంటూ వీధిలోకొచ్చి వుత్తరీయం ఒక్కమాటు గట్టిగా విదళించి పైనవేసుకుని రెండంగలు కూడా వెయ్యకుండానే - మీనాక్షి గొణుక్కుంటూన్న వాక్యాలు వినపడ్డాయి ఏమని?

'నాన్నా! ఐతే యీకుటుంబంకోసం యీ కుటుంబమర్యాదకోసం నువ్వొక్కడివే కష్టించాలా? నాన్నా ఎంత పిచ్చి నీకు-' అని.

సరిగ్గా ఆ నిమిషాన తోచింది - 'తన యావజ్జీవితము వ్యర్థమయిపోయినట్లు' సుబ్రహ్మణ్యానికి. ఆ బాధ పైకి రాలేక కళ్లవెంబడి బొట్లు బొట్లుగా ధారకట్ట కోటుముడతల్లో యినికి ఆఫీసు కొచ్చే సరికి గొండిపోయింది

నిజంగా వ్యర్థమయినదేనా? ఈజీవితానికింక వూపిరి లేకుండా పొట్టకోసం ఎల్లవేళలా కష్టించటమే పరమావధా? ప్రపంచంలో ఎంతలేసి ఘనకార్యాల్ని మానవుడు యీ కొద్ది జీవితకాలంలో నిర్వర్తించి యశఃకాయుడవటం లేదు తనో? తనవుపాధినిమిత్తమే యీకాజీవితాన్ని కుటుంబపోషణకనే పేరుతో వ్యర్థంగా కర్చుపెట్టేస్తున్నాడే?

అవును! మీనాక్షి అన్నమాటలో అయథార్థం రవ్వంతకూడా లేదు. ఎందువలనంటే తనకుటుంబ మర్యాదకోసం, కుటుంబకోసం తన తదనంతరం కష్టించేవారెవరు? ఒకవేళ తనపోతే తన్ను తలుచుకునే వారెవరింక? నిజంగా అంతే కూడా ఈవాళ సాయంత్రం కాలుడి ఆజ్ఞఐతే తను ప్రయాణానికి సిద్ధంగా వున్నాడా?

ఇంటా బయటా చేబదుళ్లు వినపోయిస్తే బోలెడన్ని అప్పులు - యివన్నీ ఎవరు తీరుస్తారు? మూడు వేలకు అరగాని తక్కువైతే పిల్లనుచేసుకోనన్న అల్లుడికి తనకుటుంబమర్యాదను నిలపవలసిన అవసరం ఏం కలిగింది?

మీనాక్షికి మేనరికమే గనుక చేసివున్నట్లయితే యీ ప్రసక్తి తన కిప్పుడు వచ్చివుండె వారసరం లేదు. రాఘవుడెవరు? తనసహోదరిగర్భవాసాన పుట్టిన దిక్కుమాలిన నిసువేగా. ఇప్పుడయితే యిట్లాజరిగింది గాని యింతకుముందు కూడా ఎదురు మేనరికం పనికిరాదు యీవ్వకూడదంటూ వచ్చారుగా నలుగురూ. తనయింట్లో తన పిల్లతో పెరిగి పెద్దవాడయి గడ్డాలు మీసాలు వస్తూండగా ఒకనాటి దౌర్భాగ్యపు సాయంత్రాన చేతికందే వయస్సులో వధవస్కూలుఫైనలు పరీక్షకు పోయిందన్న కారణంగా పరారయి యింట్లోంచి లేచిపోతే - చచ్చాడో బ్రతికే వున్నాడో మళ్లీ వస్తాడో రాడో ఎట్లా తేలటం?

'మీవాడు యుద్ధంలో చేరి మలయా - సింగపూరు - ప్రాంతాల్లో వుంటూ వుండవచ్చునేమో, యుద్ధం అయిపోయినాకూడా అక్కడే వుండిపోతానని పెళ్లాం బిడ్డల్తో నిమిత్తం లేకుండా అక్కడి స్త్రీలతో కాలక్షేపం చేస్తూంటాడని' కొందరంటారు. ఇది నమ్మశక్యంగా లేదు. ఎందువల్లనంటే 'రాఘవుడు' నిజంగా అభిమానంకొద్దీ యింట్లోంచి వెళ్లిపోయుంటే, యీచతుస్సాగరపరీతభూవలయంలో ఎక్కడున్నా 'మీనాక్షి' కోసమన్నా రాకపోతాడా అన్న ఆశ కొంత కాలం సుబ్రహ్మణ్యాన్ని బాధించేది

'రాఘవుడి' వద్దనుంచి 'మావయ్యా నేను ఫలానాచోట వున్నాను. జీవితంలో స్థిరపడ్డా' అన్న వుత్తరంముక్కన్నా ఎక్కడ్నుంచీ వూడిపడలేదు

ఇంకఏ ఆశమీద రాఘవుడు బ్రతికివుంటున్నాడనుకుంటూ ఎంతకాలం ఎదిగిన కూతుర్ని 'పెళ్లి పెటాకులు' చెయ్యకుండా అట్టే బెడ్తాడు

క్రమంగా మేనరికపుటాశ జీర్ణించిపోగా - 'భగవంతుడా! ప్రభూ! యింత చేశావా! యిన్నేళ్లు పెంచిన మేనల్లుణ్ణి దాచి మాయం చేసి నాటకమాడుతున్నావా?' అని విలపిస్తూ మూడువేల పైబడిన వ్యయంతో మరోపై సంబంధాన్ని చేసి కూతురికి కన్నెచెర విడిపించానని పించుకున్నాడు సుబ్రహ్మణ్యం

'మీనాక్షి'కూడా యిందుకేమాత్రం అభ్యంతరాన్ని సూచించలేక పోయింది. ఆ పిల్లమనస్సులో ఏమేమి వూహించుకున్నదో, ఏమనుకున్నదో, ఏమేమి తీర్మానించుకున్నదో ఎవరికీ తెలియదుకాని - క్రొత్తమనిషిని యిట్టే పెళ్లాడేసింది. వెంట వెంటనే చాలా గుట్టుచప్పుడుగా ఎక్కువ హృదయభారంతో పిల్లనత్తవారింటికి పంపటం - వెళ్లిన మూడు నాలుగు మాసాలకే ఒక గర్భం నిలవటం - మళ్లీ ఐదారుమాసాలు పైబడకుండా సీమంతోత్సవాల్ని జరిపి గాజులు తొడిగించి పిల్లనింటికి తీసుకురావటం అన్నీ చకచక జరిగిపోయాయి. సుబ్రహ్మణ్యానికి 'మనవడ్ని' ఎత్తుకునే అదృష్టం కూడా అచిరకాలంలోనే కలిగింది. కలిగినా ఆ సంతోషరేఖ అతని ముఖసీమలో ఎక్కడా కంచుకాగడాల్తో వెదకిచూచినా కనపడ్డంలేదు.

సహజంగా యిప్పుడు 'రాఘవుడ్ని' గూర్చి ఎవ్వరూ ఎక్కువగా ఆ యింట్లో ప్రసంగించటాని కిష్టపడరు. ఏ రైలుక్రిందో చెరువులోనో పడి అసువుల్ని చాలించి వుంటాడని విన్నప్పుడు 'రాఘవుడి'కోసం ఎవరైతే ఎక్కువగా గిలగిల్లాడి బాధపడివున్నారో-వారే ఆ 'మీనాక్షి సుబ్రహ్మణ్యా'లే క్రమ క్రమంగా అతడ్ని గూర్చి స్మరించవలసి వచ్చినపుడు మళ్లీ ఎన్నటికీ తిరిగి రాకుండా వుంటేనే బావుండున్నే ఆలోచనకు వచ్చారంటే, కాలప్రవాహంలో ఎంతటి రూపులైనా ఎట్లా కొట్టుకుపోగలదో బోధపడక మానదు.

పూర్వం రాఘవుడు చదువుకునే గదిని, వాడి పుస్తకాల్ని, వాడి బట్టల్ని - రోజున పైమీద ఒకే ఒక వుత్తరీయంతో గృహపరిత్యాగం చేసిననాటినుంచి కొన్నాళ్లవరకూ మహాచారిత్రికమైన వస్తువులుగా భావించి యింటి పాడీ చూసుకున్నారు. ఇంత యెందుకు? ఆఖరికి 'మీనాక్షి' శోభనం నిమిత్తం ఆ గదిని కాళీచేసి పక్క సమర్చవలసి వచ్చినప్పుడు ఒక్కొక్క ప్రియ బాంధవుడి సంస్మరణచిహ్నాన్నీ అంటే పక్కచుట్ట పుస్తకాల్ని - చొక్కాల్నితీసి ఒక గూటకు నిరుపయుక్తాలుగా గిరాటుపెట్టవలసి వచ్చినపుడు అదే రాఘవుడికెదలో - ఘువుడితో కాకుండా మరొక వినూత్నవ్యక్తితో మీనాక్షిని కలుపుతున్నాననే శంకతో సుబ్రహ్మణ్యం మనస్సెంతగా క్షోభించి వుంటుందో ఎవ్వరూహించగలరు?

ఎప్పుడూ అంతర్యంలో ఒక ద్వంద్వ యుద్ధం జరుగుతూండేది సుబ్రహ్మణ్యానికి. దానికి మనవడు కలిగాడనే సంతోషం లేకపోవటం ఒక కారణం. కూతురిమీద ప్రేమ కొద్దీ ఎత్తుకుని లాలించినా 'యీ నిసువు తనకేమీ కాడేమో-' అనిపించేది మనస్సులో

'వీడు నీ మనవడేగదా వాణ్ణి నువ్వు పరిపూర్ణంగా అభిమానించి నిష్కల్మషంగా ఎందుకాదరించలేవు?' అని ప్రశ్నించేది మనస్సు


'వీడితల్లి నా కూతుర్ని ఏలటంకోసం నాదగ్గర గుంజిన మూడువేలకి ఫలితంఅందువల్ల నేను అథఃపాతాళానికి అంటే భవిష్యత్తులో నేను చచ్చేదాకా తీర్చవలసినంత అప్పుకి ఫలితం వీడు. నా కూతుర్ని ప్రేమించినంతగా వీణ్ణి ప్రేమించలేక పోతున్నాను.' అని సమాధానమిస్తుంది అంతరాత్మ

తిరిగి మనస్సు పూరుకుంటుందా-తర్జనభర్జనలు చేస్తానంటుంది ఏమని? 'ఓయి సుబ్రహ్మణ్యమూర్తీ! యిదేమి పక్షపాతం నీకు. రాఘవుడి కొడుకే ఐతే నీ వెట్లా ప్రేమించి వుండేవాడివి? ఇది నీకు ధర్మంకాదు. రాఘవుడివల్ల మీనాక్షికి కలిగితే ఎట్లా ఆదరించి ప్రేమించేవాడివో అట్లానే యీ పిల్లవాడ్నికూడా ఎందుకు చూడవు?' అని. దీన్ని పూర్వపక్షం చేస్తూ అంతర్యంలో యిట్లా ధ్వనిస్తుంది. 'ఒకప్పుడు నీ కన్నట్లు రాఘవుడే నాకూతుర్ని ఏలటం సంభవిస్తే వాడి కొడుక్కి యిట్టి అనర్థం జరిగే అవకాశాన్ని వాడు ఒక్కనాటికి సృష్టించుకునేవాడు కాదు. ఎందువల్లనంటే రాఘవుడితో నాకుగల బాంధవ్యం అర్థజ్ఞానాతీతమైన ప్రేమసంబంధం-' అని


గతించిన జీవితాన్ని తలపోసుకుంటూ భవిష్యత్తు నెందుకు దుఃఖభాజనం చేసుకుంటూ వన్న ప్రశ్నకు సమాధానంమాత్రం దొరకలేదు సుబ్రహ్మణ్యానికి.

ఆఫీసులో జవానుకూడా సుబ్రహ్మణ్యం వాలకాన్ని చూసి నవ్వుతాడు. దర్బారుగా వారింటికి పోయినప్పుడల్లా మేనేజరు గారుండా ఆయన కొడుకు సైతం 'ఏమయ్యా' అని అథార్టీ చెయ్య


(16-వ పేజీ చూడుడు)



. మంచుకన్నా చల్లని కాశ్మీర్ పర్వతాల్లో చలికి బిగుసుకుని పోయేది మనుషులేకాదు, కార్లుకూడా! మంచుకు బిగిసిపోయిన ఈ జీప్ కారును మెకానిక్‌లు బాగుచేస్తున్నారు.



ఆప్తులనుండి ఆప్తవర్తమానాల కోసమై రణవీరుల ఆత్రం



భారతసైన్య శిబిరాల్లో మిక్కిలి ప్రధానమైన నియమం పరిశుభ్రత. శిబిరం ఎంతో శుభ్రంగా ఉంచబడుతుంది. అగ్రస్థావరాల్లో ఈ నియమాలు మరి కఠినంగా ఉంటవి.



గుండెలు తీసినబంటు—చుట్టుపక్క ల
ఒక చిన్నదళంతో పంపబడ్డాడు వాళ్ళొక మ
కాని లాల్ బహదూర్ వెనుకాడకుండా తన
చేయుటయేకాక మూడు అంగుళాల మాతిగు

కాశ్మీర్ ...
హిమగి...
భారతవీరుల ...


క న...

(కాశ్మీరు యుద్ధరంగ దృశ్యాల...
ర్శనం, జూలై ఆఖరువారంలో మద్రా...
ఈ చిత్రాల నిట ప్రచురిస్తున్నాము—

తిరుగనియోధుడు రుద్రసింగ్ —కాశ్మీ
ములో ముందునడిచే సాయుధశకటాన్ని నడప
వచ్చారు. మందుగుండువల్ల, మరి ఇతరకారణా
లిన వారి క్షేమంకోసం వీరు ప్రాణాలర్పించ







మా దెబ్బకు ॰డ్డంలేదు.
'ప్రపంచంలో కల్లా ఎత్తై
యిన రోడ్డు ఇది. దానిని
మేముక్టే నిర్మించగలం' అ॰
రాజ్ ధాన్ కనుమ పక్క॰
కొండ శిఖరాలమీద భార॰
సైన్య కాపర్స్ సగర్వంగా
ఒక అట్టమీద వ్రాసి నిల॰
॰ారు. 'ఓ, దాని మీ ॰
మేము నడిపించగలం' అని
భారతీయ డ్రైవర్లలో ఒకరు
సగర్వంగా వ్రాశారు.

॰త్రువుల జాడలు కనిపెట్టిరమ్మని లాల్ బహదూర్ రాణా
॰వు తిరగ్గానే రెండు శత్రుదళాలు అకస్మాత్తుగా ఎదటపడ్డవి.
॰ద్దిమంది సహచరులతో వాళ్లమీదికి దూకి తీవ్రనష్టాలు కలగ
॰రంగి నొక దానినికూడా పట్టుకున్నాడు.

॰ుద్ధరంగం
॰రి-శిఖరాల్లో
॰సాహసకృత్యములు
॰ల్ కృష్ణ

॰ను చిత్రిస్తూ రచి॰మైన ఈ వర్ణచిత్రాల ప్రద
॰ులో జరిగింది. ఆర్మీ అధికారవర్గ సౌజన్యంతో
॰సం॥)


॰ంగంలో జరిగిన పోరాటాల్లో ముఖ్యమైన ద్రాస్ పోరాట
॰నికి సిపాయ్ గుర్దేవ్ సింగ్, డ్రైవర్ అనంతరామ్‌లు ముందుకు
॰ల్ల తమ శకటం ధ్వంసం అయే అవకాశం ఉన్నప్పటికీ, మిగి
॰ధపడ్డారు. అదృష్టవశాత్తు వీరి సిగల్లొనైనా వాడలేదు.



పథరక్షకుడు—12 వేల అడుగుల ఎత్తున ఒక మోటారు రోడ్డును రక్షిస్తూ ఉన్న భారతీయసిపాయి.



యుద్ధరంగంలోని అగ్ర
సావరాల్లో టెలిఫోన్ ఎక్స్
ఛేంజ్‌లు లేనిదే ఒక్క
పని సాగదు. సైన్యంతో పా
టుగా టెలిఫోన్, వైర్లెస్
సిగ్నలర్లు పై కనపరచబడిన
సరంజామాతో ముందుకు
సాగిపోతూ ఉంటారు.



పిల్లలకథ :



వీరనారి చిన్నాదేవి

మూలం: 'ప్రేమచంద్' ★ అనువాదము: మర్ల సూర్యనారాయణ సోమయాజులు

రెండు శతాబ్దాలు గడిచేయి. కానీ చిన్నాదేవి పేరు ప్రతిష్ఠలు మాత్రం తగ్గలేదు. బుందేలుఖండుయొక్క ఒక యెత్తైన ప్రదేశంలో, ఇప్పటికి కూడ మంగళవారముప్రొద్దున స్త్రీలు పురుషులు చిన్నాదేవియొక్క పూజ చెయ్యడంకోసం వస్తూనే వున్నారు. ఆ నిర్జనప్రదేశం ఆ రోజున వింతధ్వనులతోను రంగు రంగుల వస్త్రములు ధరించిన స్త్రీ జనముతోను శోభాయమానంగా తోస్తుంది. దేవి మందిరము చాలా ఎత్తైన ప్రదేశంలో నిర్మింపబడి వుంది. ఆ ప్రదేశంలో ఎగురుతూండే నల్లనైన జండా చాలాదూరంనుంచే కనిపిస్తూ వుంటుంది. దేవియొక్క మందిరంలోనికి ఇద్దరు వ్యక్తులు అతి కష్టమీద వెళ్లడానికి వీలుగా ఉంది. లోపల విగ్రహం కనపడదు కాని ఒక చిన్న వేదిక పైకిమాత్రం అగుపడుతూ వుంటుంది. క్రిందనుంచి మందిరంవరకు బాట ఒకటి వేయబడి వుంది. ఆపద రాకుండా రక్షణకోసము బాటకి రువైపులా గోడలు కట్టబడి వున్నవి. ఆ ప్రదేశంలోనే చిన్నాదేవి చితి నెక్కింది. లోకరీతి ననుసరించి ఆమె చనిపోయిన భర్తతో చితి నెక్కి యుండలేదు. ఆమె భర్తచేతులు కట్టుకుని ప్రక్కన నిలచి యున్నప్పటికి ఆమె అతని వైపు కన్నెత్తి చూడలేదు. ఆమె అతని భౌతికశరీరంతో చితి కాలేదు. అతని ఆత్మతో చితి అయింది. ఆమె చితిమీద ఆమె భర్తశరీరములేదు. కాని అతని మర్యాదాది గౌరవములున్నాయి.

యమునానది ఒడ్డున కాలపి అనే నగరం వుంది. చిన్త ఆ నగరంలో ఒక సేనాధిపతియొక్క కుమార్తె. ఆమె తల్లి చిన్నతనంలోనే పరలోకం వెళ్లిపోయింది. ఆమె పోషణభారం తండ్రి మీద పడింది. అవి సంగ్రామపు దినములు. యుద్ధపు దుస్తులు విడచుటకు విశ్రాంతి లేని సైనికులు గుఱ్ఱపు వీపుల మీదనే ఆహారము తీసికొనుచున్నారు. గుఱ్ఱపు జీనులమీద విశ్రాంతి తీసుకుంటున్నారు. చిన్త తన బాల్యావస్థని తండ్రితో యుద్ధభూమిలో గడిపింది. తండ్రి ఆమెను చెట్ల తొర్రలలోను, ఆకుల నీడలలోను విడిచి యుద్ధభూమికి పోయేవాడు. ఆమె నిర్భయంగా మట్టితో కోటలు నిర్మించుకునేది. అవే ఆమె ఆటవస్తువులు. వాటితోనే ఆమె ఆటలు. ఆమె సిపాయిల జట్లను నిర్మించి రణరంగంలో నిలిపేది. ఒక్కొక్కప్పుడు ఆమె తండ్రి సంధ్యాసమయం దాటిన తరువాత కాని వచ్చేవాడు కాడు. అయినప్పటికి చిన్త భయపడేది కాదు. ఆ నిర్జనప్రదేశంలో దాహంతోను, ఆకలితోను రాత్రిళ్లు గడిపేది ఆమె. ఆమె ముంగిస, నక్క వీటి కథలను వినలేదు. స్వార్థత్యాగులైన వీరుల కథలు విని, ఆమె వీరవనిత, అధర్మవాదినిగా తయారైంది.

ఒకానొకసారి మూడు రోజుల వరకు ఆమెతండ్రి జాడ ఆమెకు తెలియలేదు. ఆమె ఒక పర్వత గుహలో కూర్చుని తండ్రి రాకకై ఎదురు చూస్తోంది. మూడవ రోజు సంధ్యాసమయమున ఆమె తండ్రి యొక్క అనుచరులు విచార పూరితములైన ముఖాలతో ఆమెను సమీపించేరు. చిన ఆశ్చర్యముతో అడిగింది— తండ్రిగారెక్కడ? మీరెందుకేడుస్తున్నారు?

ఎవరూ ఆమె ప్రశ్నకు జవాబివ్వలేదు. వాళ్లంతా మరింత ఎక్కువగా ఏడవడం మొదలు పెట్టేరు. తన తండ్రి వీరస్వర్గాన్ని పొందేడని ఆమె తెలుసుకుంది. ఆ పదమూడు వత్సరముల బాలికకంటినుండి ఒక్క నీటి బిందువు కూడ రాలలేదు. ముఖంలో విషాద చిహ్నాలు వెతికినా కనబడలేదు. ఒక్క నిట్టూర్పు విడవలేదు. నవ్వి పలికింది— అతడు వీరస్వర్గాన్ని పొందేడు. మీ రెందుకు ఏడుస్తారు? యుద్ధములో ఇంతకు మించిన చావు ఇంకెవ్వరికి వస్తుంది. ఇది విచారింపవలసిన సమయము కాదు. ఆనందింపవలసిన సమయం.

ఒక సిపాయి విచార స్వరంతో అన్నాడు - మాకు నిన్ను గురించి విచారంగా వుంది. నువ్వు ఇప్పుడు ఎక్కడ వుంటావు?

నన్ను చిన్త గంభీరస్వరంతో అంది— నా గురించి మీరు విచారించకండి. నేను నా తండ్రి కూతుర్ని. నా తండ్రి ఏమైతే చేసేడో— నేనూ అదే చేస్తాను. శత్రువుల పంజానుంచి మాతృభూమిని రక్షించడం కోసం ప్రాణాలని త్యాగం చేశాడు. నేను కూడా అదే ఆదర్శంగా పెట్టుకుంటాను. వెళ్లండి మన పరివారాన్ని, సిద్ధపరచండి. నాకు ఒక గుఱ్ఱాన్ని కత్తిని ఇవ్వండి. నా వెనుక మీరంతా నన్ను అనుసరించండి. నేను గనక భయపడి పారిపోవడం తటస్థించినట్లయితే కత్తితో నా పీక నరకండి. ఇది నేను మిమ్మల్ని కోరుతున్నాను. వెళ్లండి ఆలస్యం చెయ్యకండి.

చిన్తయొక్క వీరవచనాలు విని సైనికులు కొంచెం కూడా ఆశ్చర్యమునొందలేదు. కోమలమైన ఆ బాలిక ఆమె సంకల్పం మీద దృఢంగా నిలబడ గలదా? అనే సందేహం వచ్చింది వాళ్లకి.

ఐదు సంవత్సరములు గడిచేయి. అన్ని ప్రాంతాల్లోనూ, చిన్నాదేవి ప్రతాపం పాకి పోయింది. శత్రువులు పూర్తిగా నాశనము చేయబడ్డారు. ఆమె విజయమూర్తి. ఆమె వారి ఎదుట నిలబడి వారికి ధైర్యాన్ని కూరుస్తోంది. ఆమెముందు ఏ శత్రుయోధుడు నిలబడ గలడు? ఆమె అభిమానము పొందటానికి ఎవరు మటుకు వారు ప్రయత్నిస్తున్నారు. ప్రతీవారూ స్వార్థత్యాగానికి సిద్ధపడేవారే. వీరవనిత చిన్నాదేవి పేరు నలుదిక్కులా మారు మ్రోగింది. అనేక ప్రదేశాలనుంచి వీరులైన యువకులు, రాజపుత్రులు ఆమె సైన్యాలలో చేరేరు. ప్రతివారూ తమ శౌర్య సంపత్తిని వ్యక్తపరుస్తూ ఆమె అనుగ్రహం కోసం ప్రాకులాడుతున్నారు.

వారందరిలోనూ రత్నసింహుడొక రాజపుత్ర యువకుడు.

మాటకోసం ప్రాణాన్నిచ్చే వాడు. అగ్నిలో దూకేవాడు నిర్భీతితో. ఆమె ఆజ్ఞ గైకొని ఆకాశంమీద నక్షత్రాలను తేవడానికి యత్నించే యోధుడు. ఆ వీరులందరిలోనూ రత్నసింహుడు గొప్ప పరాక్రమశాలి. చిన్తకూడా అతనిని హృదయములో ప్రేమిస్తోంది. రత్నసింహుడు మరితరుల వలెనే శౌర్యాన్ని ఆమె ఎదుట ప్రదర్శించాలనే కపటనటుడు కాడు. అతడు వారందరిలోను మంచి పేరు సంపాదించుకున్నాడు. అతడు చేసే ప్రతీ పనీ ఆమెకోసమే చేసేవాడు. అతని లక్ష్యం అదే. అతడు చేసే ప్రతీ పనీ శాంతభావంతో చేసేవాడు. అతనిలోని వినయశీలం, నమ్రభావం స్వాభావికమైనవి. ఇతరుల ప్రేమ, విలాసంతో కూడుకొని వుంటుంది. కాని రత్నసింహుని ప్రేమ, త్యాగాన్ని వెళ్లగ్రక్కుతూ వుంటుంది. ఇతరులంతా రాత్రి వచ్చేసరికి నిద్ర పోయేవారు. కాని రత్నసింహుడు మాత్రం నక్షత్రాలు లెక్కపెడుతూ తెల్లవార్లు మేల్కొని ఆమెను రక్షిస్తూ వుండేవాడు. ప్రతీవారూ చిన్త తమదే అవుతుందని వుఱ్ఱూత లూగేవారు. కేవలం రత్నసింహుడు నిరాశ చెందుతాడని తలచేవారు.

చాలా రాత్రి గడచింది. చిన్త తన గుడారంలో విశ్రాంతి తీసుకుంటోంది. సైనికులు ప్రయాణ బడలికచేత మైమరచి నిద్ర పోతున్నారు. కొంచెం దూరంలో ఒక దట్టమైన అడవి అల్లుకొని వుంది. అడవి ఆవతల శత్రువులు డేరాలు వేసుకొని వున్నారు. శత్రువులరాక విని చిన్త వెంటనే బయలుదేరి అడవి యివతల గుడారాలు నిర్మించుకుని రణానికి సిద్ధంగా వుంది. ఉదయాన్నే వారి మీద దండెత్తడానికి నిశ్చయించుకుంది. శత్రువులు తన రాకని తెలిసికొని వుండరని ఆమె విశ్వాసం. కాని అది వట్టి భ్రమ. ఆమె సైన్యంలో ఒకడు శత్రు పక్షంలో చేరాడు. ఇచ్చటి వార్తలు అచ్చటికి ప్రతిక్షణం చేరుతూనే వున్నాయి. వారు చిన్తని రహస్య మార్గాన్ని చంపడానికి కుట్ర పన్నేరు. ఆమెను రహస్యంగా చంపడం కోసం ముగ్గురు సిపాయిలను నియమించేరు. క్రూరులైన ఆ పశుప్రాయులు చప్పుడు చేయని అడుగులు వేసుకుంటూ చెట్ల ఆకుల మధ్యనుంచి చిన్నాదేవి ఎక్కడ వుంటుందా అని ఆలోచించుకుంటున్నారు. సేన అంతా నిద్రపోతోంది. ఆ కారణం చేత వారి పనికి ఆటంకం కలుగుతుందన్న సందేహం వాళ్లకి లేకపోయింది. చిన్త నిద్రిస్తూ వున్న డేరాను సమీపించేరు.

సైన్యం అంతా నిశ్శబ్దంలో నిద్ర పోతోంది. కాని ఒక్క ప్రాణి మాత్రం కూర్చుని వుంది. అతడు రత్నసింహుడు. అతనికి ఇది ఒక కొత్త పని కాదు. యుద్ధభూమిలో డేరాలు వేసినప్పుడు రాత్రింపగలు చిన్తను కాపలా కాయడం, రక్షించడం అతనికి పరిపాటే. హంతకుల కాలి చప్పుడు విని ఒరలోని కత్తి తీసి నిలబడ్డాడు. పరకాయించి చూచేసరికి ముగ్గురు మనుష్యులు వంగి నడచి వస్తున్నట్లు కనబడింది. ఇప్పుడు ఏమిటి చెయ్యడం? ఆ క్షణంలో గోల చేసినట్లయితే సైనికులు లేచి ఒకళ్లను ఒకళ్లు కొట్టుకొని చని పోవడం తథ్యం. ఇక్కడ ముగ్గురితో పోరడం ప్రాణాపాయము. ఆట్టె ఆలోచించడానికి వ్యవధి లేదు. అతడు యుద్ధం చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. కత్తి తీసుకొని ముగ్గురి మీదకి ఉరికేడు. చాలా నిమిషాల వరకూ కరవాలాల కలవరం వినిపించింది. ఒక్కసారి నిశ్శబ్దం. అక్కడ ముగ్గురు యోధులు గాయాలుతిని పడి పోయారు. రత్నసింహుడు కూడ బలమైన గాయలు తిని నేలమీద ఒరిగాడు.

తెల్లవారుఝామున చిన్త లేచింది. గాయాలుతిని నేలమీద పడివున్న నలుగురి యోధుల్ని చూచింది. ఆమె ఆశ్చర్యపడి నిశ్చేష్టురాలయింది. దగ్గిరికి వెళ్లి చూసింది. హంతకులు ముగ్గురు చచ్చి పడి వున్నారు. రత్నసింహుడు మాత్రం కొనవూపిరితో వున్నాడు. జరిగిన సంఘటన అంతా గ్రహించింది.

నారీత్వం వీరత్వాన్ని జయించింది! ఏ కంటినుంచి తండ్రి మరణవార్త విని నీరు రాలేదో, ఆ కంటి నుంచే ఆక్షణంలో కన్నీరు కాల్వలై పారింది. రత్నసింహుని ముఖాన్ని తన ఒడిలోనికి తీసుకుంది. ఆమె హృదయాంగణంలో గ్రుచ్చి వుంచిన జయమాలని స్వయంవర సమయంలో అతని మెడలో వేసింది.

నెలరోజులు గడిచేదాకా రత్నసింహుడు కళ్లు తెరువలేదు. చిన్త కళ్లు మూయలేదు. చిన్త అతన్ని విడచి ఒక్కక్షణంకూడా ఎక్కడికీ వెళ్లలేదు. యుద్ధం మాట మరిచి పోయింది. రత్నసింహుడికి ఆమె తన ఆస్తినంతా బలిదానం చేసింది. పూర్తిగా నెలరోజులు గడిచిన తరువాత రత్నసింహుడు కళ్లు తెరిచేడు. తను పరుపుమీద పడుక్కొని వుండడం ప్రక్కని చిన్త విసురుతూ వుండడం చూసేడు. క్షీణస్వరంతో అన్నాడు—చిన్తా పంకా నాకియ్యి, నీకు కష్టం అవుతోంది.

ఆ సమయములో చిన్తా స్వర్గాతీతమైన సుఖాన్ని పొందింది. నెలరోజుల వెనుక ఎవరు అందరి అధిపతో ఆమె స్నేహభావంతో మధురస్వరంతో అంది. "ప్రాణనాథా! ఇదే కష్టమైన పనైతే ఇకమరి సుఖమైన కార్యమేది? నాకు తెలియదు." "ప్రాణనాథా!"—ఆ సంబోధనలో న్యాసత గోచరస్తోంది. రత్నసింహునికళ్లు చెమ్మగిల్లేయి. జీవిత ప్రవాహం కొత్తపంథాను తొక్కింది. ఆజీవితంలో ఎంత సమయస్ఫూర్తి, ఎంత ఉత్సాహం, ఎంత మాధుర్యం, ఎంత ఉల్లాసం తొణికిసలాడుతున్నాయి. రత్నసింహుని ప్రతీ అంగం కొత్త ఉత్సాహంతో పనిచెయ్యడం ప్రారంభించేయి. ప్రపంచకాన్ని జయించగల ననుకున్నాడు. అతనికి ప్రపంచకంలో ఇంక కావలసినదే లేదు. అతని ఆశలన్నీ పూర్తి అయ్యేయి. శివుడు ప్రత్యక్షమై 'ఏం కావాలి కోరుకో నాయనా' అన్నా, అతను కోరే వరాలేమీ లేవు. అతనికి ఏ పదార్థంమీదా ఇచ్ఛ లేదు. అతడు గర్విస్తున్నాడు అతనికంటె సుఖవంతుడు, భాగ్యవంతుడు ఉండడని.

చిన్త అంది—నా కారణంగా మీకు చాలా కష్టమయింది.

రత్నసింహుడు లేవబోతూ అన్నాడు, లేకపోతే తపస్సిద్ధి ప్రాప్తం కాదు.

చిన్త తన కోమలహస్తాలతో రత్నసింహుని పడుకోపెడుతూ అంది—దీనికోసమే మీరు తపస్సు చేశేరా! అబద్ధం ఎందు కాడుతున్నారు. నా స్థానములో మరొక స్త్రీ ఉన్నట్లయితే ఆమెనుకూడా రక్షించి ఉండేవారు. నాకు ఈ విషయంలో విశ్వాసం వుంది. నేను మీతో నిజము చెపుతున్నాను. నేను జీవితాంతంవరకు బ్రహ్మచారిణిగా ఉండాలని ప్రమాణం చేసుకొన్నాను. కాని నా హృదయం మిమ్మల్ని కోరింది. నా జీవితం ఇప్పటిదాకా యుద్ధభూమిలోనే గడచింది. ఇపుడు ఎవరైతే ప్రాణాలుసయితం లెక్కచెయ్యలేదో అటువంటి పురుషసింహుని పాదాలదగ్గర నా హృదయాన్ని వుంచగలుగుతున్నాను. రసికుల హాసవిలాసాలు, తుంటరుల అందచందాలు, కపటమైన వీరుల శౌర్యాలు నాదృష్టిలో విలువ లేనివి. వాళ్ల నటన్ని కేవలం తమాషాలాగే చూచేదాన్ని. మీ హృదయంలోనే నిజమైన త్యాగం చూడగలుగుతున్నాను. ఈ రోజు నుంచే మీ దాసిని.

పెండ్లి మొదటిరోజు. నాలుగు మూలల్లోను సన్నాహాలు. కేవలం ప్రేమికుల ఇద్దరి హృదయాల్లోను ఆశాపూరితమునైన కోరికలు విహరిస్తున్నాయి. చంద్రుడు అనురాగమయమైన చంద్రికల్ని వెద జల్లుతున్నాడు. ఆ చంద్రకాంతిలో వధూవరులు ప్రేమ సల్లాపాలుపలుపుతున్నారు.

ఆక్షణంలోనే ఒక ఘోరవార్త. శత్రుసైన్యాలు కోటను సమీపిస్తున్నాయని తెలియవచ్చింది. చిన్త నిశ్చేష్టురాలైంది. రత్నసింహుడు నిలబడి ఒఱలోని కత్తి చప్పున పైకి లాగేడు.

చిన్త అతనికేసి ప్రేమ మయమైన దృష్టితో చూస్తో అంది.—కొంతమంది అనుచరులని అక్కడికి పంపండి మీకు వెళ్లవలసిన ఆవశ్యకత ఏముంది.

నాకు చాలా భయంగా వున్నది. వాళ్లు చాలామంది పెద్ద సైన్యంతో వచ్చియుంటారని అన్నాడు రత్నసింహుడు.

చిన్త—అయితే నేనూ వస్తాను. వద్దు నాకు విశ్వాసంవుంది-వాళ్లు నిలువలేరు. నేను వంటరిగా వారికి జవాబియ్యగలను. మన ప్రణయరాత్రి విజయరాత్రిగా మారుతుంది. ఇది యీశ్వరుని ఇచ్ఛ. అన్నాడు రత్నసింహుడు.

"మీరు వెళ్లవద్దు. నా మనస్సు చాలా భయపడుతోంది. మీరు వెళ్లడం నాకిష్టం లేదు!"

రత్నసింహుడు ఆ సరళమైన పలుకులు విని ఆశ్చర్యముతో చిన్తని తన కౌగిటిలోనికి తీసుకొని అన్నాడు—నేను తెల్లవారేసరికల్లా వచ్చేస్తా ప్రేయసీ!

చిన్త భర్త మెడలో రెండు చేతులు వేసి నీటితో బరువైన కళ్లతో అంది. నాకు భయంగా వుంది. మీరు చాలా రోజులవరకూ తిరిగి రారేమో నని. నామనస్సు మీతోనే వుంచుతాను వెళ్లండి. రోజూ కబురు పంపుతూ వుండాలి. అవసరాన్ని గుర్తించి సాహసించమని కోరుతున్నాను. మీ పరిపాటు శత్రువులు కనిపించే సరికల్లా ప్రాణాలు లెక్కచెయ్యకుండా వాళ్ల మీద పడడం. కాని నాకోర్కె ప్రకారంగా ఆలోచించి మరీ పని చెయ్యమని. వెళ్లండి ఎలాగ వెళుతున్నారో ఆలాగే రండి.—

చిన్త హృదయం చాలా వ్యాకులత చెందింది. ఎచ్చనైతే మొట్ట మొదట విజయలాలసత ఆధిపత్యాం వుంటుందో అచ్చటే తరువాత భోగలాలసత ఆధిపత్యత వుంటుంది. ఏ వీరబాల సింహాంలాగ గర్జించి శత్రువులను వడికించిందో ఆ వీరబాలయిప్డు దుర్బలత అయిపోయింది. కారణం ఏమిటి? ఎప్పుడైతే రత్నసింహుడు గుఱ్ఱంమీద సవారీ చేసి వెళ్లిపోయినాడో అప్పుడే ఆమె దేవుడికి మ్రొక్కుబడు లిస్తోంది.

రత్నసింహుడు వెళ్లిపోయేడు. ఆమె ఒంటరిగా ఉంటోంది. నాలుగు మూలలా శూన్యం. ఆమె మంచము మీద పండుకొని ముఖము మూసుకొని ఏడవడం మొదలు పెట్టింది.

రత్నసింహుని వెనుక చాలాతక్కువ సైన్యము ఉంది. అయినప్పటికి భయపడకుండా ప్రాణాన్ని లెక్కచెయ్యకుండా రత్నసింహుడు యుద్ధానికి బయలుదేరేడు. సైనికులు అశ్వాల మీద చక్కని పదం పాడుకుంటూ బయలుదేరి పోతున్నారు. పర్వత గుహాలువాళ్ల కంఠస్వరానికి ప్రతిధ్వనిస్తున్నాయి. గుఱ్ఱపు డెక్కలుచప్పుళ్లు మారుమ్రోగుతున్నాయి. రాత్రి గడచింది. సూర్యుడు తనఎఱ్ఱనైన కళ్లు తెరచి ఆకాశంమీద తనస్వర్ణచ్ఛాయని కురుపించడం మొదలుపెట్టేడు.

ఆ దగ్గిర ప్రదేశంలోనే శత్రువులు బస చేసేరు. రత్నసింహుడు తలపోపుకుంటూ వియోగభారంచేత బరువైన మనస్సుతో నెమ్మదిగా పోతున్నాడు. అందరికన్నా ముందే స్వారీ చేస్తున్నాడు కాని మనస్సుమాత్రం వెనక్కి పడిపోయింది. అతనికి జీవితంలో మొట్ట మొదటిసారి దుశ్శకునాలు కనుపిస్తున్నాయి. యుద్ధం యొక్క ఫలితం ఏమవుతుందో ఎవరు చెప్పగలరు? ఏ స్వర్ణముఖాన్నైతే అతడు వదలి వచ్చాడో ఆ ముఖముయొక్క స్మృతిచిహ్నాలు అతనిలో పాతుకుపోయి జ్ఞప్తికి వస్తున్నాయి.

చిన్త నీటిమయమైన కళ్లు అతనికి మరల మరల జ్ఞాపకానికి రావడం ప్రారంభించేయి. మనస్సు గుఱ్ఱాన్ని వెనక్కి తిప్పమంటోంది. ఆ సమయంలో ఒక సేనాపతి రత్నసింహుని సమీపించి అన్నాడు— సోదరుడా! అక్కడ చూడు పర్వతంమీద శత్రువులు డేరాలు వేసుకుని వున్నారు. ఇప్పుడు నీ ఉద్దేశ్యము ఏమిటి? ఇప్పుడు మా కోరిక ఏమిటంటే వాళ్ల మీద పడాలని, అలాగ ఆజ్ఞ యియ్యి. సైన్యము లేచి నుంచుంటుంది. ఆలస్యం చేసినట్లయితే కార్యం అడ్డం తిరుగుతుంది. ఒక్క వెయ్యిమందితో పని జరగదు.

రత్నసింహుడు చిన్తాపూరితమైన కళ్లతో శత్రుసైన్యాలున్న పర్వతానికేసిచూసి అన్నాడు.—అవును తెలుస్తోంది.

సిపాయి: అయితే ఆజ్ఞ ఇవ్వండి.

రత్నసింహుడు: మీ యిష్టం. శత్రుసైన్యాల సంఖ్య లెక్కకు మీరి వుంది.

సిపాయి: పరవాలేదు. ఇంత కంటే పెద్ద సైన్యాలతో యుద్ధము చేసేము.

రత్నసింహుడు: ఇది నిజం. కాని తెలిసి మంటలో దూకడం మంచిది కాదు.

సిపాయి: సోదరా! నువ్వేమిటి చెపుతున్నావు. సిపాయుల జీవితాలు మంటలో దూకడానికే. మీ ఆజ్ఞ యొక్క ఆలస్యం. చూడండి మా సాహసం.

(మరొక) సిపాయి: కాదన్నయ్యా, వాళ్లందరికేకనక మనం వచ్చిన సంగతి తెలిసినట్లైతే చాలా ప్రమాదం జరుగుతుంది.

రత్నసింహుడు: అయితే ఆజ్ఞ యిస్తా.

ఒక్క క్షణంలో సైనికులందరూ గుఱ్ఱాలు ఎక్కి యుద్ధానికి సిద్ధపడ్డారు. వారంతా ప్రయాణం చేసి పర్వతం ఆరోహించేసరికల్లా— అక్కడ శత్రుసైన్యాలేమీ కనుపించలేదు—అంతా శూన్యం. ఒక్కసారి శత్రుసైన్యాలు వాళ్లకేసిరావడం చూశేరు వాళ్ళంతా. అప్పుడు చెయ్యవలసింది అనుసరించవలసింది ఉపాయం ఏమీ తోచలేదు. సైనికుల దృష్టులన్నీ రత్నసింహుడికేసి తిరిగేయి.

ఏమిటి రత్నసింహుడు ఈవేళ తన ధైర్యసాహసాలు చూపడం లేదు. అక్కడ వున్న వాళ్లందరికన్నులూ రత్నసింహుణ్ణి వెతకడం ప్రారంభించేయి. కాని అతనిజాడ ఎక్కడా కనుపించలేదు. ఎక్కడికి వెళ్లేడో ఎవ్వరికీ తెలియదు.

కాని అతను ఎక్కడికీ వెళ్లలేదు. అతని అనుచరుల్ని అగమ్యగోచరమైన అవస్థలో వదలి ఎక్కడికి పోతాడు? ఎక్కడికీ వెళ్లడు. అసంభవము. అతను తప్పకుండా యిక్కడే వుండి విజయాన్నిగురించి ఆలోచిస్తూ వుంటాడు.

ఒక్కక్షణంలో శత్రుసైన్యాలు సమీపించి మీదపడ్డాయి. అంతులేని ఆ సైన్యప్రవాహం ముందు యీ కొద్ది సంఖ్య గల సైన్యం యేం చేయగలదు? నాలుగు మూలలనుంచి రత్నసింహునికై కేకలు. సోదరా! నువ్వు ఎక్కడ వున్నావు? మాకు ఏమి ఆజ్ఞ యిస్తావు? చూస్తున్నావా? శత్రు సైన్యాలు మన్ని సమీపిస్తున్నాయి. అయినప్పటికీ నీవు మాట్లాడక వూరకున్నావేమిటి? ముందు కొచ్చి మాకు మార్గం చూపించు. మాకు వుత్సాహాన్నియ్యి......!!! కాని అప్పుడుకూడా రత్నసింహుడు పైకి వచ్చి ఆ అమాయికులికి మార్గం చూపలేదు.

నాయకుడు లేని సైన్యం, రాజులేని రాజ్యం, భర్తలేని సంసారం వ్యర్థం.

అంతలో శత్రుసైన్యాలు నెత్తిమీద పడ్డాయి. ఇరుపక్షాలమధ్య కరవాలాలు జోరుగా పని చెయ్యడం ప్రారంభించేయి.

రత్నసింహుని సైన్యం చాలా ధైర్యముతో యుద్ధం సాగిస్తోంది. కాని ఆ చిన్న సైన్యం యేం చెయ్యగలదు? అది యుద్ధంలా తోచడం లేదు. ప్రాణాలతో శలగాటల్లా అగపడుతోంది.

"అదృష్టహీనులు"

(11-వ పేజీ తరువాయి)

బోతాడు. నలభైయేళ్ల పై బడిన మనిషిని తన్ను ఆయనభార్య 'ఏం వోయి సుబ్రహ్మణ్యం ఎగా బజార్లోంచి వచ్చేటప్పుడు నాలుగుకోట్లు చూసి వంకాయలన్నా తెచ్చిపెట్టక పోయావా, చన్తూంటే యింట్లో, మీ మానేజరుగారివల్ల ఒక్కపనీ కాదు ఎందుకూ పనికి రారులే-' అంటుంది. ఆయనకూతురు 'పంతులూ యిటు చూడు' అంటూ ఏదో పురమాయిస్తుంది.

'ఓయి భగవంతుడా! వీళ్ల నెత్తుటిలోనే యింత చలాయింపుతత్వం యిమిడివుందేమయ్యా' అనుకుని విస్తుపోతూంటాడు సుబ్రహ్మణ్యము.

కాని యీవాళ యీ తరహా ఆలోచనలతో మనస్సు పాడుచేసుకుని బాధపడుతున్నా 'పంచేంద్రియాలు' యంత్రప్రాయంగా తమపని తాము చేసుకుని పోతున్నై. ఎందరెందరో తన కాతాల్లో పెద్దపెద్ద మొత్తాల్ని జమకట్టారు. తన చేతుల్లో తను ఎన్నివేలో లెక్కబెట్టి చెక్కులన్నిటికీ 'పేమెంట్లు' చేస్తూ వచ్చాడు కూడితే జమలన్నీ టక్కునసరిపడ్డాయి. అటునైపుకర్చుల మొత్తంకూడా కూడితే 'యిక పని అయినట్లే-' అనుకుని యింతలో 'యీవాళ నెలాఖరుగదూ-ఏది జీతాలబిల్లు' అని జవాన్ని రివెన్యూ అణా బిళ్లల్ని అంటించమని చెప్పి పెద్దనోట్లను చిన్న నోట్లను - నూనిమరకలు పడ్డవాటిని కొద్దిగా చిరిగినవాటిని వేరుచెస్తూ. చిల్లర లెక్కపెట్టడంలో నిమగ్నుడైపోయాడు.

రోజూ యింతే. సరిగ్గా నిలవల్ని తేల్చేటప్పుడు గుండెలు పీచుపీచుమనేవి. ఈ వెధవ షరాబు వుద్యోగం యింతేగదా! దినదిన గండం వెయ్యేళ్లాయుస్సు. [అనుకుంటూ ఆఫీసుకి రాంగానే శ్రీరామ అరచేతిలో వ్రాసుకొండే యినప్పెట్టి తాళం చెవుల్ని ముట్టుకునే వాడు కాదు. ఆ శ్రీరామమూర్తికటాక్షవీక్షణపరంపర చేతనే యిటువంటి అఘాతాలు లేకుండా తనపని తాను చేసుకుంటూ నమ్మకస్తుడైన వ్యక్తనిపించుకున్నాడు కూడా.

నేడు ఆ శ్రీరామచంద్రమూర్తికూడా కాసంత శీతకన్ను వేశాడు. అంతా తారుమారయింది. ఎన్నిలెక్కలు సరిచూసినా ఎన్నిసందల మాట్లు కూడినా తక్కువొస్తున్నది రెండువేలు. తలమీద పిడుగు పడినట్లయింది. ఒకవేళ పిడుగు పడితేనన్నా 'అర్జున - ఫల్గుణ - పార్థ - శ్వేతవాహన - కిరీటి' అనొచ్చు. ఈ పిడుక్కు ఏ మంత్రంకూడా పారేట్టు లేదు.

అనుకున్నంత పనీ అయింది. గుండె ఝల్లుమంది సుబ్రహ్మణ్యానికి. ఎప్పుడు ఎవరికి ఎక్కువిచ్చాడో 'రెండువేలు' అంటే పదురూపాయల నోట్లకట్టలు రెండు తక్కువన్నమాట. సుబ్రహ్మణ్యం మొగాన కత్తిరవేటుకు నెత్తురుచుక్కలేదు ఆఖరికి మేనేజరుకూడా నానాతంటాలు పడి చూశాడు. నిజమే! రెండువేలు ఎక్కువ యివ్వటం ఎవరికో జరిగింది.

సుబ్రహ్మణ్యానికి మనస్సు మనస్సులో లేదు. బయట వానజల్లు. కొద్దిగా అప్పుడప్పుడూ యీదురుగాలి. మధ్య మధ్య వికారంగా పిట్టల అరుపులు. పెద్ద పెద్ద చెట్లమధ్యనుంచి ఓలాంగంగా రివటలుకొట్టే దెయ్యపుగాలి. సన్నివేశాన్ని అతిభీభత్సకరంగా చిత్రించి వేశాయి.

తెప్పరిల్లుకుంటూ - 'వెళ్లి మనం కొందరు కాతాదార్లవద్ద దర్యాప్తు చెయ్యాలి. దానివల్ల ఏమన్నా ఫలితముంటుందని తోస్తోంది నామట్టుకి. మీ రేమంటారు.'

మేనేజరు నవ్వుతున్నాడు అట్టహాసంగా - నవ్వు మధ్యలో ఆపి 'పిచ్చి మువ్వన్నట్లు వెళ్తామయ్యా - అసలు యింట్లోకాలు బయటపెట్టడానికే వానొకటిగా శివల్లే. జట్కా ఎవడు కట్తాడు యీ ముసురులో-'

సుబ్రహ్మణ్యానికి మనస్సులో నడచి పోవాలనే ఉంది. ఆ మాట పైకంటే అసలే అఘకారి అందులో కోతి, కల్లు త్రాగింది - ముల్లు గుచ్చుకుంది - నిప్పుకూడా తొక్కింది. ఎక్కడ కోపవివశుడవుతాడో అన్నభయంతో 'నేనే వెళ్లి జట్కా పిలుచుకొస్తాను - తెమిలి నట్టేనా మీరు.' ఇంకా వెకిలినవ్వు నవ్వుతూనే వున్నాడు. వున్నట్టుండి 'వెళ్లవయ్యా - వెళ్లి పిల్చుకురా-' అని మళ్లీ ఏమనుకున్నాడో ఏమో 'వుండు సుబ్రహ్మణ్యం-ను వెళ్లొరా పాపయ్యా,' అని మరొకడ్ని పంపాడు.

జట్కా వచ్చి నిల్చుంది. వాన తగ్గేట్టు లేదు. వాడు అయిదురూపాయలు కావాలన్నాడు. సుబ్రహ్మణ్యం ఏమాత్రం అడ్డు చెప్పలేదు. మేనేజరు 'యీ కర్చుకూడా నువ్వే భరించాలిసుమా!' అన్నట్లు చూశాడు.

'చిత్తం మహాప్రభో! నిండా మునిగినవాడికి చలేమిటి?', అంటూ మనస్సులో రెండువేలు నష్టంకాగా ఐదు ముష్టివెధవ రూపాయలు మన ప్రాణాని కడ్డుపడతాయా అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

నిలవలు తీసి కాతాలో రెండువేలు నష్టం చూపించి - వూరిమీద ఎవరెవరైతే పెద్ద మొత్తాలు పట్టుకెళ్లారో వాళ్లందరి గడపలు 'అమ్మా - బాబూ' అని బ్రతిమాలుకుంటూ తిరిగాడు సుబ్రహ్మణ్యం. లేకపోయింది ఫలితం. ఈ జట్కారుసుం కూడా జులుములా వదిలింది.

మేనేజరు కూడా సుబ్రహ్మణ్యానికి పట్టిన అవస్థకు జాలిపడుతూ చెప్పలేక 'రేపుసాయంత్రంలోగా మీ రీసొమ్ము భర్తీచెయ్యాల్సి వుంటుంది. జ్ఞప్తిలో వుంచుకోండి.' అని హెచ్చరించి జట్కా దిగి వెళ్ళిపోయాడు. మేనేజరు వెడుతూ అనుకున్నాడు 'ఎవరు చేసిన కర్మ వారనుభవింపక ఎవరికైనను తప్ప దన్నా' అని.

కొంతసేపటికి జట్కావాడు 'ఎక్కడ దింపమంటారు బాబూ, అని అడిగిన ప్రశ్నకు-సుబ్రహ్మణ్యం 'గంగలోకి-' అని మాత్ర మనగలిగాడు. జట్కావాడు ఏమాలోచించుకున్నాడో-ఐతే యిక్కడ దిగి పొండి బాబూ!' అంటూ పరీక్ష కోసం అగ్గిపుల్ల ముట్టించి బీడీ ముట్టించుకుని ఆ వెలుతుర్లో సుబ్రహ్మణ్యంముఖాన్ని పరీక్షగా చూసి గుర్తుపట్టి నిలేశాడు. మాట్లాడకుండా దిగి ఐదు రూపాయలు వాడిమొహాన పారేసి పెద్ద పెద్ద అంగలు వెయ్య నారంభించాడు. త్వరగా యింటిముఖం పడుతూన్నకొద్దీ హృదయం భారమై పోసాగింది. సందులన్నీ తిరిగి యింటి మలుపులో లాంతరు స్తంభం వెలుతుర్లోకి వచ్చేసరికి సుబ్రహ్మణ్యానికి వళ్లుకూడా స్వాధీనం తప్పిపోయింది.

ఇక వున్నట్లుండి లాంతరు స్తంభంనీడని యిసకలో కూర్చుండి పోయి బిగ్గరగా గొంతెత్తి ఏడువ నారంభించాడు. చీకటి - వాన యింకా కురుస్తూనే వున్నది. యించుమించుగా అర్ధరాత్రి సమయం. యీ నిర్భాగ్యుడి దుఃఖాన్ని వినడానికింకా ఎవరు మేలుకొనుంటారు? ఆ కొద్ది వెలుగులో పొంగి పొరలి వస్తూన్న దుఃఖానికి చెలియలికట్టను వేయలేక చిన్నపిల్లవాడేడ్చినట్లు గొంతెత్తి 'అమ్మా! అమ్మా!' అని ఆ స్తంభాన్ని కావలించుకుని మరీ వాపోసాగాడు. జల్లుజల్లుగా కురుస్తూన్న వాన ముసురేసుకు పోతున్నదనే ఉత్సాహంతో కప్పలు సంతోషంతో అరుస్తున్నాయి.

ఒకటి రెండు పందులు మోర లెత్తి చెవులు నిక్కించి వింటున్నాయి. రెండు కుక్కలు కాస్సేపు అరిగి దగ్గరకు వచ్చినిల్చునివిచిత్రంగా కళ్లు పెద్దవిచేసి కూర్చుని సావకాశంగా సుబ్రహ్మణ్యంయొక్క దుర్బలత్వాన్ని - నిస్సహాయతకు తమసంతు సానుభూతిని వ్యక్తపరుస్తున్నాయి.

సరిగ్గా అటువంటి లాంతరు స్తంభంనీడను ఒక జట్కావచ్చి ఆగిపోయింది.

'ఏందు కాపావు. పోనియ్యి..' లోపల్నుంచి ఎవరో జట్కావాడ్ని ప్రశ్నించారు. బండివాడు దిగి 'దారి కడ్డంగా ఎవరో మనిషి పడి ఏడుస్తున్నాడు? ఏం చేసేది-'

ఆ బండిలోని వ్యక్తికూడా నేల కురికాడు యీ నిర్భాగ్యుడ్ని పరీక్షించేందుకు. గుఱ్ఱంకూడా డెక్కల్ని చప్పుడు చేస్తూ తలను ఆడించి నిలబడి పోయింది.

ఆ మనిషి యీ అపరిచితవ్యక్తిని లేవనెత్తి ప్రశ్నించాడు 'ఏమయ్యా ఎవరు నువ్వు-యిట్లా యెందుకు పడిపోయావని?' సుబ్రహ్మణ్యం-కళ్లు తెరిచి పరీక్షిస్తున్నాడు ఎవరీ అపరిచితుడని. నల్లటి వుంగరాలజుట్టు-మనిషి వేషం కట్టు ఉత్తర హిందూస్థానీ వేషం. ఆ గుడ్డి దీపం వెలుగులో ఆకర్షణీయంగానే వున్నాడు. ఆ ఆజాను బాహువు జాలిపడుతూ- 'ఎవరు బాబూ మీరు? ఎక్కడికి - మీ యింటిదగ్గర దిగుదాం-' ఆ వ్యక్తి నిదానంగా సుబ్రహ్మణ్యం సమాధానం కోసం కనిపెట్టుకోకుండా బండిదగ్గరకు జట్కావాడి సాయంతో నడిపించుకు పోసాగాడు.

సుబ్రహ్మణ్యానికి తెలివి కలిగింది. 'ఎందుకు? యిదే మాయిల్లు - వెళ్లిపోతాను.' అంటూ వంకర తిరిగిన మెట్లకేసి చూపిస్తూ ఆ సన్నటి దీపపు వెలుగులో కృతజ్ఞతాపూర్వకంగా చేతు లెత్తి-'నమస్కారంనాయనా-' అంటూ ముందుకు మెల్లిగా పురోగమిస్తూ 'అమ్మాయీ!' అని తలుపుమీద మూడుసార్లు తట్టి, 'ఇక మీరు వెళ్లవచ్చు-' అంటూ మళ్లీ హెచ్చరిస్తూ వెనుదిరిగి చూశాడు.

ఆ మెట్లు చీకట్లోకి తీసుకు పోయే టట్లున్నాయి. ఆయింటి కప్పుద్వారాన్ని కూడా కటిక చీకట్లో ముంచివేసింది. వాన జల్లుకి తడిసిన గచ్చుమీద యిసక బర బర లాడుతోంది.

ఆ అపరిచితుడు సందేహిస్తూ అట్లానే నిల్చుండి పోయాడు. అతని పాదాలు కర్తవ్యాన్ని బోధించినా మనస్సు 'యింకా కాస్సేపు యిక్కడ ఆగుదా'మని సలహా యిస్తోంది.

సుబ్రహ్మణ్యం 'మీనాక్షీ! మీనాక్షీ!' అని యింకా బిగ్గరగా అరిచాడు. అతనట్లా వుచ్చరించిన నామాక్షరాలు అపరిచితుడి హృదయ కవాటాలమీదుగా మూసుకుని పోయినై.

ఆ తలుపు తెరుచుకుంది. క్రొత్తగా వుట్టిపడేన మాతృత్వశోభలో 'మీనాక్షి' అద్భుతంగా వుంది. ఆ అపరిచితుడు కూడా - పొల్చుకున్న వుత్సాహంతో, 'మీనాక్షి - మీనాక్షి' అని ముందుకు వంగి 'మావయ్యా-' అంటూ సుబ్రహ్మణ్యాన్ని రెండు చేతుల్తోనూ హృదయానికి హత్తుకున్నాడు.

మీనాక్షి చేతిలోని హరికెన్ దీపాన్ని టక్కున నేలకు వదిలేసి విస్తుబోయి చూస్తూ నిలబడింది.

వాడు రాఘవుడు.

అతడు సుబ్రహ్మణ్యము.

ఆమె మీనాక్షి.

నిజంగా కొన్ని సంవత్సరాల క్రితం ఏ రాఘవుడైతే అభిమానంకొద్దీ స్వజనాల్ని బంధుమిత్రాదుల్ని వదలి బొంబాయి చేరుకుని మార్వాడీలవద్ద గుమాస్తాగా కుదురుకున్నాడో ఆ రాఘవుడు తన స్వప్రయోజకత్వంవల్ల నైతే నేమి, అదృష్టంవల్ల నైతేనేమి వ్యవహారదక్షుడై క్రమక్రమంగా పైకి వచ్చి విదేశాలకుకూడా పోయి డబ్బు సంపాదించుకుని - అప్పుడు మేనమావ కూతుర్ని జ్ఞప్తికి తెచ్చుకుని వస్తే యింకా ఎక్కడి మేనమామ కూతురు?

రాఘవుడికి సర్వం అర్థమయింది. ఆ యింట్లో ఒక్కమాటు, తనంతటతాను తన స్థానాన్ని నిర్మూలించుకున్నాడు. ఇప్పుడు నిజంగా తనకాయింట్లో స్థానం లేదు. మీనాక్షి తన కెవరు? ఏమీ కాదు. తను బ్రతికి వున్నట్లు వ్రాసిన వుత్తరాలన్నీ అందినపాపాన పోలేదు.

మర్నాడు సాయంత్రం రాఘవుడు పోవాను బండి కెక్కుతూ 'రెండువేల రూపాయలకు' చెక్కు వ్రాసి మేనమామ కిస్తూ 'సెలవు మావయ్యా. మీనూ-' అని ఒగ్గబట్టుకున్న స్వరంతో 'నువ్వు కూడా నేను చచ్చిపోయానే అనుకున్నావా? ఎంత పని చేశావ్ మీనూ!' అంటూండగా,

రాఘవుడి కళ్లలోంచి ముత్యాలు తొంగి చూశాయి. మీనాక్షి కొడుకుచిట్టిచేతుల్ని పట్టుకుని దండం పెట్టించింది. రాఘవుడు త్రేతిగా చెయ్యి వూపాడు బండిలోంచి నవ్వు తెప్పించుకుంటూ.

సైన్యంలో నిరాశ అలముకుంది. నడిపించే నాయకుండే లేక సైన్యం అంతా చిందరవందరగా చెలిపోయింది. చివరికి ఫలితం ఏమవుతుందో అనే ఆలోచన ఎవరికీ లేదు. నాయకత్వం లేని సైనికులంతా ధైర్యంతో పోరి ప్రాణాల్ని కోల్పోతున్నారు. శత్రు సైన్యాలు వీరి వీరతకి చాల ఆశ్చర్యపోతున్నారు. కాని యిటువంటి యుద్ధాల్లో వచ్చేది పేరుకాని విజయం కాదు. ఒక ఘంటలో వేదికమీద తెర వేయబడింది. తమాషా పూర్తి అయింది.

చీకటి తెర-మృత్యుదేవత తాండవము-ఉన్న కొంత సైన్యం శత్రుజనాలకి కష్టాలని కలిగించింది. కాని నాయకునిజాడ లేదు. రత్నసింహుని కోసం ఆ పర్వతంమీద ప్రతి రాయి వెతకి చూచారు. కాని రత్నసింహుడు కనుపించలేదు. విజయం......అసంపూర్తి......! (సశేషం)

కాంగ్రెస్ పాలన

(9-వ పేజీ తరువాయి)

వాళ్ళచేత జరిగి వున్నట్లయితే ప్రభుత్వం ఈ సరికి అధికాహారోత్పత్తి ఉద్యమానికి స్వస్తి చెప్పి వుండేది.

దేశంలో ఏర్పడిన ఈ విపరీత పరిస్థితికి కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పద్ధతిగూడా కొంతవరకు కారణమని చెప్పాలి. ఈ మంత్రివర్గంలో రెండు వర్గాలవారు వున్నారు. ఒకరు కాంగ్రెస్ వర్గానికి సంబంధించినవారు. ప్రభుత్వ విధానాలను దిద్దితీర్చే శాఖలన్నీ వీరి చేతిలో వుంటాయి. రెండోవర్గంలో కాంగ్రెస్ వాదులు కానివారు వున్నారు. ప్రభుత్వాదాయంలో పెంపుదలచూసే శాఖలన్నీ వీరి నెత్తిన రుద్దారు. దేశం దివాళాతీసే స్థితిలోకి వచ్చిందనుకోండి, అప్పుడు ఆ తప్పంతా ఆర్థిక మంత్రి నెత్తినపడుతుంది. విదేశ వాణిజ్యంలో మనం ఇతరదేశాలకు బాకీ ఇవ్వలేలతామనుకోండి, ఆ తప్పంతా వాణిజ్య శాఖామంత్రి నెత్తిమీద పడుతుంది. దేశంలో పారిశ్రామికోత్పత్తి వెనకపడి వుందనుకోండి. పారిశ్రామికమంత్రి కర్మాన పారిశ్రామికమంత్రి పోతాడు. పోతే మౌలానా ఆజాద్‌ను, జగ్‌జీవనరాంను, గాడ్గిల్‌ను, జయరాం దాస్ దౌలత్ రాంను ప్రశ్నించేవారూ లేరు; విమర్శించేవారూ లేరు.

ప్రస్తుతం మనదేశ ప్రభుత్వాన్ని ఏలుబడి సాగిస్తున్నది రాజకీయాలని అనుకుంటే మీరు పొరబడినవాళ్లవుతున్నారు. మన ప్రభుత్వ వ్యవహారమంతా తెరవెనక వుండి నాటకం ఆడించడంగా వుంది. ఒక మంత్రి తెరవెనకవుండి ఒకత్రాడు ఇట్లా లాగితేచాలు, ఆయన ఏది అనుకుంటే అది జరిగిపోతుంది. దేశానికి కావలసింది, తినడానికి తిండి; కట్టుకోడానికి గుడ్డ; నివసించడానికి ఇల్లు. నాట్యాలతోను, లలితకళాప్రదర్శనాలతోను, సాంస్కృతిక సమావేశాలతోను ఆకలితో అలమటించిపోతున్నవారి కడుపునిండదు. ప్రజలకు సామ్యమైన ఆహారాన్ని చేకూర్చాలని అప్పుడప్పుడు వినపడుతూవుంటుంది. సామ్యమైన ఆర్థికవిధానం, సామ్యమైన అభివృద్ధి పథకాలు, సామ్యమైన ఆదాయ వ్యయ విషయకమైన అంచనాలు సరిగ్గా సంతరిస్తే చాలు స్వామ్యమైన ఆహారాన్ని సమకూర్చినదానికంటే దేశానికి ప్రజకు మేలు జరుగుతుంది.

ప్రస్తుత దేశపరిస్థితినిగూర్చి ఇంకో విషయాన్నికూడా చెప్పాలి. ఒకసారి మద్రాసులో మాట్లాడుతూ భారత ప్రధాని దేశాన్ని యుద్ధసమయంలోలాగా సన్నద్ధం చేయాలన్నారు. అన్నిపథకాలను వాయిదా వేయాలన్నారు. ఈ పద్ధతి రాష్ట్ర ప్రభుత్వాలకుగాని, కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులకుగాని రుచించలేదు. ఇప్పుడుగూడా భారత ప్రధాని మాటను వీరు చెవిని పట్టించుకోవడంలేదు. దూరదృష్టిగల రాజకీయవేత్త భవిష్యత్తును గూడా పారచూస్తాడు. పట్టి రాజకీయ

(21-వ పేజీ చూడుడు)

రెండేళ్ళ స్వరాజ్యం

శ్రీ కొవ్విడి లింగరాజు ఎమ్. ఎల్. ఏ.

ఈ ఆగస్టు 15 వ తేదీతో రెండేళ్ల పూర్ణ స్వరాజ్యాన్ని అనుభవించాము. ఏ స్వాతంత్ర్యంకోసం నూరు సంవత్సరాలుగా భారత ప్రజలు తపిస్తున్నారో ఆ స్వాతంత్ర్యమైతే ప్రత్యక్షమైంది. కాని సామాన్య మానవస్వభావాన్ననుసరించి భారత ప్రజానీకం ఊహించుకున్న స్వరాజ్య సౌఖ్యం మాత్రం ఎక్కడా గోచరించడంలేదు. స్వరాజ్యం కనుపడుతోంది కాని సురాజ్యం ఇంకా ప్రారంభం కాలేదనే నిస్పృహ ప్రజల్లో వ్యాపించింది. అదిగో స్వరాజ్యం అంటే రామరాజ్యం. సుఖపడతా మనుకున్నంత కాలం పట్టలేదు ప్రజల్లో ఈ నిస్పృహ వ్యాప్తి చెందడానికి—

స్వాతంత్ర్యోదయం కావడంతోనే ఈ దేశాన్నెదుర్కొన్న సమస్యలు బహు కష్టమయినవి. బహుశా చరిత్రలో ఇలాంటి సామ్యాలు బహు అరుదు. పోతూ పోతూ ఆంగ్లపాలకులు మనకు తగిలించవలసిన చిక్కులన్నీ తగిలించి పోయినారు. ముఖ్యంగా అన్నిటికన్న ప్రమాదకరమైన పని దేశాన్ని 500 ముక్కలుగా చీల్చడం. సాధారణంగా అధికారాన్ని ఛలాయించే తాహతు కలవారికి తమ శక్తి అనంతమనీ, శాశ్వతమనీ అనిపిస్తుంది. ఆ కారణంచేత కంటికి కనుబడే ఇబ్బందులన్నీ స్వల్పంగానే కనబడతాయి. భారతదేశవిభజన వల్ల కలిగే ప్రమాదాలను ఊహించి వాటికి తగిన నివారణోపాయాలను ముందుగానే మన నాయకులు కనుక్కోలేకపోవడానికి కారణ మిదే. కారణా లేమైతే నేమి, ఒక దేశంలోని లక్షలాదిజనం విపత్తులో పడి, ఆర్తులై మన దేశంమీద పడిపోయిన కారణంచేత మన ఆర్థిక నిర్మాణం తబ్దీలయిపోయింది. జీవితానికి అత్యంతావసరములైన కూడు గుడ్డల సమస్యతోపాటు లక్షలాది ప్రజలకు తలదాచుకునే స్థావరాన్ని చూపించవలసిన భారంకూడా ప్రభుత్వం మీదనే పడింది. ఎంతటి ప్రజాక్షేమాన్ని అభిలషించి పనిచేస్తున్న ప్రభుత్వమైనప్పటికి ఏ ఒక్క సమస్యనైనా జాగ్రత్తగా ఆలోచించి పరిష్కరించే విశ్రాంతి దొరకక కొట్టుమిట్టవుతోంది. స్వతంత్ర ప్రభుత్వం ఏర్పడిన కారణంచేత, దేశంలో ఉండే చిక్కులన్నీ ఒక్కసారిగా తీరపోతాయని ఆశించి ఆవురావురుమనే ప్రజలకు ప్రభుత్వం కష్టాలన్నీ అవగాహన కావడం సాధ్యంకాదు. అయినప్పటికీ చాలాకాలం ప్రజలు ఓర్పువహించారనే చెప్పాలి. సాధారణ జీవితావసరాలు కొఱతైనా కూడా అగ్రనాయకుల యెడల గల విశ్వాసంచేత, వాళ్లు పడుతుండే బాధలు కళ్లారచూస్తూ ఉండడంచేత చాలా కాలం ప్రజలు శాంతివహించారనే చెప్పాలి. సంస్థానాలను రద్దుచేసి నిరంకుశ ప్రభువులను ఉత్సవ విగ్రహాలుగా మార్చడం, కొరడుగట్టిన నిరంకుశ ప్రభుత్వమైన నైజామును లోబర్చుకోవడం మొదలైన రాజకీయ విజయాలకే ప్రజలు ఉప్పొంగిపోయి, నిత్య నైమిత్తికమైన పరిపాలనయొక్క సౌష్టవం ఎంత సన్నగిల్లినా భరిస్తున్నారు. గాంధీజీహత్యవలన ప్రభుత్వం యెడల ప్రజలకు సానుభూతి కూడా కలిగింది. కాని నేడు ప్రజలు తాలిమికి కూడా హద్దుదాటిపోయిన పరిస్థితు లేర్పడినాయి. అందుచేతనే అన్ని వర్గాలలోనూ నేడు అసంతృప్తి ప్రబలింది.

ఏడాదిక్రిందట ప్రజావిశ్వాసాన్ని బలాన్ని పొందగలిగిన ప్రభుత్వాలు—రాష్ట్రాలలోనూ, ఇంత శీఘ్రకాలంలో కేంద్రాలలోను అసంతృప్తిని కలిగించడానికి కారణాలను విచారించవలసిన సమయం వచ్చింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న పెద్ద నాయకులకు ఇటీవలవరకూ ఈ ఆలోచన పట్టలేదు. ప్రభుత్వ యంత్రంలో చిక్కుకోకుండా పైనుండి శ్రీరామరక్ష చెప్పగలిగిన గాంధీజీ అవతారంచాలించినాడు. అందుచేత 'పద్మపత్రమివాంభసా' అని నిష్కామ్యంగా దేశంయొక్క మంచిచెడ్డలను పోకడలను కనిపెట్టి సలహానిచ్చే అంగరక్షణ మన పరిపాలనకు లోపించింది. ఆ కారణంచేత ఇటీవల కాంగ్రెస్‌కు సంభవించిన అపజయాలే మనపాలిటి మేలుకొలుపులైనాయి. శరత్ బాబు విజయం కాంగ్రెస్ నాయకులకు రవ్వంత జాగృతి కలిగించింది. ఇంతవరకు మనకేమనే ధీమాతో నున్న నాయకులలో కొంచెం భవిష్యత్తును గూర్చిన జిజ్ఞాస కలగడం సంతోషించదగిన విషయం.

ఈ స్థితిగతులకు పూర్తిగా బాధ్యత వహించవలసినది కాంగ్రెస్ సంస్థ. రాజ్యాధికారాన్ని చేపట్టడానికి ముందు తమకా శక్తినిచ్చే పార్టీ నిర్మాణాన్ని భద్రపరచుకోవలసిన భారం కాంగ్రెస్ అగ్రనాయకులది. కాని నెహ్రూ, పటేల్, రాజేంద్రబాబు, అజాద్ మొదలైన యావన్మంది ప్రముఖులు ఈ అవసరాన్ని మరచి రాజ్యాంగ నిర్వహణంలో తనలొక్కని పార్టీసంస్థను గాలికొదిలినారు. పార్టీ నాయకత్వము రెండవ తరగతి నాయకుల చేతుల్లో వదిలేశారు. ఆ కారణంచేత ప్రభుత్వాలనే అదుపాజ్ఞలలో పెట్టియుంచవలసిన పార్టీ, బలహీనమైనది. ప్రభుత్వంలోనున్న ప్రముఖులను పార్టీ పేరిట సరిదిద్దదలచిన రాష్ట్రపతి కృపలానీ రాజీనామా నిచ్చి శెలవు పుచ్చుకున్నాడు. అప్పటికి అగ్రనాయకులు కొంత మేల్కొని రాజేంద్రబాబును రాజ్యాంగయంత్రములోనుంచి తప్పించి రాష్ట్రపతిత్వమున కెక్కించినారు. కాని అనారోగ్యకారణములచేత ఆయన ఆ భారమును నిర్వర్తింపలేకపోయినాడు. అందుచేత కాంగ్రెసు పార్టీలో శిక్షణ నిర్మాణశక్తి, నైతిక ఔన్నత్యము క్రమంగా క్షీణించినాయి. ఏ ఉత్సాహంతో, ఉన్నతాదర్శాలతో స్వరాజ్యపోరాటాన్ని కాంగ్రెసు సాగించిందో ఆ ఉత్సాహంతోనూ, ఆ ఆదర్శాలనూ స్వరాజ్యాన్ని సురాజ్యం చేసుకొనే ప్రయత్నం చేయలేకపోతోంది. గాంధీజీ జీవించియున్నంతకాలం, ఆచరణలోమానవస్వభావమైన స్ఖాలిత్యాలున్నా కాంగ్రెసు సంస్థయొక్క ఆదర్శాలు చలించలేదు. ఆయన అవతారం చాలించడంతోనే ఈ ఆదర్శాలను కాంగ్రెసు నాయకత్వమే ఏదో ఒకసాకుతో ఒక్కొకటిగా జారవిడిచింది. ముఖ్యంగా గాంధీజీ సూచించిన వికేంద్రీకరణ సిద్ధాంతమే మూలపడినది. ఇంతటితోనైనా ప్రజలలో వ్యాపించిన ఈ నిస్పృహ తప్పాలంటే, కాంగ్రెసు తేజోవంతం కావాలి. అగ్రనాయకులలో ముఖ్యులైన నెహ్రూ పటేల్ ఎవ్వరో ఒకరు రాజ్యాంగంనుంచి తప్పుకొని కాంగ్రెసు సంస్థకు ప్రత్యక్షంగా యాజమాన్యం వహించాలి. ఆర్థిక సిద్ధాంతాలపైని బహుజన ప్రయోజనకరమైన ప్రణాళికలను తయారుచేసి ప్రభుత్వాలచేత శీఘ్రంగా అమలుజరిపించే భారాన్ని వహించాలి. అనారోగ్యంగా ఉన్న కారణంచేత వల్లభాయి కూడ ఈ పనికి పూనుకొనలేక పోవచ్చును. నెహ్రూ శతవిధాల ఈ భారాన్ని వహించడానికర్హుడు. విదేశాలలో కాంగ్రెసు ప్రతిష్ఠను ఇనుమడింపచేయడానికి స్వదేశంలో ప్రజల విశ్వాసాన్ని పొందడానికి, ప్రజాక్షేమానికి కారణము కాగల కార్యక్రమాలను సమదృష్టితో యోచించి నిర్వహించడానికే ఆయనకు తగిన శక్తిసామర్థ్యాలు, ఉన్నతి, సావకాశం అన్నీ వున్నాయి. యావద్భారతదేశంలోనూ ఆయన కొక్కడికే అర్హతవున్నది. అల్లాగే రాష్ట్రాలలో కూడా కాంగ్రెసు సంస్థలు పునర్నిర్మాణం కావాలి. ఆపద్ధర్మంగా వచ్చిన క్రొత్త నాయకులు ప్రక్క కొత్తగిలి, నిజంగా ప్రజలంటే విశ్వాసం కలిగినట్టినీ, ప్రజలకు విశ్వాసం కలిగినట్టినీ, నాయకులు రాష్ట్రకాంగ్రెసు నిర్వాహకత్వమును వహించాలి. ఢిల్లీనుంచి అగ్రనాయకులు లోగడ తమ ఆగ్రహానుగ్రహాలను పురస్కరించుకొని సహజనాయకులను తొలగించి అవసరనాయకులను సృష్టించి కొంతవరకైనను ఈ దలభాకు బాధ్యులైనారు. ఇప్పుడైనా సంకోచములను వదలి ప్రజావిశ్వాసాన్ని చూరగొనే నాయకులకు రాష్ట్రకాంగ్రెసును ఒప్పగించి కాంగ్రెసు బలమును పెంపొందించాలి. సంకల్పం కలిగితే మార్గాలు కొరవకపోవు.

ఇక ప్రభుత్వపు సమాచారం చూద్దాం. ఆదిలో కేంద్రప్రభుత్వం బాధ్యతలేకుండానే ఏర్పడింది. కాని ప్రభుత్వబాధ్యత వహించినవారు దేశంకోసం అష్టకష్టాలపాలైనవారు, స్వాతంత్ర్య సంపాదనకు మూలమైన ప్రముఖులగుటచే అది ప్రజాప్రభుత్వమైనది. కాని సర్వపక్ష ప్రభుత్వంపేరిట, అన్ని పక్షాలవారిని సమీకరణంచేసింది కేంద్రప్రభుత్వం. కాంగ్రెస్ మూలసిద్ధాంతాలతో ఏకీభవింపజాలనట్టినీ, పెట్టుబడిదారులకు, పెత్తందారులకు ప్రతినిధులైన కొందరు కేంద్రంలో మంత్రులైనారు. 'పరిపాలనానుభవం' పేరిట వీరికి ప్రాముఖ్యతకూడా లభించింది. అందుచేత క్రమంగా రాజ్యాంగంలో వీరి పలుకుబడి వృద్ధియై, ప్రజాసామాన్యంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం రచించే ప్రణాళికల అమలుకు అడ్డంకులు ఏర్పడినాయి. విప్లవాత్మకమైన ఆకర్షణీయం కాగల ఆర్థిక మార్పులు అసంభవమైనాయి. కూడుగుడ్డల ఉత్పత్తి పంపకములలో ప్రజాక్షేమముకన్న పెత్తందారుల క్షేమమునకే ఆధిక్యత గణ్యతగలిగే స్థితిగతు లేర్పడినాయి. కూడుగుడ్డల కంట్రోలు విధానం అమలుజరిగే పద్ధతులలో ఈ చెహరా బాగా ప్రస్ఫుటమైంది. దీనికి తోడు పరిపాలనానుభవం పేరిట డిపార్టుమెంటు శెక్రటరీల ఆధిపత్యం హెచ్చయింది. ఈ 'ప్రవీణులు' విజ్ఞానవంతులు పరిపాలనాదక్షులు అనడానికేమీ సందేహంలేదు. కాని, వారికి ప్రజాదృష్టి ఇంకా అలవడలేదు. వారిదెంతసేపూ పైదృష్టి. స్వాతంత్ర్యంయొక్క ఫలసిద్ధి ప్రజలకందచేసే విధానం వారికింకా అవగాహనయ్యే విషయంకాదు. సామ్రాజ్యతత్త్వంమీద నిర్మింపబడినా పరిపాలనాయంత్రాన్ని నడిపించడంలో వారి అలవాటు సాటిలేనిది. ఆజ్ఞాపించడమే కాని అనుసరించడం ఎరుగరు. పరిపాలనా సాంప్రదాయాల్లో కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి కాని ప్రజలే పాలకులనే తత్త్వాన్ని జీర్ణించుకున్నవారు కారు. ఢిల్లీలో వార్తలు వింటుంటే ఈ పరిపాలనా నిపుణులదే పైచెయ్యి అని వినికిడి. వస్త్రాలు పైకీ క్రిందికీ తిరుగడమే కాని పరిపాలనలో చురు కేర్పడలేదు. రాజ్యాంగయంత్రంలో ఇరుక్కున్న కాంగ్రెస్ అగ్రనాయకులు పెద్దవయస్సుల్లో చిన్నపిల్లను పెండ్లాడిన పెద్దమనుష్యుల్లాగా డిపార్టుమెంటుల స్వాధీనంలోనుంచి బయటపడలేకుండా సంకటపడుతున్నారు. దశరథమహారాజుల్లాగ పెండ్లాముకొడుకుల మధ్య ప్రజలు పరిపాలనాయంత్రాలమధ్య కొట్టుమిట్టవుతున్నారు. విశాలమైనట్టినీ సాహసమైనట్టినీ ప్రణాళికలను అమలుజరిపి ప్రత్యక్షమైన ఫలితాలను చూపలేకున్నారు. ఇది ప్రజల అసంతృప్తికి తీవ్రమైన కారణం.

ఇక రాష్ట్రప్రభుత్వాల సంగతి చూద్దాం. రాష్ట్రప్రభుత్వాలు అత్యధికమైన కాంగ్రెస్ మెజారిటీలుగల ప్రభుత్వాలు. వ్యతిరేక పక్షములవారిమాట నూతిలో మాట. వ్యతిరేకపక్షమునకు కాంగ్రెస్ ప్రభుత్వచర్యలను విమర్శించి ఆపుచేయగలిగిన శక్తిలేని కారణంచేత ఈ ప్రభుత్వాలు మోటతోపున పోతున్నాయి. అసలీ ప్రభుత్వాల నిర్మాణానికి నిర్వహణానికీ బాధ్యత వహించవలసిన హైకమాండు, రాష్ట్రాలకు ఇదమిత్థం అని సూత్రప్రాయమైన ప్రణాళికల నివ్వకపోవడం పెద్ద కష్టమైనది. కొన్ని రాష్ట్రాలలో ప్రజావిశ్వాసం లేని మంత్రివర్గాలే ఏర్పడినాయి. ముఖ్యంగా బెంగాలు, మద్రాసు రాష్ట్రాలలో గ్రూపులు ఆదినుంచి ఉన్న కారణంచేతనూ, ఢిల్లీ సురలు తమ చిత్తవృత్తి ననుసరించి కొన్ని గ్రూపులకు తమ ఆసరా నిచ్చి జనసామాన్యాని కిష్టమైన నాయకత్వాన్ని పడగొట్టి, మనుష్యుని మహేంద్రజాలం చేయగలిగిన హస్తలాఘవంగల వారిని పెద్దలను చేయడంవల్ల, రాష్ట్రాలలో పరిపాలనయొక్క అంతస్తు హుందా క్షీణించినాయి. ప్రజలను ఆకర్షించి, వాళ్ల క్షేమాన్ని ప్రత్యక్షంగా చూపించవలసిన బాధ్యత ముఖ్యంగా రాష్ట్రప్రభుత్వాలది. కానిరెండు సంవత్సరాలుగా మన ప్రభుత్వాలు ప్రజలకు చూపిస్తున్నది అమలు జరగని కార్యక్రమాలు తప్ప మరేమీ లేవు. మద్యనిషేధ కార్యక్రమం నైతికంగానూ, కాంగ్రెస్ దృష్ట్యా గొప్పదేకాని ఈ సంస్కరణ పేరిట ప్రజలు చేయవలసిన త్యాగం చాలా ఎక్కువైపోయింది. ఈ మద్యనిషేధ కార్యక్రమమైనా జయప్రదంగా జరుగకపోవడం, అటుండగా, దీనివల్ల వచ్చే ఆదాయపు లోటును పూర్తిచేయడానికి ప్రజలమీదపడ్డ పన్నులనేకంగా ప్రత్యక్షంగా కనుపిస్తున్నాయి. ఏ కొత్త నిర్మాణము ప్రజలు కోరినా అది జరుగకపోవడానికి ఈ మద్యనిషేధకార్యక్రమమే కారణంగా చెప్పబడుచుండుటచేత మామూలుజనానికి అసంతృప్తి నిస్పృహ కలుగడంలో ఆశ్చర్య మేమీ లేదు. జమీందారీవిధానం రద్దంటూ కొంత దుమారంలేపి ప్రజల్లో ఆశలు కల్పించినాము కాని ఎవరికోసమైతే ఈ సంస్కరణలు తలపెట్టినామో వాళ్లకేమీ ప్రయోజనం కలుగడం లేదు. వెలుగు కనుపించడం లేదు. వాళ్ల స్థితి రొంపిలో స్తంభంలాగ అలాగే ఉంది. ఇక రాష్ట్రప్రభుత్వాలమీద అసంతృప్తి, అయిష్ట, ద్వేషంకూడా కలుగడానికి ముఖ్యకారణం కూడుగుడ్డల పంపిణీ. గాంధీజీ పట్టుబట్టి కంట్రోలును రద్దుచేసి ప్రజలచేత 'అమ్మయ్యా' అనిపించాడు. ఆయనచితిపైని సమాధి పూర్తి కాకుండానే కంట్రోల్సు మళ్ళీ ప్రత్యక్షమైనాయి. ఈ కంట్రోల్సు పేర జరిగే తంతువల్లనే పరిపాలనలో, ఆశ్రిత పక్షపాతం, అవినీతి ప్రవేశించి కాంగ్రెస్‌యొక్క ప్రతిష్ఠకు బదనామీ తెచ్చినాయి. గ్రామంనుంచి ఢిల్లీకేంద్రం వరకూ దీని విషాదగాథ వ్యాపించింది. లోకానికి విశేషం పరిచితుడు కాని కాంగ్రెస్ సేవకుడు మొదలు మహానాయకుడు వరకు ఈ అప్రతిష్ఠలో పాలొందుచున్నాడు.

గుడ్డలకంట్రోలు, ఆహారపదార్థాల కంట్రోలు, ఇండ్లకంట్రోలు, బండ్ల కంట్రోలు, బండ్ల పట్టాల కంట్రోలు, ఎరువుల కంట్రోలు రామరామ ఏకంట్రోలు లేని ఈకంట్రోళ్ళతో, ప్రజాప్రభుత్వం కంట్రోలు తప్పిపోయింది. కాలక్రమేణ జీవితావసరములను ప్రజలే సాధారణమైన వ్యాపారసంస్థలద్వారా కాని, సహకార సంస్థలద్వారాగాని సర్దుబాటు చేసుకొనే సావకాశం మృగ్యమై పోయింది. అను

(21-వ పేజీ చూడుడు)

స్వతంత్రభారతదేశమే ప్రపంచశాంతికి రక్ష

(7-వ పేజీ తరువాయి)

తలను నిగ్రహించగలిగేటట్టు చూడటం. ఇదంతా అలాగ్గా జరిగేపని కాదు.

ఇది ఇల్లా ఉండగా, బర్మాకు సహాయం చెయ్యవలసివచ్చింది. ఇండోనీషియా విముక్తికి సంప్రదింపులు జరపవలసివచ్చింది. దక్షిణాఫ్రికాలో భారతీయుల పౌరసత్వపు హక్కులకై పోటుపడవలసి వచ్చింది. జునఘడ్, కాశ్మీర్, హైదరాబాద్ సమస్యలను ఐక్యరాజ్యసమితి ముందు తేల్చవలసిన భారంతోపాటు ఈపనులన్నీ కూడా పై బరువులుగా తగిలాయి.

అన్నిటికన్నా కమ్యూనిస్టులతో మనం పడ్డపాట్లే, మహా చెడ్డపాట్లు. 1945 డిసెంబరు 16 న కమ్యూనిస్టులు అమాంతంగా, తమ పద్ధతులు మార్చేశారు. అంతకు ముందు దాకా, సమ్మెలు జరగరాదని బోధిస్తున్న వారల్లా, సమ్మెలు ఇకనుంచీ అధికంగా జరగాలని రహస్యపత్రాల్ని ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని తెలియగానే తత్వం ఇల్లా మారిపోయింది.

సమ్మెలు, అల్లరులు, దినచర్యలైపోయాయి. ప్రముఖంగా హైదరాబాద్‌లోనూ, బెంగాల్, ఆంధ్ర, కేరళదేశాలలోనూ, ఈ సమ్మెలు, అల్లరులు, ఎన్నడూ అనుకోనంతగా వేరు మోగసాగాయి.

అయితే 1948 ఏప్రిల్‌లో కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు ప్రపంచ మహాసభలో, కమ్యూనిస్టులు తమపద్ధతులను తీవ్రమొనర్చుకొని, ఉద్ధృతంగా చెలరేగాలని తీర్మానించుకొన్నాక స్వదేశంలో కమ్యూనిస్టులనుంచి ఏమి అపేక్షించవచ్చో, అందరికీ తెలిసే ఉండవలసింది.

మలయా, బర్మా, చైనా, ఇండోనీసియా, ఇండోచైనాలలో కమ్యూనిస్టు విప్లవాలు చెలరేగాక, భారతదేశం తన భవిష్యత్తును భద్రం చేసికోటానికి తీసికోవలసిన జాగ్రత్త ఇంతింత అనటందుకు వీలు లేదు. అల్లాంటిభయాలు కట్టి భ్రమలేనేమో అనుకొనేందుకైనా, వర్తమానస్థితు లేవీ దోహదంగా ఇయ్యడం లేదు.

ఈ రెండేళ్ళలో మనం సాధించిన సువిషయాలు

అయినా ఈ రెండు సంవత్సరాలలోనూ మంచికూడా చాలా జరిగింది. మనం చాలా విషయాలు సాధించగలిగాము.

మద్యపాననిషేధము దాదాపు స్థావరంగా ప్రవేశపెట్టుకొన్నట్లే మద్రాసు బీహారులలో జమీందారీల రద్దుకు చట్టాలు తయారయాయి. యునైటెడ్ ప్రావిన్సులో చట్టం తయారులో ఉంది.

గ్రామపునర్నిర్మాణం విషయంలో తీవ్రంగా శ్రద్ధ వహించాము. ప్రతిచోటా గ్రామపంచాయితీలు నిర్మించబడుతున్నాయి.

శాస్త్రవిద్యలలో కూడా చాలా పురోగమనంలో ఉన్నాము. టెక్నికల్ కళాశాలలు, సైన్సు, లేబరేటరీలు, పరిశోధనశాలలూ, మూలశాస్త్రాలలోనూ, ప్రయోగశాస్త్రాలలోనూ, కూడా ఎక్కువగా స్థాపించుకొన్నాము.

మలేరియాను నిర్మూలం చేసేందుకు తీవ్రంగా పూనుకొన్నాము. తిండి, ఆరోగ్యము ఈ రెండు సమస్యలు కూడా ఒకటిగా అల్లుకొనిపోతాయి. మంచి ఫలసారం కలిగి, ఏటా నూరూ, రెండువందల నలభై ఇంచుల వర్షానికి తగినదైనా, సుక్షేత్రమైనాయిన రెండుకోట్ల ఎకరపు పైగా ఉన్న పెక్కు సౌభాగ్యమైన భూభాగము మలేరియాకారణంగా సేద్యానికి రాకుండా వృధాగా పడి ఉంది. హిమాలయ పాదదేశంలోనూ, ఒరిస్సాలోనూ విస్తరించుకొని ఉన్నాయి ఈ భూభాగాలు. ఇక్కడ మలేరియాను నిర్మూలిస్తేతప్ప, ఈ భూమిని సేద్యానికి తేవటానికి వీలులేదు.

ఇల్లా ఉభయత్రంగా ఉన్న ఈ సమస్యను భారతప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కొంటోంది. పైదానికి మండలంలో ఏడాదికి తలకి రూపాయి అదనపుఖర్చుతో, మలేరియాను నిర్మూలించగలిగాము. ఈ పనికి పూనుకోవాలంటే, డాక్టర్లు, నర్సులు, మంత్రసానులు, ఈ వైద్యశాఖసంఖ్య పెరగాలి. ఉన్నవాళ్లు, నవీనపద్ధతులకు కావలసిన సంఖ్యలో, సగంమంది డాక్టర్లు, పదోవంతు నర్సులు నూరోవంతు మంత్రసానులూ, అయినా లేరు.

కామన్వెల్తు బాంధవ్యము

విదేశసమస్యలలో, అన్నిటికైనా గడ్డు సమస్యగా తయారైనది, కామన్వెల్తుతో స్వతంత్ర భారతదేశాన్ని ఎల్లా ముడిపెట్టటమా అనేది. రిపబ్లిక్‌గా ఇండియా ఉంటే, సహజంగా కామన్వెల్తునుంచి వేరుపడిపోవలసిందే.

నెలలతరబడి ఆలోచనలూ, సంప్రదింపులూ జరిగాక, ఇండియా కామన్వెల్తులో సభ్యదేశంగా ఉండవచ్చుననే నిర్ణయం జరిగింది.

ఈ సంధికాలంలో, ఇలాంటి ముడిపెట్టుకొని ఉండటం, ఒక గొప్ప అండగా ఉండగలదని భావించటమయింది. అభిమానాలు ఎటువున్నా ఇల్లా ముడిపెట్టుకోటంలో, అనేక నష్టాలు రాకుండా నివారణ అవుతాయనేమాత్రం తక్కువ విషయం కాదు.

రాజకీయ జోస్యాలు ఫలించటం సామాన్యంగా అరుదు కాని. మొన్న మొన్నటి భారత చరిత్రను కొస్త తిరగవేసి 1942, 14 జులైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తయారుచేసి, 1942 ఆగస్టు 7, 9 లలో కాంగ్రెసు మహాసభ ఆమోదించిన తీర్మానపాఠాన్ని చదువుకొంటే కాంగ్రెస్‌తీర్మానం, భవిష్యత్తును ఇంత స్ఫుటంగా ఎల్లా ప్రతిబింబించిందా అని ఆశ్చర్యపడక తప్పదు. ఆ తీర్మానంలో ఈ దిగువ వాక్యాలున్నాయి.

"కాంగ్రెస్, ఇండియాకు బ్రిటన్ అంటే ప్రస్తుతం ఉన్న విశ్వాసాన్ని సహృదయభావం క్రింద పరివర్తింపచేసి, ప్రపంచదేశాలకూ ప్రజలకు, స్వాతంత్ర్యం సమకూర్చిపెట్టటంలోనూ, తద్వ్యవసాయంలో కలిగే కష్టనష్టాలను పంచుకొంటూ, ఇండియా బ్రిటన్‌తో భాగస్వామిగా ఉండేందుకు ఉత్సాహపడేటట్లుగా చేయగలుగుతుంది. కాని భారతదేశం స్వతంత్రస్థితిలో భాసించగలిగిన నాడే ఇది సంభవమౌతుంది...

"బ్రిటిష్ పాలకత్వము ఇండియానుంచి తొలగిపోవాలని సూచించటంలో, ప్రస్తుత ప్రపంచ యుద్ధగతిలో బ్రిటిష్‌వారికీ మిత్రరాజ్యాలకూ అలజడి కల్గించి వారిని చికాకుపరచాలనే కోరిక కాంగ్రెసుకు ఎంతమాత్రమూ లేదు. ఇండియాపై శత్రువు దాడిచేసేందుకు ప్రోత్సహించాలని కానీ, చైనాపై జపాను లేక మరి ఏ యితర అక్షరాజ్యాలవారి ఒత్తిడిని వృద్ధిచేయాలని కానీ, ఎంతమాత్రమూ కాంగ్రెసు వాంఛించటం లేదు.

"బ్రిటిష్‌పాలన పైనొలగిపోవాలని సూచించినప్పుడు, ప్రతి బ్రిటిషు వ్యక్తి ఇండియానుంచి కదలి వెళ్లిపోవాలని ఎంతమాత్రమూ మా ఉద్దేశము కాదు. ముఖ్యంగా భారతదేశంపౌరులుగా, అందరితో సమానంగా, భారతదేశాన్ని తమ నివాసస్థానం చేసుకొని నివసించదలచుకొన్న బ్రిటిషువారి నెవ్వరినీ తరలి పొమ్మని చెప్పటం మా ఉద్దేశం కాదు.

"ఈ పైదొలగటం, సుహృద్భావంతో గనక జరిగితే, తత్ఫలితంగా భారతదేశంలో సుస్థిరమైన ప్రభుత్వం నెలకొనటం జరిగి ఈ ప్రభుత్వమూ మిత్రరాజ్యాల మధ్య సహకారం ఏర్పడి చైనాలో పరుల ఆక్రమణకు అడ్డుతగిలేందుకు కృషి ఇతోధికం కాగలదు" 1942 ఆగస్టు 7, 8 న బొంబాయిలో కాంగ్రెస్ ఎ. ఐ. సి. సి. సమావేశ తీర్మానంలో ఈ క్రింది వాక్యాలు అసాధారణమైన దూరదృష్టిని వ్యక్తపరుస్తున్నవి.

"భారతదేశస్వాతంత్ర్యము, విదేశపాలనంలో క్రుంగుతూన్న తక్కిన ఆసియాదేశాల స్వాతంత్ర్యాలకు, చిహ్నంగానూ, ప్రారంభోత్సవంగానూ ఉండాలి. బర్మా, మలయా, ఇండోచైనా, డచ్ ఈస్టుఇండీస్, ఇరాన్, ఇరాక్ అన్నీకూడా స్వాతంత్ర్యమందుకోవాలి. ఇప్పుడు ఈ దేశాలలో జపాను ఆధిపత్యంలో ఉన్న వాటిని విముక్తం చేసినప్పుడు, మళ్లీ ఏ యితర వలసరాజ్యాధిపత్యం క్రిందా వేటిని పెట్టేందుకు వీలు లేదని సుస్పష్టంగా అర్థంచేసికోవలసి ఉంటుంది.

తదనుగుణ్యంగానే, ఆగ్నేయ ఆసియా దేశాలను విజాతీయపాలనమునుంచి విముక్తం చేయటంలో, భారతదేశముకూడా తాను చేయి చేసుకోవలసి వచ్చింది. ఇండోనీసియాలో డచ్చివారి దురాక్రమణను ప్రతిఘటించేందుకు 22 దేశాల సమాఖ్యను భారతదేశంలో సమావేశపరచి, వారంవరి నైతికబలాన్ని సేకరించుకొని రావటం జరిగింది. కాబట్టి, ఈ విషయంలో కాంగ్రెస్‌కృషి ఈనాడు సంతృప్తికరంగా ఫలించిందంటే నిజంగా చాలా గర్వించదగ్గ విషయమే. బర్మా స్వాతంత్ర్యం సంపాదించింది. ఇండోనీషియా సంపూర్ణ స్వాతంత్ర్యంతో రిపబ్లికన్ ప్రభుత్వం స్థాపించుకోబోతున్నది.


ఈనాడు ప్రపంచదేశాలలో భారతదేశం ప్రతిష్ఠ, చాలా వృద్ధిలో ఉండటం సంతోషదాయకం. ప్రపంచశాంతిని నెలకొల్పి మానవసౌభ్రాతృత్వాన్ని నెలకొల్పేందుకు, భారతదేశం చేస్తున్న నవీనకృషివంక ప్రపంచమంతా సాపేక్షంగా తన దృష్టిని పరుపుతూంది.

ప్రపంచ పూర్వార్ధగోళంలోగానీ, ఉత్తరార్ధగోళంలోగానీ ప్రతి దేశంలోనూ ప్రజలు సంక్షోభాన్ని ప్రజాపీడనూ ప్రోద్బలించేసే పరిస్థితులలోనే బ్రతుకుతున్నారు. చెట్లమధ్యనున్నవాడు అడవిలో ఉన్నట్లు గుర్తించలేనట్లు, భారతదేశం పరిస్థితులను గుర్తింపలేకపోవచ్చును కాని పైదేశాలన్నీ ఈ దేశంలో జరుగుతున్న విషయాలను సుస్పష్టంగా పరికించగలుగుతున్నారు. ఈ ప్రాచ్యదేశం, ఏపురాణ ఆదర్శాలతో తన స్వాతంత్ర్యం సంపాదించగల్గిందో, ఇక్కడి ఆదర్శాలకు తక్కిన ప్రాక్ప్రతీచీ దేశాలలో సామ్రాజ్యతత్వ ఆదర్శాలకూ, ఉన్న భేదమేమిటో పైవాళ్లు పరికించుకోగల్గుతున్నారు.

మన అహింసా సత్యాగ్రహ సూత్రాల ఔన్నత్యాన్ని ప్రప్రథమంగా గ్రహించి వాటి మహత్వాన్ని ఎలుగెత్తి చాటినవారు అమెరికాలోని నీగ్రోనాయకులు. అమెరికన్ రిపబ్లిక్‌పై భారతదేశం తన ప్రభావం పరపగలదని వారు ఆకాంక్షిస్తున్నారు. నీగ్రోల పౌరసత్వం హక్కులు పరిమితం చేసేందుకు వాళ్లపై "పోల్ టాక్సు" అని పన్ను విధించారు. కాని ఆ "పన్ను"కు నిరసనం తెల్పుతూ తెల్లవారు కూడా "సత్యాగ్రహం"లో పాల్గొన్నారు.

పారిస్‌లో, ఐక్యరాజ్యసభామండలిలో, ఇంగ్లండు కామన్వెల్తు సమావేశాలలో, భారత ప్రధానమంత్రికి జరిగిన గౌరవమర్యాదలు, ఈనాడు ప్రపంచరాజ్యాలలో, భారతదేశం అంటే గల స్థానానికి ప్రత్యక్షతార్కాణాలు. రేపు అక్టోబరులో అమెరికాను కూడా ఆయన సందర్శించటంతో నిస్సందేహంగా ప్రపంచ మహాసభామంటపాలలో భారతదేశానికి గౌరవమర్యాదలు పరిపూర్తిగా లభిస్తాయి.

బానిసతనంలో ఉన్న భారతదేశం, ప్రపంచ యుద్ధాల ప్రేరేపణకు, ప్రముఖకారణము. స్వతంత్రభారతము ప్రపంచశాంతికే భద్రహస్తము. (కాపీరైటు)



దక్షిణ భారతంలోని 4 ఫ్రెంచి స్థావరాల భవిష్యత్తును గూర్చి చర్చించడానికి ఢిల్లీ వచ్చిన ఫ్రెంచి ఇండియా ప్రతినిధివర్గ నాయకుడు యమ్. గూబర్ట్ శ్రీ రాజాజీని గత శుక్రవారం కలుసుకొని మాటలాడుతున్నప్పటి దృశ్యం.

ఆసియా : చతుర్వర్గవ్యూహం 2.

పండిట్ నెహ్రూ విదేశాంగ విధానం

ఆండ్రూరాత్

ప్రపంచ రాజకీయాల్లో ఆసియాఖండం క్రమంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. ప్రాచ్యఖండ ప్రాధాన్యాన్ని మిగతా ప్రపంచం గుర్తిస్తున్నది. ఈ ప్రాంత రాజ్యాలన్నిటికీ సంఘటిత దేశ ఖ్యాతిగా నేగాక ప్రాచ్యప్రపంచ ప్రాచీన ప్రాభవాన్ని తిరిగి సాధించడానికి నిరంతరం కృషిచేస్తున్నారు. ప్రసిద్ధ అమెరికన్ రచయిత ఆండ్రూరాత్ ఈ ప్రాంతపు సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి పండిట్ నెహ్రూ అనుసరిస్తున్న వైదేశిక విధానాన్ని ఈ వ్యాసంలో సమగ్రంగా పరిశీలించాడు.

గత జనవరిలో పండిత నెహ్రూ ఇండోనీషియాకు సహాయం చెయ్యడంకోసం ఆశియా దేశాల నన్నింటినీ సమావేశపరిచారు. ఆసమయంలో ఆయన తనకు ఒక కూటమి ఏర్పరిచేఉద్దేశం ఏమాత్రం లేదని నొక్కి చెప్పారు.

కాని ఈదేశాల నన్నింటినీ సమావేశ పరచడంవల్లనే చాలాకాలంనించి ఊహాపథంలో ఉండిపోయిన ఆసియాలోని మితవాద జాతీయవాదుల కూటమికి నామకరణం చేసినట్టు అయింది. ఇండియా, పాకిస్తాన్, సిలోన్, బర్మా, సయామ్, ఇండోనీషియా, ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, ట్రాన్సుజోర్డన్ దేశాలు ఈ కూటమికిందికి రావచ్చును. బహుశః ఇజ్రేయిల్ కూడా ఇందులోకే రావచ్చును. ఇండియా పాకిస్థానులను, ఇజ్రేయిల్ ఆరబ్ రాజ్యాలను ఒకే కూటమిలో చేర్చాన డంచాలా ఆశ్చర్యకరంగా ఉండవచ్చును. కాని ప్రపంచంలో ఏ కూటమికి చెందిన రాజ్యాలకైనా లోలోపల అంతశ్శితాలు ఉండనేఉన్నాయి. ప్రపంచంలో అంతటా ఇంగ్లండు అమెరికాలకు వర్తకంలో పోటీలున్నాయి; కాని ఇంగ్లండు అమెరికాలు ఒకే రాజకీయ సైనిక కూటమిలో ఉన్నమాట ఎవరూ కాదనలేరు. సిద్ధాంతాలకు సంబంధించిన అనేకవిషయాలలో రష్యాకు, యుగోస్లావియాకు ఏమాత్రం పడడంలేదు. అయినాఐక్యరాజ్యసమితిలో అనేక ముఖ్యవిషయాలలో ఈ రెండు రాజ్యాలు ఎల్లాగో అల్లాగ కలిసే వోటు చేస్తున్నాయి.

ఈ రాజ్యాలన్నిటిలోను, వామపక్షాలు ప్రస్తుత రాజ్యవిధానం మార్చివేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ దేశాలన్నిటిలో కమ్యూనిస్టుపార్టీ మంచి కట్టుదిట్టంగా పనిచేస్తూ బ్రహ్మాండంగా తనపక్ష ప్రచారం సాగించుకుంటూంది. అయినా ఇంకా ముఖ్యమైన ఇతరపక్షాలుకూడా తీవ్రమైన సాంఘికార్థిక సంస్కరణలద్వారా తమ తమ రాజ్యాలలో ప్రస్తుతపరిస్థితులు మార్చివేయడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశంలో కమ్యూనిస్టుల విధ్వంసకచర్యలకు వచ్చినంత ప్రచారం ప్రతిరోజూ పెరిగిపోతూన్న సోషలిస్టుపార్టీ ప్రతిఘటనకు రాలేదు. సిలోనులో సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ట్రాట్స్కీయులు, ప్రభుత్వ ప్రతిఘటనపక్షంలో ఉన్నారు. సయాములో పూర్వం మార్షల్ పిబుల్‌కు సహకారిగా ఉన్న సంగ్రామ్ సైనిక ప్రభుత్వం మీద వచ్చిన తిరుగుబాటు కమ్యూనిస్టు విప్లవం అని మార్షల్ అధిక్షేపించాడు. ఈయనకు ఇంగ్లండు అమెరికాలు ఈదేశానికిచ్చిన ఆయుధాలు, పెట్టుబడి, సహాయము బూడిదపాలై పోతాయేమోనని భయము. కాని ఈ విప్లవంలో పాల్గొన్నవారిలో చాలామంది వైప్రిడీ సహచరులు-ఇతడు పూర్వం మిత్రమండలి పక్షం వహించిన రహస్య ప్రతిఘటన సంఘానికి నాయకుడుగా ఉండేవాడు. ఇతనికి నౌకాబలం తోడా

దుకూడా ఉండేది. వైడేరల్‌ను నూత్న ప్రధానమంత్రిని చెయ్యాలని ఈ విప్లవ పక్షంవారి ఆశయము. వైడేరల్ ప్రజాస్వామ్య సామ్యవాద పక్షానికి చెందినవాడు. ఇతడే పూర్వం ఆంగ్ల దేశంలో సయాము రాయబారిగా కూడా ఉండేవాడు. అయినా సయాములో ఒకచిన్న కమ్యూనిస్టుకూటమి ఈ విప్లవం ప్రోత్సహించిందనడంలో సందేహం ఏమీలేదు. ఈ దేశాలన్నిటిలోను ప్రభుత్వాలకు ఇంగ్లండు అమెరికాలతో సంబంధం ఉండడంవల్ల కమ్యూనిస్టులు ఈ ప్రభుత్వాలకు ఎసరుపెట్టేవారికందరికీ చేయూత ఇస్తూంటారు.

నెహ్రూవిధానం

స్థిరపడబోయే ఈమితవాద జాతీయ కూటమికి సిద్ధాంత దేశికుడైన పండిట్ నెహ్రూ ఎకూటమిలోనైనా భారతదేశం చేరడం తన కిష్టంలేదని ఉద్ఘాటించాడు. పండితనెహ్రూ ఇంగ్లండు అమెరికాలు, సోవియటు రష్యా భారతదేశం తమ పక్షంలో చేర్చుకోడానికి చేసే ప్రయత్నాలేవీ కొనసాగనివ్వడంలేదు. ఇందులో అతనిని జాయితీ ఏమాత్రము అనుమానించడానికి వీలులేదు. అయితే భారతదేశానికీ, ఇంగ్లండు అమెరికాలకు, మధ్యన విడగొట్టడానికి వీల్లేని ఆర్థిక రాజకీయ బంధాలెన్నో ఉన్నాయి. అందుచేత మిగిలిన ఆసియా మితవాద జాతీయ దేశాలలాగే భారతదేశంకూడా నిస్సందేహంగా ఇంగ్లండు అమెరికాల కూటమికి సంబంధించినదనే అనాలి.

భారతదేశ ద్రవ్యమానానికీ, ఆంగ్ల ద్రవ్యమానానికీ దగ్గర సంబంధంఉంది. దీనికి ఇంగ్లండు ఇండియాకు ఎంతో ఋణపడి ఉండమే కారణము; అదేగాక భారతదేశం కామన్వెల్తు వాణిజ్యసుంకాల విధానం తనకు ఉపయోగపడుతుందనీ భావిస్తూంది; అదేగాక భారత దేశంలో ఉన్న పెద్దపెద్ద వాణిజ్య సంస్థలన్నీ బ్రిటనులోని పారిశ్రామిక సంస్థల కూటాలతో ఒడంబడికలు చేసుకొని ఉన్నాయి. ఇందుచేత భారతదేశానికీ, ఆంగ్ల దేశానికి గట్టి ఆర్థికసంబంధం ఎర్పడింది. ఈపైవి భారత దేశం కామన్వెల్తులో ఉండిపోవడంలో చాలాముఖ్యమైన కారణాలు. బర్మా మొదట కామన్వెల్తులో నుంచి విడిపోయినా ఇప్పుడుదానికీ కామన్వెల్తుకీ కొంత సంబంధం మళ్ళీ ఏర్పడింది. బర్మా వ్యాపార సరళిఅంతా కామన్వెల్తురాజ్యాలలో జరుగుతూండడమేదీనికి ప్రధాన కారణము. అల్లాగే ఇరాను, ఇరాక్ దేశాలకు, ఆంగ్ల దేశానికీ నూనెగనుల విషయంలో దగ్గిర సంబంధం ఉంది.

ఇలాగే ఎంతోడబ్బు అప్పు పెట్టడం వల్ల ట్రాన్సుజోర్డన్ కూడా బ్రిటను చెప్పుచేతుల్లోనే ఉంటుంది.

బర్మా సయాముదేశాలు స్వతంత్రములైనా, ఇవికూడా దక్షిణాసియా రాజ్యాలతో కలిసి వాస్తవికంగానో, సంధి మూలకంగానో ఆంగ్ల సైనిక రక్షణ కూటంలో



చేరాయి. ఈ దేశాల్లో చాలా వాటి సైన్యాల కన్నిటికీ బ్రిటిషువారు తరిఫీదు ఇవ్వడమో, సైనికాధికారులను పంపించడమో జరిగింది. యుద్ధంవస్తే ఆంగ్ల సైన్యాలకు ఈ దేశాలలో కొన్ని ప్రత్యేకమైన హక్కులున్నాయి.

దక్షిణాసియాలో అమెరికా ప్రభావం

అమెరికా దక్షిణాసియాలో ప్రత్యేకంగా బ్రిటిషువారి యాజమాన్యానికి అంగీకరించినా, యుద్ధానంతరం ఈ ప్రదేశంలో అమెరికాప్రభావం క్రమక్రమంగా ఎక్కువవుతూంది. అమెరికా పెట్రోలు వర్తకులకు అరేబియా పెట్రోలు గనులలో చాలా పెద్దభాగాలున్నాయి. యుద్ధం అయిన తరువాత అమెరికా వస్తువులు ఈ దేశాల్లోకి బాగా ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ఆర్థిక ప్రభావం వల్ల ఒక కాలంలో ఇంగ్లండుకు, సయాముకు, మధ్యనున్న ఆర్థికబంధనాలు సడలిపోతున్నాయి. ఇండియా, పాకిస్థాను మొదలైనదేశాలు వీలైనంత సహాయం ఇంగ్లండు వల్ల సంపాదించినా ఇంక అప్పులు, అర్థికాభివృద్ధి మొదలైన విషయాల్లో అమెరికా తోడ్పాటు కోసం ఎదురు చూస్తున్నాయి. ఇంక ఈ ప్రదేశంలో ఇస్రాయల్, సౌది అరేబియా, ఇరాన్, టర్కీ దేశాలు ఆర్థిక వ్యవహారాలలో ఇంతకు పూర్వం నుంచీ బాగా అమెరికా మీద ఆధారపడిఉన్నాయి; ఇల్లా ఉన్నా ఈ దేశాలు తమకు బ్రిటనుకు పూర్వం నుంచీ ఉన్న ఆర్థిక సంబంధాలు చెడగొట్టుకో లేదు.

ఇంగ్లండుకు, అమెరికా ఆర్థిక వ్యవహారాల్లో పోటీఉంది. ఆసియా మితవాద జాతీయదేశాలకు ఈ పోటీ తమకు అనువుగా ఉపయోగించుకోడానికి ఎక్కువ అవకాశం వుంది. కేవలం అమెరికా మీద ఆధారపడిన ఆక్రమిత జపాను, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్సు, కూమింటాంగు చైనాలకు పై దేశాలకున్నంత అవకాశం లేదు. మొత్తంమీద మితవాద జాతీయ దేశాలకు ఈ విషయంలో అమెరికా మీద ఆధారపడిన దేశాలకంటె ఎక్కువ స్థిరత్వం వచ్చింది: ఇంతేగాక ఈ మితవాద జాతీయ దేశాలు ఇంగ్లండు అమెరికాల మధ్యస్పర్థలు కలిగించి వాటివల్ల తాము లాభం పొందుతున్నాయి. ఇండోనీషియాలో కూడా స్వబ్లికనులు హాలండుకూ అమెరికాకూ రిపర్థలు పెంచి తాము లాభం పొందాలని చూస్తున్నారు.

ఈ దేశాలలో ఇలాగ ఆంగ్లేయులకు, అమెరికావారికి పోటీలు పెంచి తాము లాభం పొందాలని చూస్తున్నా వీరిలో ఆంగ్లో మెరికాలకువ్యతిరేకంగా సోవియటు రష్యను ఆహ్వానించే వారెవరూ లేరు. అయితే వీరు తాము కమ్యూనిస్టులకు వ్యతిరేకులమని చెప్పి, అమెరికావల్ల ఆర్థిక సైనిక సహాయాలు పొందాలనే చూస్తున్నారు.

ఇండోనీషియాసభ ప్రాధాన్యం

గత జనవరిలో న్యూఢిల్లీలో సమావేశపరిచిన ఇండోనీషియా సమావేశంతోనే, సామ్రాజ్య దేశాలకు, మితవాద జాతీయ దేశాలకు ఉండే సంబంధాలలో అతిముఖ్యమైన మార్పువచ్చింది. ఇంగ్లండు అమెరికాలు ఈ సమావేశంమీద ఎంతో ఆసక్తి కనబరిచాయి. పండిత నెహ్రూ ఒక ప్రధానోద్దేశంతో ఈ సమావేశం జరిపించారు. ఇంగ్లండు అమెరికాలు దక్షిణాసియా కమ్యూనిస్టు వ్యతిరేక కూటమి ప్రారంభానికి ఇది నాంది కాగలదని ఆశించారు. అందుకనే ఇంగ్లండు అమెరికాలలోని పెద్దపెద్ద రాజకీయజ్ఞులంతా భారత దేశంవైపు కళ్ళప్పగించి చూసి, పండిత నెహ్రూను భట్రాజుల్లా స్తోత్రం చేశారు.

ఇంకొక కారణంకూడా ఉంది. డచ్చివారు ఛిన్నాభిన్నమయిన ఇండోనీషియా మీద దండెత్తడంవల్ల జాతీయవాదానికీ, సామ్రాజ్యవాదానికీ ముఖ్య వైరుధ్యం ప్రపంచానికంతా బట్టబయలంది. డచ్చివారు, ఫ్రెంచివారు ఇండో-చైనాలో చాలాకాలంనుంచి చేస్తూన్న క్రౌర్యాలకంటె పెద్ద దారుణా లేమీ చెయ్యలేదు. కాని ఇండో-చైనా వ్యవహారాలు వార్తాప్రపంచంలోకిగాని ఐక్యరాజ్య సమితిలోకిగాని రాలేదు. ఇండోనీషియాకు ఐక్యరాజ్య సమితిలో అవకాశం దొరకడమే కాకుండా, పాకిస్థాను అరబ్ రాజ్యాలు కూడా దానికి అనురాగానుంచున్నాయి. ఇండోనీషియా మహమ్మదీయరాజ్యం కావడమే దీనికి కారణము.

ఆంగ్ల రాజనీతిజ్ఞులు మొట్టమొదట భారత దేశం బ్రహ్మాండంగా సామ్రాజ్య వ్యతిరేకధ్వజం ఎత్తుతుందేమో నని భయపడ్డారు. కాని జనవరి 8వ తేదీని ఇండియా హైకమీషనరు కృష్ణమీనను బెవిన్‌తో మాట్లాడుతూ "భారత దేశం, ఇంగ్లండు ఇండోనీషియావిషయంలో ఇంకా సానుభూతి చూపించగలదనిఆశిస్తున్నది.

(22-వ పేజీ చూడుడు)

విద్యావ్యాప్తికార్యక్రమాల్లో ప్రజలబాధ్యత

ప్రతిగ్రామంలో పాఠశాలలకు పదేసి ఎకరాలివ్వాలి

మద్రాసు విద్యాశాఖమంత్రి శ్రీ కె. మాధవమీనన్

విద్యావిషయాలలో స్థిరాభిప్రాయాలతో పని కుపక్రమించడం నిష్ప్రయోజనమని నేను విద్యాశాఖామంత్రిగా ఉన్న కొద్ది వారాల్లోనే నాకు తెలియవచ్చింది. విద్యా వ్యవహారవిధానాన్ని నిర్ణయించడంలో చాలా కష్టాలున్నాయి. అనుభవం మీదగాని నిర్ణయం సాధ్యం కాదు. తొందరపడి పొరపాట్లు చేస్తే అవి లక్షలాది బిడ్డలకి అపకారం కలగవచ్చును. తరతరాలనూ పట్టి పీడించవచ్చును. ఇందులో మనం చేసే నిర్ణయాలలో పొరపాటేవో కానివేవో తెలుసుకోవడం కూడా కష్టం. తేడాలు సూక్ష్మమైనవి. నా అకార్యాలవల్లగాని నాలో జీర్ణించిపోయిన సంస్కారద్వేషఫలితంగాగాని ఎటువంటిఅపకారం చెయ్యవలసివస్తుందోనని నాకు భీతి. అందువల్లనే నిర్ధారణగా ఇది నా విధానం అని తెగించి చెప్పలేను.

నా వ్యక్తిగతదోషాలు నా కార్యకలాపాల్ని కళంకితం చెయ్యకుండా కాపాడుకోడానికిగాను అన్నితరహాల వ్యక్తులతోను సన్నిహితమైత్రి ఏర్పరచుకుని అనుభవం గడించుకోవాలని యత్నిస్తున్నాను. కాని నేనెవర్ని కలుసుకుంటే వారు విద్యనుగురించి ధీమాతో ఇతరులకు బోధించగలమనే తలపులో ఉన్నట్లు కనిపించడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. నేను సంచారం చేస్తున్నప్పుడు కొందరు నన్ను ప్రోత్సాహపరుస్తున్నట్లు "ఏమి భయం లేదులే, ఈపత్రంలో సూత్రాలు అనుసరిస్తే చాలు" అని నాకు నేనేంచేయాలో జాబితాలు వ్రాసి ఇచ్చారు కూడా. సహృదయంతో ఇచ్చే సలహాల్ని విమర్శల్ని నేను స్వీకరిస్తాను. కాని ముందు చెప్పినట్లు నా జాగ్రత్తలోనే నుంటాను. అనుభవంకోసం ప్రయోగాలు చేసి కల్లోలం తెచ్చిపెట్టను.

అసలు విద్యకు లక్ష్యాలేవో, ఆశయాలేవో, నిరూపించడంలో ఇంకా నిపుణులలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. ఏ దేశంలోనూ సక్రమం సమగ్రంఅయిన విద్యాబోధనవిధానాన్ని ఎవరూ నిర్ణయించనేలేదు. నా కొద్దివారాల విద్యాశాఖ మంత్రిత్వ అనుభవంతో నేను కూడా నిర్ణయించపూనుకోవడం ప్రగల్భమే కాగలదు. అయితే ఒకటి రెండు మూలసిద్ధాంతాల్ని గురించి నా స్థిరాభిప్రాయాల్ని ప్రకటిస్తే ఎవరికీ ఆక్షేపణ ఉండదనుకుంటాను. విద్య అంటే గతానుభవాన్నిబట్టి బుద్ధిని వికసింప చేసుకోవడానికి వ్యక్తులు చేసే కృషి అని నా అభిప్రాయం. అజ్ఞానంలోనూ, నిస్సహాయస్థితిలో పుట్టిన మానవులకు ఆనుభవం, గ్రహణశక్తి ఉన్నందువల్ల వారు బుద్ధిని వికసింప చేసుకోగలుగుతున్నారు. ఈ మూలధనాన్ని పెంపొందించుకోడానికి మానవుడు యత్నించడం సహజం. స్వానుభవాలనేగాక పరుల అనుభవాలను బట్టి కూడా లోకజ్ఞానం పొందడం సహజమే. మానవుడు చేసే ఈ కృషినే విద్య అనడం ఉచితమని నా అభిప్రాయం.

పామరుల దృష్టిలో విద్య అనేది నిపుణకార్యంగానూ, కష్టార్జితమయే కళగానూ కనిపిస్తుంది. అందువల్ల విద్యాబోధనకు కొన్ని సూత్రాలను నిర్ధారణ చెయ్యడం అవసరమౌతోంది. మానవుల గతానుభవంయొక్క సారాంశం గ్రంథాలలో లభ్యమౌతుంది. అందువల్ల విద్యాబోధనలో గ్రంథపఠనం ప్రధానాంగం. విద్యకు ఫలితాల్ని గమనించాలంటే, విద్యావంతులు తమ జీవితంలో తమ వాతావరణంలో సమస్యల నేరీతిగా పరిష్కరిస్తున్నారో చూడాలి. వాతావరణం అంటే ముఖ్యంగా సంఘజీవనం. అందువల్ల విద్యలో సంఘ విషయాలు ప్రధానం. దీన్నిబట్టి విద్యావంతుడు అంటే "సమాచారాలు, లోకజ్ఞానం తెలిసిన పెద్దమనిషి" అని పచ్చెకోవాలి. విద్యాపరిపాలన విధానాలకు, విద్యాబోధన పద్ధతులకు ఇదే గీటురాయి.

సర్వేసర్వత్ర ఈ పరిశీలన జరగాలని కాదు. కాని ఇదే ముఖ్య విషయం. దీన్నిబట్టి వ్యక్తిగత వ్యత్యాసాలు, దేశకాల పాత్రాలకూ అన్నిటికీ అనుకూలమైన విద్యావిధానం ఫలానిరీతిగా ఉండాలని ఖండితంగా చెప్పడం అసాధ్యమని తెలుస్తోంది. వివిధవిధానాలు తాత్కాలికంగా మార్గదర్శకం కాగలవు. వ్యక్తులు స్వయం ప్రతిభనుబట్టి ఆ మార్గాల ననుసరించి పురోవృద్ధి పొందుతారు. ఈ పరిస్థితుల్నిబట్టి ఒకరి మార్గాని కవరోధం కలిగించకుండా ఉంటే చాలు దారి చూపినంత ఫల మని నాకు తోస్తోంది.

విద్యాబోధన క్రమాల ఆచరణలో తక్షణ సమస్యల్ని కొన్నిటినిమాత్రం సూచించాలని ఇక్కడ నా ఉద్దేశం. మొట్టమొదటి సమస్య ధనం. ఏది చెయ్యాలన్నా, ఏకాస్త ప్రయోజనం కలిగించాలన్నా ధనం కావాలి. కాని ఆదాయం పైకి ఎంత ఉబ్బి, పెద్దగా కనపడినా విలువ తక్కువ. ఖర్చులకి తూగడం లేదు. ఆదాయం తగ్గిపోయే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని చూస్తేనే సగం ఉత్సాహం నీరైపోతోంది. కాని నిరాశనీ నిరుత్సాహాన్నీ ఎదిరించి నిలవాలి. విద్యాబోధనకు సంబంధించినంతవరకూ పరిపూర్ణ విజయసాధనలనే ఆశ మొదటే లేదు కాబట్టి నాకు ఆశాభంగం కలుగుతుందనే భయం లేదు. సాధించేది కొద్దిఅయినా అదేచాలు ఉత్సాహం కలిగించడానికీ, ఉన్నదానితో తృప్తిపడ్డానికీ.

పాఠశాలాభవనాల నిర్మాణం విషయంలోనూ భౌతిక విజ్ఞానశాస్త్ర పరికరాల ఏర్పాటు, ఆటమైదానాల ఏర్పాటు, ఉపాధ్యాయుల వేతనాలు మొదలైన విషయాలలో చెయ్యవలసింది. చాలా మిగిలిపోయింది. శక్తికొద్దీ నేను చెయ్యదగినంతా చేస్తాను.

అన్నితరహాలలోనూ ఉపాధ్యాయుల సంఖ్య కూడా చాలడం లేదు. ఉన్న విద్యాలయాలకే చాలరు. ఇంకా స్థాపించదలుచుకున్న విద్యాలయాలకీ, స్థాపించవలసిన విద్యాలయాలకు ఉపాధ్యాయుల్ని వెదుక్కోవాలి. దీనికి చాలాధనం కావాలి. ఉన్న ధనంతో చెయ్యదగినది ఇంకా ఉంది కాబట్టి, తగు కార్యక్రమాలు నిర్ణయమవుతున్నాయి. త్వరలోనే కొంతపని జరుగుతుందని ఆశించవచ్చును.

కొన్నికొన్ని అవసరాలున్నాయి. వీనికి చాలా ఖర్చు అవుతుంది. మానుకోలేం. వీనిలో లక్షలాది బిడ్డలకు ప్రాథమికవిద్యాబోధన ఏర్పాటుచెయ్యడం ఒకటి. ఈ దేశంలో పుట్టిన ప్రతిబిడ్డకీ ఏదో కొంత విద్య పొందవలసిన హక్కు ఉందనీ, అది ఇచ్చే కర్తవ్యం ప్రభుత్వంపైన ఉందనీ అంగీకరించితీరాలి. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఎలిమెంటరీస్కూళ్లన్నిటినీ బేసిక్‌స్కూళ్ళుగా మార్చగలరని ప్రభుత్వం మాట ఇచ్చింది. ఇటువంటి మార్పు మంచిది గాదని చాలా విమర్శలు వచ్చాయి. కాని మన దేశంలో బిడ్డలకి విద్యాబోధనకి అదొక్కటే అనుకూలమైనదీ ప్రయోజనకరమైనదీ నని నాకు నమ్మకం కలిగింది. పరిస్థితిని అవగాహన చేసుకోకపోవడంవల్ల ఈ విమర్శలు వస్తున్నాయని నా అభిప్రాయం. బేసిక్‌విద్యావిధానంఅంటే యంత్రాలవలె కొన్ని విషయాలలో విద్యార్థులకు శిక్షణ నిచ్చి అందరినీ ఒక్క మచ్చుని తయారుచెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లు అపోహపడుతున్నారు. కాని అది వాస్తవం కాదు. ఈ విధానంవల్ల బిడ్డల స్వకీయబుద్ధివికాసానికి అధికావకాశం లభిస్తుంది. బిడ్డల మనఃప్రవృత్తి అన్ని విద్యావిధానాల్లోనూ ప్రధానాంశం. మిగతావి తరువాతనే. వారి వ్యక్తిగత ప్రజ్ఞలవృద్ధికోసమే ఈ విధానం నిర్ణయించబడింది. సర్వస్థితులకూ అనుకూలమైన ఆచరణయోగ్యమైన విధానమిది. మన కిప్పుడున్న చిక్కులన్నీ పరివర్తనకాలంలో ప్రతిదానికీ సంభవించేవే. ఈ పరివర్తనకాలంలో ఉపాధ్యాయులకు కూడా కొత్తగా శిక్షణ నివ్వాలి. ఈ చిక్కులన్నీ



త్వరలోనే తొలగిపోతాయి. ఆ తరవాతనే ఏ విధానంకాని మంచిదో చెడ్డదో నిర్ణయించడానికి వీలవుతుంది. ఈ విధానాన్ని ఊసుపోక తిరిగే సోమరులు తయారుచేసింది కాదనీ, నిపుణులు పరిశీలించి బిడ్డల కిది మేలని నిర్ధారణ చేసినదనీ తెలుసుకున్నప్పుడు పై భయాలకీ సంకోచాలకీ తావుండదు.

బేసిక్ విద్యావిధానం సవ్యమైనదేనని అందరూ అంగీకరించారనుకుందాం. ఇంక దీన్ని అమలు జరపడం ఒక పెద్ద సమస్య. దేశంలోని బాలబాలికలందరికీ విద్య లభించేలా చూడాలి. కొన్నిప్రాంతాల్లో నిర్బంధ విద్యావిధానం అమలు జరిపారుకాని అనుకున్నంత తృప్తి కలగలేదు. అందువల్ల ధనం హెచ్చించడం ఒక్కటే చాలదని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రజల్లో దారిద్ర్యం ప్రతిబంధకంగా కనిపిస్తోంది. విద్యార్థుల్ని ఆకర్షించడానికి కొత్తపాఠశాలలు స్థాపించినంతమాత్రంచేత చాలదు. వారిని పోషించాలి కూడా. విద్యార్థుల్లో అత్యధిక సంఖ్యాకులు పేదవారే కావడంవల్ల ఖర్చుభారం ఎంత ఉంటుందో గ్రహించవచ్చును. ఇక్కడే ప్రజలపైన ఒక బాధ్యత ఉంది. వారి బాధ్యత నిర్వహించేవరకూ విమర్శలన్నీ ఉత్తకబుర్లకిందికే లెక్కవస్తాయి. ప్రాథమికవిద్యావ్యాప్తి ఆశయం నెరవేరదు. ప్రజలు ప్రభుత్వానికి తోడ్పడాలి. అదేమీ కష్టం కాదు; సులువే. ప్రతిగ్రామంలో ప్రజలు పదెకరాల చొప్పున పాఠశాలలకోసం ప్రత్యేకించాలి. పాఠశాలాధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ భూమిని సద్వినియోగం చేస్తారు. దానిపైన వచ్చే పంటవల్ల విద్యార్థులకి ఒక పూట ఆహారం సమకూరుతుంది. ప్రజలీ సూచనని ఆలోచించి అమలు జేరపగలిగితే ఒక పెద్ద సమస్య పరిష్కారమైనట్టే. ఇంకే చిక్కులూ అడ్డురావు. దీనివల్ల భారాన్ని ప్రజలూ ప్రభుత్వమూ సమానంగా పంచుకున్నట్లవుతుంది. ప్రజలకూ అంతభారంగా ఉండదు.

మాధ్యమికవిద్యవిషయంలో ఇప్పటివరకూ సాధించినది చూసుకుంటే మిగతా దేశాలతో ఇంచుమించు సమానస్థితిలోకి వచ్చినట్లు బోధపడుతుంది.

ఉన్నతవిద్యలో ప్రభుత్వం అనేక కొత్త కళాశాలలు స్థాపించింది. ఇంకా స్థాపిస్తోంది. విశ్వవిద్యాలయాలు సర్వస్వతంత్రమైనవి. చెన్నపట్నంలోని ప్రెసిడెన్సీకాలేజి అభివృద్ధికి తయారుచేసిన కార్యక్రమం అందరి దృష్టినీ ఆకర్షించింది. రామన్‌కమిటీ నివేదికను అమలు జరపాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ కాలేజీలో ఇంకా ఉన్నతవిద్యను ఏర్పాటు చేసేవిషయంలో ప్రభుత్వం కమిటీ సూచనల్ని ఆమోదించింది. ప్రెసిడెన్సీకాలేజిని ఆదర్శప్రాయమైనదిగా వృద్ధిపరచడం మా ఆశయం.

మొదట చెప్పినట్లు పెద్ద ఆశలేవీ పెట్టుకోలేదు. పెద్ద విద్యావిధానసంస్కరణ లేవీ తలపెట్టలేదు. చెయ్యదలచుకున్నకొద్దీ ఒక మంత్రి చేయగలిగితే చాలు అది కనీసావరం కాబట్టి నా మంత్రిత్వాన్ని సార్థకపరుచుకున్నట్లు ఆనందిస్తాను. కాని ఎవరి తరఫునైతే నేను మంత్రిగా వ్యవహరిస్తున్నానో ఆ ప్రజల సహాయం సహకారం లభించకపోతే ఈ కొద్దీ కూడా సాధ్యం కాదు.


ఈ హేతువుకోసమైనా, ప్రభుత్వ విద్యాపాలనవిధానంగురించి ప్రజల్లో ఏర్పడిన అపోహల్ని తొలగించడానికి నేను యత్నించాలి. లేకపోతే ప్రజల సహకారం లభించదు. ఉదాహరణకి క్రైస్తవులు ప్రభుత్వం మతపక్షపాతం వహిస్తోం దనుకుంటున్నారు. పాఠశాలల ఆస్తులకు సంబంధించిన శాసనం ఇటువంటి అపోహకు అవకాశ మిచ్చింది. ఈ ఆస్తులకు సంబంధించినంతవరకూ ప్రభుత్వం అన్నిమతాలవారినీ ఒకేరీతిగా పరిగణిస్తోంది. విద్యాలయాలు స్థాపించడమంటే లాభకరమైన వ్యాపారమని తలుస్తున్నారు కొందరు. ఆ రీతిగా అనేకమంది బయలుదేరి లాభార్జనకీ, ఆశ్రితపక్షపాతానికీ దిగుతున్నారు. మనదేశంలో విద్య సక్రమంగా వ్యాపించాలంటే ఇటువంటివారిని రంగంనుంచి తొలగించాలి. అందువల్లనే ఆస్తులు పెట్టుబడులగురించి ప్రభుత్వం ఈ శాసనం తెచ్చింది మతపక్షపాతదోషాన్ని ప్రభుత్వానికి అంటగట్టడం న్యాయంకాదు. క్రైస్తవసంస్థలు ఈ పని చేస్తున్నాయి. బాంకులు అప్పులిచ్చేముందు అప్పు తీసుకునేవారి ఋణం తీర్చే తాహతుని పరిశీలించినట్లే విద్యాలయాలు స్థాపించదలుచుకున్నవారు విద్యావ్యాప్తికోసమేగాని కేవలం లాభార్జనకోసం తయారుకాకుండా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తోంది. అంతేగాని అనవసరభయాలకి తావు లేదు:

అవసర సమయాల్లో పాఠశాల భవనాల్ని ప్రభుత్వం స్వాధీనపరుచుకోగలదనే ఏర్పాటుగురించికూడా ఈరీతిగానే కొందరు అనవసరభయాలు వెలిబుచ్చారు. వానిని తీసుకుని శాశ్వతంగా తానే నడపాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని, స్పష్టంగా నేను చెప్పాలి. విద్యార్థుల్ని అకస్మాత్తుగా సంవత్సరంమధ్యలో పాఠశాలనుంచి వెళ్లగొట్టడం మొదలైనవి సంభవించకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించడానికే ఈ ఉత్తరువు తెచ్చింది. విద్యాలయ యజమానులు చిత్తం వచ్చినట్లు ప్రవర్తిస్తోంటే నిస్సహాయంగా చూస్తూ కూర్చోడం ప్రభుత్వాని కిష్టం లేదు. ఆవిధంగా స్వాధీనపర్చుకున్న విద్యాలయాల్ని సంవత్సరాంతంవరకూ, ఆ పాఠశాల విద్యార్థులకు మరొక ఏర్పాటు జరిగేవరకూ ప్రభుత్వం నడుపుతుంది.

ప్రభుత్వచర్యలపట్ల అపోహలు పోగొట్టుకుంటే ప్రజలు విద్యావ్యాప్తికి ఎంతో తోడ్పడవచ్చును. ప్రజల తోడ్పాటు లేనిదే విద్యావ్యాప్తి దుస్సాధ్యం.

గృహవసతి సమస్య

గౌ॥ శ్రీ నీలం సంజీవరెడ్డి



ప్రస్తుతము దేశములో గృహవసతిసమస్య చాలమందిని కష్టపెట్టుచున్నది. దిన దిన జనాభివృద్ధికిని, నూతన గృహనిర్మాణమునకును యేలాటి సంబంధముగూడ లేకుండ బోవుచున్నది. యుద్ధానంతరము యిది మరింత యిక్కట్టుగా మారినది. గృహావసరవస్తుసముదాయముల సేకరించుట గొప్ప సమస్యగా యేర్పడినది. ప్రస్తుతము యిట్టి వస్తువుల ఉత్పత్తియే తగ్గినదనుటలో సందియము లేదు. పరదేశములపై నాధారపడిన మన రాజధాని మరింత యిక్కట్టులకు పాలైనది.

2. ఈ సమస్యను యెదుర్కొని ప్రజాబాహుళ్యమునకు గృహవసతి నేర్పరుప ప్రభుత్వము ప్రయత్నములు చేయుచున్నది. సర్వజనులకును ప్రభుత్వమే ఉచితముగా గృహవసతి కల్గించబూనుకొన్నయెడల ప్రభుత్వ రాబడి చాలదు. అంతేకాక అది మంచిపద్ధతిగూడ కాదు. కాన యిప్పట్లో నుండు గృహములనే అనుకూలరీతి సర్వజనులకు ఉపయోగపడుటకుగాను, ధనికులు అధికలాభములకై కల్గించు చిక్కులను తొలగించుటకును, ఒక శాసనమును ప్రభుత్వమువారు అమలు పరచినారు ఇట్టి శాసనము మాత్రము సర్వజనోపకారిగా నుండజాలదు ప్రస్తుత ముండు యిండ్లు యిప్పటి జనాభాకు చాలవు గాన విరివిగా యిండ్లు కట్టించుటకు అనువగు మార్గములను, తగిన సహాయములను కలిగించవలెను. ఇట్టి నూతన గృహనిర్మాణములో చాల యిబ్బందు లుండు మాట వాస్తవమే. ఇట్టి యిబ్బందులనుండి విడివడుటకు ప్రభుత్వము ప్రయత్నించుచున్నది

3. ఇప్పట్లో నానావిధములైన తరగతులు ప్రజలలో యేర్పడినవి. ధనికులు; మధ్యతరగతివారు; బీదలు, ముష్టివారు మొదలయినవారు. ధనికులు ప్రభుత్వసహాయమక్కరలేకనే గృహములను నిర్మించుకొనగలరు. మధ్యతరగతివారికి యేదో కొంత ధనమున్నను పూర్తిగా స్వంత సహాయముతో గృహనిర్మాణము సాధ్యముగాదు. అట్టివారికి కోఆపరేటివు సొసైటీలద్వారానో, గృహనిర్మాణ సొసైటీల ద్వారానో, దీర్ఘకాల వాయిదాలతో అప్పుల నిచ్చి, యింటికి కావలసిన అవసర వస్తువుల నొసంగి చక్కని ఆరోగ్యకరమైన వసతుల నేర్పరచి ముఖ్యావసరములను వదలక గృహనిర్మాణానికి తోడ్పడవలెను. బీదలకును, ముష్టివారికిని వసతు లేర్పరచవలెనన్న అనాథ శరణాలయాలను, ఉచిత వసతిగృహములను నడుపవలెను.

4. గృహవసతికి మార్గములు నాల్గున్నవి. మొదటిది స్వలాభములకు, స్వంత అనుకూలములకును, స్వ సౌఖ్యములకును కట్టుకొను ధనికుల గృహములు. రెండవది వ్యాపార చింతనముతోను, లాభాపేక్షతోను కట్టి బాడుగుల కొసగుటకై నిర్మించుభవనములు. మూడవది ఫ్యాక్టరీల యొక్కయు, మిల్లులు, కంపెనీలు, రైల్వేల యొక్కయు యజమానులు తమ తాబేదారులకు కట్టించు కాలనీలు. నాల్గవది ప్రభుత్వము వారున్ను, మునిసిపాలిటీలున్ను వారి ఉద్యోగస్థులకు కట్టించియిచ్చు గృహములు. ఈ నాల్గింటిలో రెండవది పెట్టుబడికి తగిన ఆదాయమునకుగానున్ను, మూడు నాల్గు మార్గములలో ఫ్యాక్టరీలోని ప్రభుత్వపు తాబేదారుల కొసగు వేతనములలో కొంత భాగమును మాత్రము యిండ్లకై వెచ్చించిన ధనమునకు ప్రతిగా తీసుకొనవలెనన్ను, లక్ష్యములు కలిగియుండును. ఇవన్నియు ప్రజాబాహుళ్యమునకి అంతగా అనుకూలించవు. ఇంతకంటె మంచిమార్గము కోఆపరేటివు సంస్థలద్వారా విరివిగా గృహనిర్మాణానికి తోడ్పడుటయే. ఈ సంస్థలకు తక్కువ కష్టము, మితమైన ధనవ్యయముతో కావలసినన్ని గృహవసతుల నేర్పరచి ప్రజారోగ్యమును, ముఖ్యావసరములను కాపడుటయే ముఖ్యోద్దేశము. ఈ సంస్థలు కొంతమందిని సంఘసభ్యులుగా చేర్చుకొని, ప్రభుత్వమునుండి అప్పుగా కావలసిన ధనమును సేకరించి, సభ్యులకు కావలసిన మితఋణములను దీర్ఘ వాయిదాలతో నొసంగి, తమ ఆదాయములలోని కొంత భాగముతోనే సులభమైన కంతులతో యిరువదిసంవత్సరములలో తీర్చు నిబంధనలపై నిచ్చెదరు. ఈ సంస్థలకు మితిమీరిన ఆదాయము ప్రధానము గాదు ఇండ్లు లేనివారికి యింటివసతి కల్గించుటె ప్రధానాశయము కలిగినవారికి మరింత కల్గించుట కాదు దీని యుద్దేశము. ఇండ్లు లేనివారిని మాత్రమే యిందులో సభ్యులుగా చేర్చుకొందురు. ఇట్టి సంస్థలు ప్రతియొకరును తనకుతాను కష్టించుటకును, సంఘమునకు పాటుపడి సంఘబలమును గూడ అభివృద్ధి కలుగజేయుటకును మార్గములను చూపెట్టును. ఇట్టి సంస్థలకు కావలసినంత సహాయముచేసి వీని అభివృద్ధికి ప్రభుత్వముతోబాటు ప్రజలు గూడ పాటుపడవలెను.

5. ఎచ్చటెచ్చట గృహ సౌకర్యములు తక్కువగా నున్నవో విచారించి ప్రభుత్వమునకు కావలసిన వివరములను తెల్పుటకుగాను పురపాలక సంస్థలుండు గ్రామాలకును, మేజరు పంచాయితీలుగల గ్రామాలకును కమిటీల నేర్పరచినారు. ఇట్టి కమిటీలు 76 మునిసిపలు సంస్థలలోను, 199 మేజరు పంచాయితీలలోను యేర్పరుపబడినవి. ఈ కమిటీలనుండి చాలభాగము వివరములు వచ్చినవి. అట్టివాటి కన్నిటికిని కోఆపరేటివు బిల్డింగు సంస్థల నేర్పాటు చేయుటకు కోఆపరేటివు రిజిస్ట్రారుకు ఉత్తర్వు లివ్వబడినవి.

6. ఇట్టి సంస్థలకు కావలసిన చక్కని బయలు ప్రదేశములను ప్రభుత్వము చట్టరీత్యా అక్వైయరు చేసి యిచ్చును. ఈ సంస్థలకు ఋణముల నిచ్చుటకుగాను ప్రభుత్వమువారు సంవత్సరపు బడ్జెటులో ఒకకోటి రూపాయలు కేటాయించినారు ఈఋణములకు పూర్వమువలె నాల్గుపర్సెంటు వడ్డితోగాక మూడున్నర పర్సెంటుమాత్రమే తీసుకొనుటకు నిర్ణయించబడినది. గతమార్చి నెల 15వ తేదికి 231 సొసైటీలు గృహనిర్మాణ కార్యక్రమమును అమలులో పెట్టినవి ఈ సొసైటీలు 22, 204 యిండ్లు కట్టుటకు నిశ్చయించి యిప్పటివరకు 225 యిండ్లు కట్టినవి ఇట్టి గృహనిర్మాణ స్కీములలో ముఖ్యముగా నచ్చట పేర్కొనదగినవి రెండు గలవు అడయారులో కట్టిన కాలనీలు, కాంప్రడి కౌను షిపుస్కీము మద్రాసు సిటీ గృహనిర్మాణసొసైటీ అడయారులో చాల భాగము 340 యిండ్లను కట్టించినది. కొద్ది కాలము క్రితమే మన రాష్ట్రపతియైన పట్టాభిగారు దీనిని ప్రారంభించి గాంధినగరమని నామకరణము చేసిరి. ఈ సొసైటీ యింకను మరికొన్ని కాలనీలను అడయారులోను, మైలాపురములోను, అయనవరములోను కట్టుటకు నిర్ణయించియున్నారు. అయనవరములో యిప్పటికి నాలుగు మాడలు గృహములు కట్టబడినవి. ఇవి ముఖ్యముగా సాధారణ మధ్యతరగతివారికి చాల అనుకూలముగా నున్నవి. యిందులో ఒక్కొక్కటి 3,800/- రూపాయలకు మించక, చూచుటకు చాల అందముగాను, అనుకూలముగను ఉన్నవి. మిగిలిన రెండుయింతకన్న కొంచెము పెద్దవి 5000/- లేక 6000/- రూ.పాయల వెల యగును.

7. అన్నియు సిటీల, టౌనుల యుపయోగార్థమేగాక, పల్లె ప్రజలకు గూడ గృహవసతి గల్పించుటకు ప్రభుత్వమువారు నిర్ణయించియున్నారు. యిప్పటికి 11 స్కీములు నేతగాండ్ర కోఆపరేటివు సంస్థలు నెరవేర్చుటకు పూనుకొని ప్రభుత్వపు ఋణములుగూడ తీసుకొన్నవి. ప్రావిన్షియలు గృహనిర్మాణకమిటీ యిరువదియేండ్ల స్కీము నొకదానిని 980 కోట్ల రూపాయలతో 42 లక్షల యిండ్లను పల్లెప్రజలకుగాను కట్టించుటకు సిఫారసు చేసియున్నది. కాని దీనికన్న సులభముగా నుండి యింటికి 500/-ల నుండి 1000/- రూపాయలకు మించకుండుటకు యోచించుచున్నారు. సామాన్య ప్రజల యుపయోగార్థమైయున్న, ప్రభుత్వమునకు ఖర్చు తగ్గునట్లును కోఆపరేటివు సంస్థలకు ఒక్కొక యింటికి 10,000/-లకు మించి అప్పుల నివ్వగూడదని ప్రభుత్వమువారు నిర్ణయించినారు. తక్కువ వెలగల యిండ్లు కట్టుటకు సొసైటీలకు తెలియబరచినారు.

8 సామాన్య ప్రజల కందుబాటులో నుండునట్టి స్కీములనే తయారుజేసి కోఆపరేటివు సంస్థల ద్వారా కావలసినన్ని సదుపాయములు గల గృహవసతి గల్పించి, ప్రజల ముఖ్యావసరములలో నొకటైన దీనిని నెరవేర్ప ప్రభుత్వము ప్రయత్నించుచున్నది. ఇట్టిదానికి ప్రజల తోడ్పాటుగల్పించి, కోఆపరేటివు సంస్థలయందు నమ్మకము గల్గి అందులో సభ్యులుగా చేరిన యెడల మరింత శీఘ్రగతి దీనిని కొనసాగించ వచ్చును.

రెండేళ్ల స్వరాజ్యం

(17-వ పేజీ తరువాయి)

భవం లేని ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వం పేరిట వ్యాపారస్థులై ప్రజలకు అసౌకర్యాలను అసౌఖ్యాన్ని కలిగిస్తున్నారు. అధికాహారోత్పత్తి అంటూ ఢిల్లీనుంచి పల్లీవరకు నాయకులు గొంతు బ్రద్దలు కొట్టుకోవడం, మేడితోకలు పట్టుకొని మహామాన్యులు ఫోటోలు తీయించుకుని ఆదర్శాలు చూపించడమే కాని ఉత్పత్తి విషయంలో ఏమీ వృద్ధి కనుపించదు. పర్యవసానంలో వరిపంట నానాటికీ క్షీణించడం నిరుడు సుమారు 4 లక్షల ఎకరాల వరిసాగు ఇతర పంటల క్రిందికి పోవడం జరిగింది. వరిసాగు, ఇతర తిండి పంటలసాగు ఆర్థికంగా లాభదాయకం కాకపోవడం చేతనూ, ప్రొక్యూరుమెంటు పేరిట రైతులు బాధలు పడలేకనూ తిండిపంటలు మాని వేస్తున్నారు. ఈ విషయంలో కేంద్రానికి కాని రాష్ట్రాలకుగాని సమగ్రమైనట్టి నిశ్చితమైనట్టిన్ని పంథా లేని కారణంచేత ఫలితములు శూన్యము లగుచున్నవి.

ఇంకా ఈ విధంగా తర్జనభర్జన చేస్తే రాష్ట్రప్రభుత్వాలు అనేక విధాలుగా లోపభూయిష్టమై యున్నవి. దీనికితోడు ఈ లోపాలను ఆస్కారంగా తీసుకొని అసంతృప్తిని పెంపొందించే రాజకీయ ఆందోళకులు కమ్యూనిస్టులు కానివ్వండి మరొకళ్లు కానివ్వండి, కాంగ్రెస్‌పై దెబ్బతీయడానికి సంసిద్ధులై ఉన్నారు.

ఈ స్థితిలో పాలకులు తమకున్న ఇబ్బందులను ఏకరువు పెట్టుకోవడంవల్ల ప్రయోజనమేమీ లేదు. ప్రజల ఓర్మికి కూడా ఒక హద్దుండక మానదు. గమ్యస్థానం సుస్థిరమై దానివైపుకు ప్రయాణం సాగేటప్పుడు, ప్రయాణం మందగించినా వాహనం నిదానమైనదైనా ఫరవాలేదు. ప్రజలు ఓపిక పడ్తారు. కాని గమ్యస్థానమొకచోట నుండగా ప్రయాణం వేరొకవైపు సాగుతుంటే ప్రయోజనం లేదు. ప్రజలు ఓర్మి వహించలేరు. లక్ష్యం నిర్ణయం గాక, దారితెన్ను లేర్పడక తిరుగుతుంటే, మా సంకల్పం మంచిది మీరు ఓపికపట్టండి అని ప్రజలను హెచ్చరిస్తూంటే ప్రజలకు సంతృప్తి కలుగదు.

కాంగ్రెస్ మహానాయకులు ఈ అసంతృప్తిని గుర్తించి కాంగ్రెస్‌కు పునరుద్దీపనం కలిగించే మార్గాలను నిర్ణయిస్తేనే కాంగ్రెస్‌కు భవిష్యత్తు.

కాంగ్రెస్ పాలన

(16-వ పేజీ తరువాయి)

ఇండియా ఈ మధ్య ఒక మహాకార్యాన్ని సాధించింది. అది కామన్‌వెల్తుతో మన సంబంధం. ఒక వంక రిపబ్లికన్ రాజ్యంగావుంటూ, కామన్‌వెల్తులో సభ్యత్వాన్ని గడింగడం మహత్కార్యసాధనమే అని చెప్పాలి.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లయింది.. బ్రిటిష్‌వారు కష్టపడి 150 సంవత్సరాలుగా నిర్మించిన ఉక్కువంటి ప్రభుత్వ యంత్రాంగం ఈ రెండేండ్లలోను తుప్పుపట్టిపోయింది. దేశభక్తి వ్యాపారంక్రిందకు దిగి, బ్లాక్ మార్కెటింగ్ హెచ్చి, అధిక లాభాపేక్ష పెరిగి, సంఘ వ్యతిరేకులకు గౌరవ ప్రపత్తులు కలిగి, ఈయంత్రం కృంగి కృశించిపోయింది. ఇంతవరకు నిద్రాణంగా వున్న స్వలాభాపేక్ష, స్వార్థపరత్వం దేశీయుల చేతుల్లోకి అధికారం రావడంతో రాజిమండిన నిప్పులాగా జాజ్వల్యమానాలైనాయి. ఇందుకు బాధ్యత చాలా భాగం కాంగ్రెసు నాయకుల నెత్తిమీద పెట్టవలసివస్తున్నది. గాంధీజీ అన్నా, గాంధీజీ సిద్ధాంతాలన్నా ప్రేమను, నమ్మకాన్ని ఒలకబోస్తున్నట్లు కనబడటం, అసలు ఆచరణ అంటూ వచ్చేటప్పటికి తమ ఇష్టానుసారం నడవటం వీరికి పరిపాటి అయిపోయింది. ఉద్యోగాలకోసం వేట, తేలిగ్గా డబ్బు సంపాయించే పద్ధతులు వీరిని బాగా ఆకర్షించాయి. ఇందులో కొందరు దుఃఖభాగులు మురాలను కట్టడం ప్రారంభించారు. వేరె పార్టీలను సృష్టించడం ప్రారంభించారు. దీనితో దేశ పంపాలన దెబ్బతిన్నది. రోజురోజూ వీరి పరిపాలనా యంత్రాంగంలో వేలుపెట్టడం ప్రారంభమైంది. దానితో జగద్ధితంగా జరుగవలసిన ప్రభుత్వ కార్యకలాపాలన్నీ పూర్తిగా స్తంభించినట్లయిపోయింది. దేశంఅంటే ప్రేమ,పార్టీ అంటే విశ్వాసం వీరిలో లుప్తమైపచ్చి స్వార్థపరత్వం వారిలో ఏలుబడి సాగించింది.

ఇన్ని కారణాలవల్ల ఈసంవత్సరం చీకటివెలుగుల కలయికగా సాగిపోయింది. కాని సంవత్సరం అంతమై మరుసంవత్సరం దాన్ని ఆక్రమిస్తున్న కొద్దీ చీకటులు దట్టమై, కారు నల్లని కాళరాత్రులు ముందు వున్నాయని హెచ్చరిస్తున్నాయి.

అయినా ప్రజలలో మాత్రం ప్రజాస్వామ్యంపట్ల విశ్వాసం అచంచలంగానే వుంది. ఈ కష్టాలు, ఈ నిష్ఠురాలు, ప్రజాస్వామ్య ధర్మావతరణవేళ కాలం అనే వనిత పడుతున్న కానుపు నొప్పులవంటివని వారు భావిస్తున్నారు. మనం అనుకున్న దానికంటే ముందుగానే కాంగ్రెస్ ఏకపక్ష ప్రభుత్వానికి బలిష్ఠమైన, సౌమనస్యమైన ప్రతిపక్షం ఏర్పడనూ వచ్చు; దానితో దేశమూ, దేశప్రజా బాగుపడనూ వచ్చు.

విజ్ఞాన విశేషాలు:

అందరూ ఒక్కరీతిగా ఉండరు

[శ్రీ రాస్వెల్ గెలాషర్]

రాఘువుడికి పదహారేళ్లు వెళ్లాయి. కాని పొట్టిగా పీలగా నీరసంగా ఉంటాడు. ఏడాది క్రితం వరకూ స్కూల్లో చక్కగానే చదివేవాడు. ఈ యేడు చదువుమీద శ్రద్ధ ఏమీ తగ్గకపోయినా మార్కులు మాత్రం తగ్గిపోయాయి. చదువుమీద ఎలాగైనా శ్రద్ధ సన్నగిల్లింది. ఇంటిదగ్గిర అంతచనువుగా ఉండడం లేదు. పండగలకీ ఫలహారాలకీ నలుగురితో చేరడం మానేశాడు. తల్లి తండ్రి బెంగపెట్టుకున్నారు. డాక్టర్‌కి చూపించారు. డాక్టరు తండ్రిని కూచోమని చెప్పి రాఘువుణ్ని వేరే గదిలోకి తీసుకెళ్ళి పరీక్ష చేశాడు, ఏవేవో అడిగాడు. కుర్రవాడి నిరుత్సాహానికి అశ్రద్ధకీ కారణం తెలుసుకొన్నాడు మరేం లేదు శరీరంలో పెరుగుదల అంత చురుగ్గా లేదు అందులో దోష మేమీ లేదు

పక్కింటి సత్యాన్ని చూస్తే వాడికి పధ్నాలుగోఏడు ఇంకా వెళ్లలేదు రాఘువుడికంటె పుష్టిగా బలంగా ఉంటాడు ఒడ్డూ పొడుగూ ఎక్కువ. కానయితే చదువులో బొత్తిగా వెనకపడ్డాడని టీచర్లు చెప్తున్నారు. చదువుతున్నది ఇంకా మూడోఫారమే "మనిషెంత ఉంటేం, బుద్ధి వికసించకపోయాక" అంటారు టీచర్లు. ఎప్పుడూ పసిపిల్లవాడిమాదిరిగా చిలిపి పనులు చేస్తూ ఉంటాడు

సత్యం పెంకితనం ఎక్కువయింది. తండ్రికి విసుగెక్కువయింది తల్లిని ప్రాణాలు తోడుతున్నాడు. ఒకసారి తల్లి తండ్రితో చెప్పింది; "ఎప్పుడూ విసుగ్గా ఉంటాడు. అలిసిన ట్లుంటాడు. చీకటిపడకముందే అన్నం పెట్టమంటాడు. అన్నం తిన్న వెంటనే పక్కెక్కి తెల్లారి ఎనిమిది తొమ్మిదింటివరకూ లేవడు ఒంట్లో పనిగాలేదో ఏమో చెప్పినమాట వినడు. ఏమీ చెప్పడు."

సత్యంతల్లి, తండ్రికూడా బెంగపెట్టుకున్నారు డాక్టర్‌కి చూపించారు

నిజానికి రాఘువుడు సత్యం తినే ఆహారం ఒకటే ఒకడెక్కువా ఒకడు తక్కువా తినరు ఇద్దరూ ఆరోగ్యవంతులే, ఏజబ్బూ లేదు. పిల్లల పెరుగుదలలో తేడా ఉంటుంది కొందరిలో చురుగ్గా మార్పులు వస్తాయి. కొందరు మందంగా ఉంటారు ఈ వయసు పిల్లల బరువు 70 పౌనులున్నా 130 పౌనులున్నా ఆశ్చర్యపడనక్కరలేదు అందరూ ఒక్కరీతిగా ఉండరు అందరికీ తలోక విధం ఉంటుంది స్కూళ్లచదువుల్లో హెచ్చుతగ్గులూ అవీ మాని బెంగలుపెట్టుకోవడం అనవసరం.

కొందరంటారు; "మావాడి కెప్పుడు జ్ఞానం వస్తుందో తెలియదు. బజారు కెళ్ళడం, ఒక వస్తువుకొనడం, ఏమీ తెలియదు ఎప్పుడు అన్నీ నేర్చి చేతికొస్తాడో తెలియడం లేదు."

ఇది కొందరపాటని చెప్పాలి. ఫలాని వయస్సుకి కుర్రవాళ్లకి జ్ఞానం తెలిసిరావాలని స్వయముగా కార్యకలాపాలు చేతకావాలనీ ఏమీనిర్ధారణ లేదు కొందరికి ముందే చేతనౌతాయి. కొందరికి ఆలస్యం కావచ్చును. కుర్రవాళ్లు మొదట నీరసంగా ఉన్నా పొట్టిగా ఉన్నా సరే, లేక మరీ "చెట్టు" లాగా "దున్న" లాగా ఎదిగిపోతున్నా సరే చురుగ్గా ఆరోగ్యంగా ఉండగలరు. తేడాలకి చింతపడనవసరము లేదు

పిల్లల పెంపు గురించి శ్రద్ధవహించడం అవసరమే కాని వాళ్లల్లో ఏవో దోషాలున్నాయని, జబ్బులున్నాయని దాదాపు అందరు తల్లిదండ్రులూ బెంగపెట్టుకుంటూనే ఉంటారు అది అనవసరం. చెయ్యదగినదల్లా ఏమిటంటే కడుపునిండా తిండి పెట్టి ఆపేక్షతో ఆదరిస్తే చాలు. వాళ్లంతట వాళ్లే పెద్దవాళ్లవుతారు. అయితే చింతపడనూ కూడదు. వాళ్లని కంగారుపెట్టి వాళ్లలో ఉత్సాహాన్ని చంపకూడదు

కుర్రవాళ్లెప్పుడూ సమర్థులనిపించుకోడానికి ప్రయత్నిస్తారు అపేక్ష ఆదరం ఇస్తే చాలు, తామే కాపాడగల సమర్థులని కూడా నిరూపించుకోడానికి యత్నిస్తారు అశ్రద్ధ, చెప్పినమాట వినకపోవడం తరుచు ఇంటిపట్టున వుండకుండా స్వేచ్ఛగా తిరగడం (అప్పుడప్పుడు కుట్టీలు తెచ్చినా సరే) నిరసించకూడదు.

వాళ్లలో ఏవో భావాలు వారిని పురికొల్పుతున్నాయనీ, అవన్నీ వాళ్లకి అవసరమైనవనీ లోలోపల జరుగుతుండే పరివర్తనకి సూచనలని గ్రహించి ఊరుకోవాలి. నిత్యమూ బెంగపెట్టుకుని వాళ్లని కాపాడాలని వెయ్యికళ్లతో కాచుకొడంకంటె వాళ్లకి చెయ్యగల అపకారం మరొకటి లేదు. వాళ్లతోనూ వీళ్లతోనూ పోల్చి చెప్పుకోడం మంచిది కాదు.

శరీరం పెరుగుదలలో ఎన్నితేడాలుంటాయో, మనోవికాసంలోనూ, మనోనిగ్రహం, భావపరివర్తన వివేచన, పరిగ్రహణ పారీణతలోనూ కూడా అన్ని తేడాలుంటాయి పిల్లలింకా ముందుగానే పెరిగి పెద్దవాళ్లైతే బాగుండునని చాలామంది తలిదండ్రులు లోలోన అనుకుంటూ ఉంటారు బాగానే ఉంది కాని పిల్లల ఈడుకి వారిది తప్పు కాదుగదా పెరగకూడదని శకించి ఎవరూ కోబోరు కూడా ఇంక మిగిలేది, ఇవాళ కేడీగా తిరిగినవాడు రేపు స్కూల్లో మిత్రుడి మార్గవర్తనకి విసుక్కోవచ్చును. అటువంటిది జరుగుతూనే ఉంటుంది

"వీడికి చదువులో ఏనాటికి శ్రద్ధ కలుస్తుందో తెలియకుండా ఉంది ఎప్పుడూ బంతులూ ఆటలూ, తిరగడంతప్ప ఏమీ గిట్టవు. మనకి డాబాయేగాని మేడెందుకులేదు? ఇలాటి ప్రశ్నలేస్తాడు." అంటారు కొందరు.

అసలు సరిగ్గా ఈయీడుకి పిల్లలకి చదువుపట్ల శ్రద్ధ కలుగుతుందని ఎవరూ నిర్ధారణగా చెప్పలేరు

రాము డున్నాడంటే వాడు అదేపనిగా కూచుని మాట్లాడగలడు అయితే అది ధోరణి అని చెప్పగూడదు ఉత్సాహంగా ఏవేవో చెప్పబోతూ ఎవరినైనా గంటలాది కూర్చోపెట్టగలడు రెండేళ్లు నాదగ్గిరకే నిత్యం వచ్చి కూచుని కబుర్లు చెప్తూ ఉండేవాడు బడి విషయంమాత్రం ఎప్పుడూ ఎత్తేవాడు కాడు. ఉన్నంత సేపూ వాడే మాట్లాడేవాడు ఎంత సేపున్నా నేను సలహాలివ్వడం, బుద్ధి చెప్పడం లేదు. తల్లిదండ్రులు చెప్పి చెప్పి చివరికి విసుగెత్తి ఊరుకున్నారు చివరికి అకస్మాత్తుగా రాముడిలో మార్పు వచ్చింది. ఇది చాలా విచిత్ర మనుకున్నారు తలిదండ్రులు. కాని ఆ మార్పేమీ విచిత్రంకాదు. అది అందరిలోనూ కలిగే సహజమైన మార్పే

రాముడికి చదువులో శ్రద్ధ పట్టింది నా దగ్గరావడం తగ్గించాడు. ఒకరోజున నావద్దకి తుఫానులా వచ్చాడు తనకి క్లాసులో వచ్చిన మార్కులు చూపించాడు. క్లాసులో ఫస్టుగా వచ్చాట్ట తను చదివిన పుస్తకాల్ని గురించి ఏకరువు పెట్టాడు వచ్చినట్టే తుఫానులా మళ్లీ వెళ్లిపోయాడు

ఈ ఆరంభశూరత్వంకూడా త్వరలోనే పోతుంది కాని శ్రద్ధ చచ్చిపోలేదు అజ్ఞేరుబ్బుడుకాదు నిజంగా పాఠాల్లో శ్రద్ధ పెట్టుకున్నాడు. ఇన్నేళ్లుగా నిద్రాణమైఉన్న శక్తిని వినియోగించి చదువుతున్నాడు ఈ మాదిరిగా అందరిలోనూ మార్పు రాకపోవచ్చును మార్పు అనేది అందరిలోనూ రాకతప్పదు అది ఫలాని వయస్సులో వస్తుందని చెప్పలేం. అందరూ ఒక్కరీతిగా ఉండరు.

యువకులు మరలూ యంత్రాలూ కారు ఒకే రూపంలో ఉండడానికీ, ఒకేరీతిగా నడవడానికి మధురవాయువులె గమనగతిని కానలేము ముందు కనిపెట్టలేము. వయోజనుల్లో ఉడిగిపోయే నూతన జీవనోత్సాహం వారిలో నిండి తొణికిసలాడుతూ ఉంటుంది

అంతే ఒక రీతిగా ఒకేరూపంలో ఉండాలంటే పావుల్లో అలంకరణకి బాగుండవచ్చు కాని మనుషులకి ఈ విధానం పనికిరాదు. వైవిధ్యం, జీవితానికి చమత్కృతి, ఆనందమ్ము ఇస్తుంది

[అట్లాంటిక్ మన్త్లీ]

పండిట్ నెహ్రూ విదేశాంగ విధానం

(19-వ పేజీ తరువాయి)

గాని ఈ సమస్యమీద కమ్యూనిస్టు వ్యతిరేక దేశాలలో విభేదాలు కలిగించడానికి ఇష్టపడడం లే"దని అన్నారు. దీనితో భారత దేశానికి ఇండోనీషియా స్వాతంత్ర్యంమీద ఉన్న అభిమానంకంటె కమ్యూనిస్టులు వ్యాపించిపోతారేమోననే భయమే ఎక్కువగా ఉన్నదని అందరికి స్పష్టమైంది. దానితో ఆంగ్ల రీతిజ్ఞులు "అమ్మయ్యా! ఇక బ్రతికాం"మని అనుకున్నారు.

ప్రపంచ రాజకీయ దృష్టిలో ఇండోనీషియా వ్యవహారాలలో పండిత నెహ్రూ చేతలకు ఎల్లాంటి అర్థం చెప్పవచ్చునో తేలిపోయింది. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి హెచ్. వి ఇవాట్ ఆ తరువాత విలేఖరులతో ముచ్చటిస్తూ దక్షిణాసియాలో కమ్యూనిస్టు వ్యతిరేక రాజ్యాల కూటమి "తప్పక సాధ్యమౌతుం"దని అన్నారు. "ఎకనమిస్టు" అనే విఖ్యాతాంగ్ల పత్రిక, ఇండోనీషియా వ్యవహారాలలో పండిత నెహ్రూ చేసినదిగొప్పరాజకీయజ్ఞతకు తార్కాణమని ఆసభ మితవాదదృక్పథం 'చాలా గొప్పగా' ఉందనీ వ్రాసింది. పండిత నెహ్రూ ఆ సభలో సభ్యులందరకీ వీడ్కోలు పలుకుతూ 'యూరోపు అమెరికాలు ప్రపంచ చరిత్రలో ప్రధాన పాత్ర వహించినవనీ, శాంతి సహకారాలకోసం ఆసియా కూడా ఇక్కడినించీ ప్రముఖ పాత్రవహింప గోరుతున్నదనీ అన్నారు. ఈమాటలకు ఎకనమిస్టు ఎగిరి గంతువేసింది

ఇండోనీసియా సన్నిహిత మిత్రులు మాత్రం ఇంతగా తబ్బిబ్బైపోలేదు. పాకిస్థాన్ కైమ్సు ఐక్యరాజ్య సమితి లోని పెద్ద పెద్ద రాజ్యాలు ఇండోనీసియాకు ఏదో వలకబోస్తాయని అనుకోవడం పెద్ద పొరబాటని ఢిల్లీ సమావేశంమీద దుమ్మెత్తిపోసింది.

కాని కమ్యూనిస్టు కూటమి ఇంకా ఎక్కువగా దుమ్మెత్తి పోసింది. పండిత నెహ్రూ ఇంత నిశిత విమర్శ వస్తుందని అనుకోలేదు. చైనా కమ్యూనిస్టు రేడియో ఆసమావేశానికి వచ్చిన ఆసియా దేశీయులను 'మతిపోయిన పెట్టుబడిదారుల వర్గ'మని నిందించింది. సోవియట్ మిలిటరీ గెజెట్ వీరందరినీ ఆంగ్ల అమెరికా సామ్రాజ్యవాదుల తొత్తులని ధిక్కరించింది.

బర్మావైఖరిమార్పు


ఇండోనీసియా సమావేశం అయిన తరవాత ఒక ప్రాతిపదిక తయారుచయ్యడము ఇండియా కామన్వెల్తులో ఉండడానికి అంగీకరించడము జరిగాయి. దీనివల్ల ఇండియాకు కామన్వెల్తులోని సామ్రాజ్యవాద దెశాలకు, మితవాద జాతీయవాద దేశాలకు మధ్యవర్తిగా ఉండే అవకాశం కలిగింది. బర్మాకూడా ఈదారే తొక్కింది. అసలు బర్మా సిలోను లాగ ఎప్పుడూ భారత దేశం తొక్కినదారిని పోతూనే వుంది ఇంకా బర్మా కరేన్‌ల తిరుగుబాటు, కమ్యూనిస్టుల విప్లవము అణచడానికి కామన్వెల్తు సహాయంకూడా కోరింది. ఈ సంవత్సరంలో ముందు సింహళంలో జరగబోయే కామన్వెల్తు రక్షణసమావేశంలో బ్రిటను అధికారంతో నిర్మింపబోయే దక్షిణాసియా కూటమికోసం ఇంకా గట్టి ప్రయత్నాలు జరుగుతాయి.

ఈప్రయత్నాలన్నీ సఫలమయ్యేలోపుగా యీ దక్షిణాసియా కూటమి భయంకరములైన అనేక బాలారిష్టాలు దాటవలసింగి. ఇండియా పాకిస్థానుల మధ్య బయలుదేరిన కాశ్మీర్ వివాదం ఉభయ పక్షాలకూ అనుకూలంగా పరిష్కారం కావడం కష్టము. మౌంటు బాటన్ మొదలైన బ్రిటిష్ రాజనీతిజ్ఞులందరు, ఇండియా పాకిస్థానుల మధ్య సుహృద్భావం అత్యంతావశ్యకమనీ, ఆసియా కమ్యూనిస్టు వ్యతిరేక రక్షణకు ఇది చాలా ముఖ్యమనీ నొక్కి చెప్పారు. దక్షిణాసియాకు మధ్యప్రాచ్య ప్రాంతంలో యూదులకు, ఆరబ్ జాతీయవాదులకు భయంకరమైన నిరోధం బయలుదేరింది ఇండోనీసియా నాయకులలో అనేకులప్పుడే వెనక్కి తగ్గతున్నారు. ఇందుచేత తీవ్రాభిప్రాయాలున్న వీరి అనుచరులు కమ్యూనిస్టు విప్లవవాదులలో కలిసిపోయే సూచనలు కనబడుతున్నాయి.


★ స్వతంత్రభారత, ద్వితీయవర్షం ★




స్వదేశసంస్థానాలను యూనియన్‌లో చేర్చిన తరువాత సంస్థానాధీశులకు దేశసేవకు అవకాశ మివ్వాలనే ఉద్దేశంతో భారతప్రభుత్వం వారిని గవర్నర్లుగా నియమించ తలపెట్టి, ప్రప్రథమంగా చెన్నరాష్ట్రానికి భావనగర మహారాజాగారిని గవర్నరుగా పంపింది.



రాష్ట్రప్రభుత్వపాలన సక్రమంగా జరపడానికిగాను కాంగ్రెస్‌లోని సర్వవర్గాల మధ్యనూ సమరసం చేకూర్చడానికి యత్నించిన శ్రీ పి. యస్. కుమారస్వామిరాజాగారు మద్రాసు ప్రధానిగా ఎన్నుకోబడ్డారు.



చెన్నరాష్ట్రంలో కమ్యూనిస్టులవల్ల ప్రమాదం ఎక్కువయి కమ్యూనిస్టుల అరాచక రాజకీయాల కిది సూచనగా గ్రహించి భారతప్రభుత్వం వివిధరాష్ట్రాల గవర్నర్లను సమావేశపరిచి శాంతి సాధనసమస్యలను చర్చించింది.



హైదరాబాద్ విషయంలో, భారతప్రభుత్వం "పోలీసుచర్య"కు దిగవలసి వచ్చింది. అయిదు దినాల్లో సంస్థానం భారతసేనల వశ మైంది. మేజర్ జనరల్ చౌదరి సంస్థానానికి మిలిటరీ గవర్నరుగా నియమింపబడ్డారు.



భాషారాష్ట్రవిచారణసంఘము (ధార్ కమిషన్) ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించే పక్షంలో చెన్నపట్నాన్ని ప్రత్యేక రాష్ట్రంగాగాని ఉపరాష్ట్రంగాగాని నిర్మించా లని సూచించింది



నాయకత్రయ సంఘము ఆంధ్రరాష్ట్రనిర్మాణాని కంగీకారం తెలుపుతూనే చెన్నపట్నంపై ఆంధ్రులు హక్కుల విడిచిపెట్టాలని షరతు విధించడంతో ఆంధ్రదేశాన్ని అలుముకొన్న అసంతృప్తిని విజయవాడలో నిఖిలాంధ్రసంఘసమ్మేళనం ప్రకటించింది

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.